# సినాదం

నిఖార్సైన జర్నలిజం

సంపుటి : 22 సంచిక : 305 పేజీలు : 12, వెల రూ. 5 రూ/ మంగళవారం 10 - 02 - 2026

Published by vijayawada : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool





## విద్యార్థుల ఆరోగ్యంపై
# నిర్లక్ష్యం వద్దు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- క్షేత్రస్థాయిలో పర్యటించండి
- వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశం
- హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై కీలక వ్యాఖ్యలు
- అధికారులదే బాధ్యత అని హెచ్చరిక
- క్షేత్రస్థాయిలో పర్యటించి పాలన అమలును పరిశీలించాలని మంత్రులకు సూచన
- గత ప్రభుత్వ అప్పుల వల్ల అధిక వడ్డీలు చెల్లిస్తున్నామని వెల్లడి త్వరలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తీసుకురానున్నట్లు ప్రకటన




అమరావతి : వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే పటిష్టమైన చర్యలు చేపట్టాలని, హాస్టళ్లలో విద్యార్థులు అనారోగ్యం పాలైతే సంబంధిత జిల్లా కలెక్టర్లు, మంత్రులనే బాధ్యుల్ని చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గట్టిగా హెచ్చరించారు. ప్రభుత్వ పాలసీలు క్షేత్రస్థాయిలో ఎలా అమలవుతున్నాయో తెలుసుకునేందుకు మంత్రులు, కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పాలసీలు సమర్థవంతంగా అమలైతేనే ఆశించిన - మిగతా 2 లో

## అంబటి రాంబాబుకు
# రెండో షాక్

- మరో కేసులో రిమాండ్ విధించిన కోర్టు
- పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీ నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ ఆందోళన
- ఆ సందర్భంగా పోలీసు విధులకు ఆటంకం కలిగించిన అంబటి
- 14 రోజుల రిమాండ్ విధించిన స్పెషల్ జ్యుడీషియల్ కోర్టు



అమరావతి : ఇప్పటికే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును దుర్భాషలాడిన కేసులో రిమాండ్ లో ఉన్న వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు మరో కేసులో షాక్ తగిలింది. మెడికల్ కాలేజీని పీపీపీ విధానంలో నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ చేసిన ఆందోళన కార్యక్రమం సందర్భంగా... బ్యారికేడ్లను తోసివేసి, పోలీసు విధులకు ఆటంకం కలిగించారనే కేసులో ఆయనకు స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. - మిగతా 2 లో

# సంక్షేమం నుంచి అభివృద్ధి వరకు

- ప్రభుత్వ ప్రగతి నివేదిక
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- 204 అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణతో పేదల ఆకలి తీరుస్తున్నామన్న సీఎం చంద్రబాబు
- రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమని ప్రకటన
- మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీ పూర్తి చేశామన్న ముఖ్యమంత్రి
- గత ప్రభుత్వ హయాంలో పోలవరం డయాఫ్రమ్ వాల్ ధ్వంసమైందని విమర్శ
- 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్న చంద్రబాబు




అమరావతి : సంక్షేమ పథకాల అమలు నుంచి భారీ పెట్టుబడుల ఆకర్షణ వరకు తమ ప్రభుత్వ పాలన దార్శనికతను, భవిష్యత్ లక్ష్యాలను ముఖ్యమంత్రి సమగ్రంగా వివరించారు. రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూనే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలను, అధికార దుర్వినియోగాన్ని ఎండగట్టారు. పేదల ఆకలి తీర్చడమే - మిగతా 2 లో

## మార్చి 31 కల్లా
# నక్సలిజాన్ని అంతం చేస్తాం

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- మావోయిస్టులకు అమిత్ షా డెడ్‌లైన్
- బస్తర్ ముఖచిత్రం మారుస్తామని హామీ
- ఆదివాసీ బిడ్డల చేతిలో ఆయుధాలు చూడలేకపోతున్నామని వ్యాఖ్య
- అమిత్ షా మావోయిస్టులకు స్పష్టమైన హెచ్చరికలు జారీ
- మా పోరాటం మా గిరిజన సోదరసోదరీమణుల రక్షణ కోసమే
- ఎవరైనా చేతిలో ఆయుధం పట్టుకుంటే, వారికి ఆయుధంతోనే సమాధానం చెబుతాం



"మావోయిజం ఏ సమాజానికి ఎప్పుడూ మేలు చేయలేదు. అది అడుగుపెట్టిన ప్రతిచోటా వినాశనం తప్ప అభివృద్ధిని కాంక్షించలేదు. కొలంబియా, పెరూ, కంబోడియా వంటి దేశాల చరిత్రే ఇందుకు నిదర్శనం. అందుకే చెబుతున్నా, మార్చి 31 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని సమూలంగా తుడిచిపెడతాం." అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా కేంద్రం జగదల్‌పుర్‌లో సోమవారం జరిగిన 'బస్తర్ పాండుమ్-2026' ముగింపు ఉత్సవాల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ, నక్సల్స్ అంతానికి డెడ్‌లైన్ విధించారు. - మిగతా 2 లో




## రూఫ్ టాప్ లే హెలీప్యాడ్‌లు

- ఎయిర్ ట్యాక్సీల నిర్వహణ సులభంగా మార్చే యోచన
- టేకాఫ్-ల్యాండింగ్ కు రూఫ్ టాప్ లను ఉపయోగించవచ్చు..
- భారత పరిశ్రమల సమాఖ్య నివేదిక
- ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టవచ్చని వివరణ




## స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాసానికి విపక్షాల ప్లాన్

- ముదురుతున్న లోక్‌సభ వివాదం
- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైన విపక్షాలు
- ప్రధానిపై దాడి జరగొచ్చన్న స్పీకర్ వ్యాఖ్యలతో రాజుకున్న వివాదం
- 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్‌తో మరింత పెరిగిన రాజకీయ వేడి




## బీజేపీకి లైఫ్ లైన్ అసదుద్దీన్ ఒవైసీయే

- ఆయనే వారికి దేవుడు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మజ్లిస్ పార్టీని చూపించి ఇంకా ఎంతకాలం ఓట్లు అడుగుతారని ప్రశ్న
- తెల్లారితే బీజేపీ అసదుద్దీన్‌ను తలుచుకుంటుందని వ్యాఖ్య
- రెండేళ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో చేసిందన్న ముఖ్యమంత్రి

## రేవంత్ రెడ్డిలా ఇప్పటి వరకు
## ఏ ముఖ్యమంత్రి మాట్లాడలేదు



- అన్న ఎన్టీఆర్‌ను, చంద్రబాబును చూశాం కానీ ఇలా ఎవరూ మాట్లాడలేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రేవంత్ రెడ్డిలా ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి మాట్లాడలేదన్న కేటీఆర్
- కేసీఆర్‌ను, కార్యకర్తలను తిడితే ఊరుకునేది లేదని హెచ్చరిక
- రెండేళ్ల తర్వాత పాతాళంలో దాక్కున్నా ఊరుకునేదని వ్యాఖ్య

హైదరాబాద్ : అన్న ఎన్టీఆర్‌ను, ఆ తర్వాత చంద్రబాబు, వైఎస్సార్, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్‌లను చూశామని, కానీ రేవంత్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని మనం చూడలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. హామీల గురించి అడిగితే 'లాగులో తొండలు విడిచిపెడుతా', 'గుడ్లు పీకి గోటీలు ఆడుతా', 'పేగులు తీసుకుని మెడలో వేసుకుంటా' - మిగతా 2 లో

## బీఆర్ఎస్ నేతలు గెలిస్తే
# అభివృద్ధి చేస్తారా?

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశం
- భవిష్యత్‌ను ఆలోచించుకొని మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలని సూచన
- మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోరు జరుగుతుందని వెల్లడి
- తెలంగాణకు అన్యాయం జరుగుతున్నప్పుడు ఏరోజైనా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మాట్లాడారా అని సీఎం నిలదీశారు
- పార్టీ ముఖ్య నేతలతో జూమ్‌లో సమావేశమైన సీఎం రేవంత్
- పార్టీకి ప్రతికూలంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన



హైదరాబాద్ : భవిష్యత్‌ను ఆలోచించుకొని మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోరు జరుగుతుందని తెలిపారు. 12 ఏళ్లుగా కేంద్రంలో ఉన్న బీజేపీ తెలంగాణకు ఏమైనా ప్రాజెక్టులు మంజూరు చేశారా? అడిగారు. పాలమూరు-రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా చేస్తామని మోదీనే స్వయంగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. హామీలు అమలు గురించి చెప్పట్లేదని, - మిగతా 2 లో

నినాదం
నిఖార్సైన జర్నలిజం
మంగళవారం 10 - 02 - 2026

# నిర్మలమ్మకు కనిపించని ప్రజా జీవిత వాస్తవాలు






ఈ నెల 1న లోక్‌సభలో 202627 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తరువాత ఆ వార్షిక పద్దుపై ప్రభుత్వ ప్రతినిధులు, సంపాదకీయ రచయితలు, ఆర్థిక వ్యవహారాలపై వ్యాఖ్యాతలు, పాత్రికేయులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ 'జాగరూకత' అనే పదాన్ని, 'ఉన్న స్థితిని చెదరగొట్టి తలకిందులు చేయవద్దు' (డోంట్ రాక్ ది బోట్) అనే పదబంధాన్ని ఉపయోగించారు.భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను ఆర్థిక సర్వే 202526 గుర్తించింది; అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన సుంకాల సమరం భారత్ సరుకులపై విధించిన 50శాతం సుంకాలను 18శాతానికి తగ్గించనున్నట్టు ప్రకటించినప్పటికీ ఆ 'తగ్గింపు'నకు షరతులు ఉన్నట్టుగా కనిపిస్తోంది. భారత్‌కు అమెరికన్ ఎగుమతులపై నయాపైసా సుంకం విధించకపోవడం, సుంకాలేతర అవరోధాలను పూర్తిగా తొలగించడం, 50,000 కోట్ల డాలర్ల విలువైన అమెరికన్ ఉత్పత్తులను కొనుగోలు చేయడం మొదలైనవి. ఇంకా ఇతర షరతులు ఉండవచ్చు. అయితే ఈ షరతులను పాటించడం భారత్‌కు సాధ్యం కాకపోవచ్చు. దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావలసిన స్థాయిలో రావడం లేదు. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపుదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. నగదు సమృద్ధిగా ఉన్న భారతీయ వ్యాపారవేత్తలు మదుపు చేసేందుకు సంకోచిస్తున్నారు. పర్యవసానంగా 'స్థూల స్థిర మూలధన సంచయం' భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 30శాతంగా మాత్రమే ఉండిపోయింది.నామమాత్ర జీడీపీ వృద్ధిరేటు అసంతృప్తికరంగా ఉన్నది. జాతీయ గణాంకాల సంస్థ (ఎన్‌ఎస్‌ఓ) అనుసరించిన గణన పద్ధతులు, జాతీయ ఖాతాలపై అంతర్జాతీయ సంస్థల సందేహాలతో యథార్థ జీడీపీ వృద్ధిరేట్లపై అనుమానపు నీడలు కమ్ముకున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ నిజ స్థితిగతులను అంచనా వేసేందుకు నామమాత్ర జీడీపీ ఒక మంచి సూచకం. ఇది 202324, 202425, 202526 ఆర్థిక సంవత్సరాలలో వరుసగా 12శాతం, 9.8శాతం, 8శాతం మేరకు పెరిగింది. ఏమైనా వృద్ధి వేగాన్ని కోల్పోతోంది సుమా! నిరుద్యోగిత పెరిగిపోయింది. జూన్ 2025లో యువజనుల నిరుద్యోగిత రేటు 15శాతంగా ఉన్నది. దేశ శ్రామిక జనవాళిలో 21.7శాతం మంది మాత్రమే క్రమబద్ధమైన వేతన ఉద్యోగాలలో ఉన్నారు. లక్షలాది యువతీ యువకులు నిరుద్యోగులుగా ఉన్నారు. ఈ నిరుద్యోగులు స్వయం ఉపాధి వైపునకు మళ్లుతున్నట్టు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి.తయారీ రంగంలో అగ్రగామి కాకుండా ఏ దేశమూ మధ్య ఆదాయ దేశంగా రూపొందదు. భారతదేశ జీడీపీలో తయారీరంగం వాటా గత పది సంవత్సరాలుగా 15 లేదా 16 శాతంగా మాత్రమే ఉంటోంది. పీఎల్ఐ, ఇతర పథకాలు ఉద్యోగాలను సృష్టించడంలో విఫలమయ్యాయి; ద్రవ్య సమీకరణ బాధాకరంగా మందగించింది. ద్రవ్యలోటు 202526లో 4.4 శాతం నుంచి 202627లో 4.3శాతానికి తగ్గనున్నది. రెవెన్యూ లోటు 1.5శాతంగా ఉండిపోనున్నది. ఎఫ్ఆర్‌బీఎమ్ లక్ష్యాలను చేరుకునేందుకు 12 లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలు పట్టవచ్చు. అందుకు మనం భారీ మూల్యమే చెల్లించనున్నాము.నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగాన్ని ఆర్థికరంగ నిపుణులు తీవ్రంగా విమర్శించారు. భారత్ ప్రపంచ నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని చెప్పుకుంటూ ప్రభుత్వం తనను తాను అభినందించుకోవడాన్ని డాక్టర్ సూర్జిత్ భల్లా ఎగతాళి చేశారు. వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేయడాన్ని డాక్టర్ అశోక్ గులాటి గర్హించారు. ఆర్థికమంత్రి తన ప్రసంగంలో అనేక పథకాలు, కార్యక్రమాలు, మిషన్‌లు, సంస్థలు, చొరవలు, ఫండ్స్, కమిటీలను ప్రస్తావించారు. నా లెక్కలో అవి కనీసం 24గా ఉన్నాయి. ఆమె ప్రకటించిన ఈ పథకాలు, కార్యక్రమాలు మొదలైన వాటిలో వేటికీ నిధులు కేటాయించకపోవడం దేశ ప్రజల దృష్టికి తప్పక వస్తుంది సుమా! ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మేధా సోమరితనంతో చేసిన ఒక విన్యాసమే ఆమె సమర్పించిన 9వ కేంద్ర బడ్జెట్.

# అంబటి రాంబాబుకు రెండో షాక్

**మొదటిపేజీ తరువాయి** – ఈ నెల 22వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.మరోవైపు, చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో అంబటి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ పై గుంటూరు మొబైల్ కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ విచారణ అనంతరం ఆయనను తిరిగి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించనున్నారు.

# రూఫ్ టాప్ లే హెలీప్యాడ్‌లు

**మొదటిపేజీ తరువాయి** – నగరాల్లో రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యకు ఎయిర్ ట్యాక్సీలతో చెక్ పెట్టాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా చిన్న, తేలిక పాటి హెలికాప్టర్లను ఎయిర్ ట్యాక్సీలుగా ఉపయోగించే అవకాశం ఉంది. అయితే, వీటికి టేకాఫ్, ల్యాండింగ్ సమస్యగా మారనుంది. దీనికి చెక్ పెట్టేందుకు భవనాల పైకప్పులను (రూఫ్ టాప్స్) ఉపయోగించవచ్చని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తెలిపింది.నగరాల్లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించి, రవాణా సమయాన్ని తగ్గించేందుకు ఎయిర్ ట్యాక్సీలు తోడ్పడతాయని పేర్కొంది. ఈమేరకు 'నావిగేటింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ ఎయిర్ మొబిలిటీ ఇన్ ఇండియా' పేరుతో ఓ నివేదిక విడుదల చేసింది. ఢిల్లీ సమీపంలోని గురుగ్రామ్, కొత్తగా రాబోతున్న జెవార్ గేట్‌వేను కలిపే 65–75 కిలోమీటర్ల కారిడార్‌ను నమూనాగా తీసుకుని మన దేశంలో ఏఏఎం సాధ్యాసాధ్యాలను ఈ నివేదిక అంచనా వేసింది.అడ్వాన్స్‌డ్ ఎయిర్ మొబిలిటీ వ్యవస్థలో ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్ ఆఫ్ అండ్ ల్యాండింగ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, ఎయిర్ ట్యాక్సీలు అభివృద్ధి చెందుతున్నాయి. వీటి టేకాఫ్, ల్యాండింగ్ లకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న భవనాల పైకప్పులను ఉపయోగించుకోవడం ద్వారా మౌలిక సదుపాయాల కొరతను నివారించవచ్చని పేర్కొంది.ఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి నగరాల్లో ఎయిర్ ట్యాక్సీల రాకపోకలకు నివాస భవనాలతో పాటు ఆసుపత్రులు, షాపింగ్ కాంప్లెక్స్ లు, ఐటీ టవర్లను ఉపయోగించుకోవచ్చని సీఐఐ తన నివేదికలో వెల్లడించింది. అయితే, ఇప్పుడు ఉన్న నిబంధనల ప్రకారం రూఫ్ టాప్ ల నుంచి సాధారణ వాణిజ్య వర్టికల్ టేకాఫ్, ల్యాండింగ్ లకు అనుమతి లేదని గుర్తుచేసింది. ముందుగా ఈ నిబంధనలను సవరించాల్సి ఉంటుందని అభిప్రాయపడింది.

## రేవంత్ రెడ్డిలా ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి మాట్లాడలేదు



**మొదటిపేజీ తరువాయి** – అని అంటున్నారని, కానీ ఇంతమంది ముఖ్య మంత్రులను మనం చూసినా వారెవరూ ఇలా మాట్లాడలేదని అన్నారు. భూపాలపల్లి, పరకాలలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాను రద్దు చేయనని ముఖ్యమంత్రి చెబుతున్నారని, అసలు ఆయన రద్దు చేయడానికి, జిల్లాను ఆయన చేశాడా అని ప్రశ్నించారు. జిల్లాను రద్దు చేస్తే భూపాలపల్లి ప్రజలు వీపు చింతపండు చేస్తారని కేటీఆర్ అన్నారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిడితే ఊరుకునేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. "నీ టైమ్ అంతా రెండేళ్లే. ఆ తర్వాత గులాబీ జెండా ఎగురుతుంది. ఆ తర్వాత నువ్వు పాతాళంలో దాక్కున్నా వదిలి పెట్టం, పొట్టోడా. కేసీఆర్‌తో పాటు మా కార్యకర్తలను అంటే ఊరుకునేది లేదు" అని అన్నారు. తిడితే తనను, ఇతర నాయకులను తిట్టుకోవచ్చని, కానీ కేసీఆర్‌ను, బీఆర్ఎస్ కార్యకర్తలను తిడితే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు.ఎంతమంది దేవుళ్లు ఉంటే అంతమంది దేవుళ్లను మొక్కుకున్నా అధికారంలోకి వచ్చాక వదిలి పెట్టేది లేదని అన్నారు. ఆయన పేరు అనుముల రేవంత్ రెడ్డి కాదని, లాగుల తొండల్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో పాలన పక్కకు పెట్టి కుంభకోణాలకు తెరలేపారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని విమర్శించారు.సింగరేణిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బావమరిది కలిసి దోచుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ప్రజలను ఆ పార్టీ నాయకులు ముంచుతారని హెచ్చరించారు. రూ.4 వేల పెన్షన్, తులం బంగారం, రైతుబంధు పెంపు ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడిస్తే హామీలు అమలవుతాయని ఓటర్లకు సూచించారు.

# విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

**మొదటిపేజీ తరువాయి** – ఫలితాలు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.సోమవారం అమరావతి సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల రాష్ట్రం 14 శాతం అధిక వడ్డీతో అప్పులు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక క్రమశిక్షణను గాడిలో పెట్టి, రాష్ట్ర క్రెడిట్ రేటింగ్ పెంచడం ద్వారా వడ్డీ భారాన్ని తగ్గించుకునేందుకు రుణాలను రీషెడ్యూల్ చేస్తున్నామని వివరించారు. ప్రతి ఐదేళ్లకు జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం రెట్టింపు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి**

ఆరోగ్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం సూచించారు. జూలై నాటికి 66 లక్షల హైరిస్క్ కేసులకు హెల్త్ స్క్రీనింగ్ పూర్తి చేయాలని, 5 లక్షల మంది హాస్టల్ విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించారు. గర్భిణుల్లో సిజేరియన్లు తగ్గించి, సాధారణ ప్రసవాలు పెరిగేలా అవగాహన కల్పించాలన్నారు. మాతాశిశు సంరక్షణ కోసం 'కేర్ అండ్ గ్రో' కార్యక్రమాన్ని, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం అందించాలని చెప్పారు. రాష్ట్ర జనాభా నిర్వహణ కోసం మార్చి నాటికి 'పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ' తీసుకురానున్నట్లు సీఎం వెల్లడించారు. విద్యారంగంలో ఒత్తిడి లేని విద్యావిధానం అమలు చేయాలని, పదో తరగతి ఫలితాల్లో మెరుగుదలకు 100 రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆత్మహత్యలు జరగకూడదని, నూతన ఆవిష్కరణలకు స్వేచ్ఛాయుత వాతావరణం ఉండాలని అభిప్రాయపడ్డారు.

**నీటి సంరక్షణ, అభివృద్ధిపై కీలక సూచనలు**

రాష్ట్రంలోని 38 వేలకు పైగా ఉన్న చిన్న నీటిపారుదల చెరువులను పరిరక్షించాలని, భూగర్భ జలాలను 'నీటి బ్యాంకు' తరహాలో వాడాలని సూచించారు. పారిశ్రామిక కాలుష్యంతో జలాలు కలుషితం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అల్లూరి జిల్లా లంబసింగిలో కుంకుమ పువ్వు సాగు, ఏలూరు సమీపంలో కోకో సిటీ ఏర్పాటు వంటి వినూత్న ప్రాజెక్టులకు అవకాశాలున్నాయని, వీటిని ప్రోత్సహించాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సంక్షేమం నుంచి అభివృద్ధి వరకు

**మొదటిపేజీ తరువాయి** – లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా 204 అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించామని, గత ప్రభుత్వం వీటిని రద్దు చేసి పేదవాడి కడుపు కొట్టిందని విమర్శించారు.గత పాలనలో జరిగిన భూ అక్రమాలపై ముఖ్యమంత్రి తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. "తాడేపల్లి ప్యాలెస్ వద్ద హెలిపాడ్ కోసం ఒక ప్రైవేటు భూమిని అక్రమంగా 22ఏ నిబంధన కింద చేర్చారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఈ స్థాయిలో అధికారాన్ని దుర్వినియోగం చేయడం దారుణం. ఇది కేవలం తాడేపల్లికే పరిమితం కాలేదు, రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఇలాంటివి జరిగాయి" అని వ్యాఖ్యానించారు. దీనికి పరిష్కారంగానే భూవివాదాలు లేని పకడ్బందీ సర్వే ప్రక్రియను చేపట్టామని, క్యూఆర్ కోడ్, ఇతర భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని తెలిపారు.

**2027 నాటికి పోలవరం పూర్తి.. 20 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం**

రాష్ట్ర అభివృద్ధికి నిర్దేశించుకున్న లక్ష్యాలను వివరిస్తూ, పోలవరం ప్రాజెక్టును 2027 పుష్కరాల నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు. రూ.440 కోట్లతో నిర్మించిన డయాఫ్రమ్ వాల్‌ను గత పాలకులు ధ్వంసం చేయడం వల్ల, ఇప్పుడు దాని పునర్నిర్మాణానికి అదనంగా రూ.1000 కోట్లు ఖర్చవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు శ్మశానం, ఎడారి అని విమర్శించిన అమరావతిని వచ్చే మూడేళ్లలో దేశంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరంగా (మోస్ట్ లివబుల్ సిటీ) తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.ఉద్యోగాల కల్పన, పారిశ్రామిక ప్రగతిపై మాట్లాడుతూ.. మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టులను, 5,757 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేశామని తెలిపారు. రూ.20 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 23 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అమరావతిలో క్వాంటం వ్యాలీ, విశాఖలో గూగుల్ డేటా సెంటర్, కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టులతో ఏపీ రూపురేఖలు మారనున్నాయని అన్నారు.అధికారులంతా టీమ్ స్పిరిట్‌తో పనిచేసి, ప్రభుత్వ పాలన ప్రజలకు వేగంగా అందేలా చూడాలని (స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్) పిలుపునిచ్చారు. రైతుల కోసం మార్కెట్ జోక్యం, ధాన్యం కొనుగోళ్లకు తక్షణ చెల్లింపులు, రోడ్ల నిర్మాణం, ఇంటింటికీ కుళాయి, యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ వంటి పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. 2026-27 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేలా కార్యాచరణ ఉండాలని అధికారులను ఆదేశించారు.

# స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాసానికి విపక్షాల ప్లాన్

**మొదటిపేజీ తరువాయి** – కేంద్ర ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య తీవ్రమవుతున్న విభేదాల నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. పార్లమెంట్ సమావేశాల్లో చోటుచేసుకుంటున్న వరుస పరిణామాలు, ఇరుపక్షాల మధ్య అపనమ్మకం ముదరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.గత గురువారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించాల్సి ఉండగా, విపక్షాల తీవ్ర నిరసనల మధ్య సభను స్పీకర్ అర్ధాంతరంగా వాయిదా వేశారు. 'ప్రధానిని లక్ష్యంగా చేసుకుని ప్రతిపక్ష ఎంపీలు ఏదో అనుకోనిది చేయొచ్చని సమాచారం అందింది' అని ఓం బిర్లా చెప్పడం వివాదానికి దారితీసింది. అంతకుముందు కొందరు మహిళా ఎంపీలు ప్లకార్డులతో ప్రధాని సీటు వద్దకు (ఆ సమయంలో ప్రధాని అక్కడ లేరు) వెళ్లారు. స్పీకర్ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ "పూర్తి అబద్ధాలు" అని కొట్టిపారేశారు. "ప్రధాని ఇప్పుడు స్పీకర్ చాటున దాక్కుంటున్నారు... ఆయనకు ధైర్యం లేదు" అని ఆమె తీవ్రంగా విమర్శించారు.ఈ అవిశ్వాస తీర్మానంలో స్పీకర్‌కు వ్యతిరేకంగా మూడు ప్రధాన అంశాలను ప్రతిపక్షాలు హైలైట్ చేయనున్నాయి. మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రాసిన పుస్తకంలోని కొన్ని భాగాలను చదివేందుకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి అనుమతి నిరాకరించడం మొదటిది. అదే సమయంలో కాంగ్రెస్‌ను, గాంధీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న పుస్తకాల నుంచి చదివేందుకు బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేకు అనుమతి ఇవ్వడంపై విపక్షాలు మండిపడుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన దూబేపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నాయి.2020లో భారత్-చైనా సరిహద్దు వివాదంపై ఉన్న ఆ పుస్తక భాగాలను రికార్డుల్లో చేర్చాలని రాహుల్ పట్టుబట్టారు. తాను ఆ సమాచారానికి బాధ్యత వహిస్తానని లిఖితపూర్వకంగా ఇచ్చినా స్పీకర్ అంగీకరించలేదు. దీంతో సభలో తీవ్ర గందరగోళం చెలరేగింది. ఈ క్రమంలో నిరసన తెలిపిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలను సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేశారు. "రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. దీనిపై నిరసన తెలిపితే మమ్మల్ని సస్పెండ్ చేశారు. ఇది అంత పెద్ద నేర మా?" అని సస్పెండైన ఎంపీ అమరీందర్ రాజా వారింగ్ ప్రశ్నించారు. ఈ పరిణామాలతో పార్లమెంట్‌లో రాజకీయ వేడి మరింత పెరిగింది.

# మార్చి 31 కల్లా నక్సలిజాన్ని అంతం చేస్తాం

**మొదటిపేజీ తరువాయి** – **తుపాకీకి తుపాకీతోనే బదులు** : అమిత్ షా తన ప్రసంగంలో మావోయిస్టులకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. "మేము ఎవరితోనూ యుద్ధం చేయాలనుకోవడం లేదు. మా పోరాటం మా గిరిజన సోదరసోదరీమణుల రక్షణ కోసమే. కానీ ఎవరైనా చేతిలో ఆయుధం పట్టుకుంటే, వారికి ఆయుధంతోనే సమాధానం చెబుతాం. ఐఈడీలు అమర్చి అమాయక పిల్లల ప్రాణాలు తీస్తున్నారు. పాఠశాలలను, ఆసుపత్రులను తగులబెడుతున్నారు. ఇంతటి క్రూరత్వం ఎక్కడి నుంచి వచ్చింది? సాయుధ పోరాటాన్ని ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేస్తుంది" అని ఆయన తేల్చిచెప్పారు.

**ఆడబిడ్డల చేతుల్లో తుపాకులా?** : నక్సల్స్ దళాల్లో ఉన్న గిరిజన యువతుల గురించి అమిత్ షా ఆవేదన వ్యక్తం చేశారు. "మావోయిస్టుల్లో ఇంకా మిగిలి ఉన్నవారిలో చిన్న వయసు గిరిజన బాలికలు కూడా ఉన్నారు. వారి చేతుల్లో తుపాకులు చూడటం బాధాకరం. వారి ముందు ఇంకా ఎంతో జీవితం ఉంది. వారంతా ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలి. లొంగిపోయిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. వారికి ఎలాంటి హానీ జరగదు" అని భరోసా ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'పునరావాస విధానం' దేశంలోనే అత్యుత్తమమైనదని ఆయన కితాబిచ్చారు.

**అభివృద్ధి పథంలో బస్తర్** : మావోయిస్టుల వల్ల దశాబ్దాలుగా నష్టపోయిన బస్తర్ ప్రాంతం ఇప్పుడు అభివృద్ధి వైపు పరుగులు పెడుతోందని షా పేర్కొన్నారు. "మావోయిస్టులు దశాబ్దాల పాటు స్కూళ్లను మూసివేసి, ఒక తరాన్ని చదువుకు దూరం చేశారు. కానీ ఇప్పుడు బస్తర్ మారుతోంది. మూసివేసిన బడులు తెరుచుకుంటున్నాయి. రోడ్లు వేస్తున్నాం. మొబైల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నాం. పోస్టాఫీసులు, బ్యాంకులు ప్రతి 5 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తున్నాం. డిసెంబర్ 2027 నాటికి బస్తర్ ప్రాంతంలోని 7 జిల్లాల్లోని ప్రతి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం" అని హామీ ఇచ్చారు. వచ్చే ఐదేళ్లలో దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన గిరిజన ప్రాంతంగా బస్తర్‌ను మారుస్తామన్నారు.

**వరాల జల్లు** : గిరిజనుల ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలను షా వివరించారు. "గిరిజనుల నుంచి క్వింటాల్ వరిని రూ.3,100కు కొనుగోలు చేస్తాం. ప్రతి ఇంటికీ వంట గ్యాస్ సిలిండర్, కుళాయి నీటి కనెక్షన్ ఇస్తాం. ఇంద్రావతి నదిపై కొత్త సాగునీటి ప్రాజెక్టుల ద్వారా దంతెవాడ, బీజాపూర్, సుక్మా జిల్లాల్లో 2.75 లక్షల హెక్టార్లకు నీరు అందిస్తాం. బస్తర్‌లో 118 ఎకరాల్లో కొత్త పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసి గిరిజన యువతకు ఉపాధి కల్పిస్తాం. అడ్వెంచర్ టూరిజం, హోమ్‌స్టేలు, గ్లాస్ బ్రిడ్జిల ద్వారా పర్యాటకాన్ని పెంచుతాం" అని చెప్పారు.

**రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానం** : బస్తర్ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పడమే ప్రధాని మోదీ లక్ష్యమని షా అన్నారు. తుపాకులు, పేలుడు పదార్థాలు బస్తర్ గుర్తింపు కాదని, ఇక్కడి సంస్కృతే అసలైన గుర్తింపు అని ఉద్ఘాటించారు. 'బస్తర్ పాండుమ్' ఉత్సవాల్లోని 12 విభాగాల్లో గెలుపొందిన టాప్-3 విజేతలను రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానిస్తామని, అక్కడ వారు తమ కళలను ప్రదర్శించి విందులో పాల్గొంటారని ప్రకటించారు. పోలీసుల త్యాగాలను స్మరిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

# బీఆర్ఎస్ నేతలు గెలిస్తే అభివృద్ధి చేస్తారా?

**మొదటిపేజీ తరువాయి** – మోదీని చూసి ఓటేయాలని బీజేపీ నేతలు అడుగుతున్నారని అన్నారు.

**బండి సంజయ్ మాటమార్చారు** : మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారానికి వచ్చిన మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ మనల్ని అవమానించారని, మనల్ని అవమానించి తర్వాత ఓటు వేయాలని ఫడణవీస్ కోరారని, వరదల్లో నీటమునిగిన వస్తువులన్నీ తిరిగిస్తామని జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బండి సంజయ్ హామీ ఇచ్చారని, కేంద్రం నుంచి నిధులు తెచ్చి వస్తువులన్నీ తిరిగిస్తామని బండి సంజయ్ ప్రకటించారని వెల్లడించారు. బండి సంజయ్ హామీలను నమ్మి జీహెచ్ఎంసీలో 50 మంది బీజేపీ కార్పొరేటర్లను గెలిపించారని, ఎన్నికలయ్యాక అడిగితే వస్తువులకు బీమా ఉంటుందని బండి సంజయ్ మాటమార్చారని విమర్శించారు. బీమా డబ్బులు వచ్చేదానికి బండి సంజయ్ రికమెండేషన్ ఎందుకో? ప్రశ్నించారు. బండి సంజయ్ మాటలు సత్రం భోజనానికి పెద్దారెడ్డి రికమెండేషన్ అన్నట్లుందని ఎద్దేవా చేశారు."2014-19 వరకు రాజ్యసభలో బీజేపీకి మెజార్టీ లేదు. 2014-19 వరకు రాజ్యసభలో ప్రతి బిల్లుకు మద్దతు ఇచ్చారు. ప్రజలకు వ్యతిరేకంగా కేంద్రం తెచ్చిన చట్టాలను బీఆర్ఎస్ ప్రశంసించింది. నరేంద్ర మోదీ ప్రేమలో అమరత్వం పొందుతానని గతంలో కేసీఆర్ చెప్పారు. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్లు అవినీతి జరిగిందని బీజేపీ నేతలు చెప్పారు. మీకు చేతగాకపోతే మాకు అప్పగించండి 48 గంటల్లో అరెస్టు చేస్తామని కిషన్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం అవినీతి కేసును సీబీఐకి అప్పగించి ఆర్నెళ్లు అవుతుంది. కాళేశ్వరం అవినీతి కేసులో ఇప్పటివరకు ఒక్కరినీ విచారణకు పిలవలేదు.ఎన్నికలొచ్చాక మళ్లీ కేంద్రం నిధులు తెస్తామని కిషన్‌రెడ్డి చెబుతున్నారని, తెలంగాణకు లక్షల కోట్లు ఇచ్చామని బీజేపీ నేతలు చెబుతున్నారని, బీజేపీ నేతల ప్రకటనపై సీఎస్‌ను అడిగానని, మనం రూపాయి చెల్లిస్తే కేంద్రం 42 పైసలు ఇస్తుందని చెప్పారని సీఎం తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు బీజేపీ తీవ్ర అన్యాయం చేస్తుందని, బిహార్ ఒక్క రూపాయి పన్ను చెల్లిస్తే రూ.6.16పైసలు కేంద్రం తిరిగి చెల్లిస్తుందని విమర్శించారు. తెలంగాణకు అన్యాయం జరుగు తున్నప్పుడు ఏరోజైనా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మాట్లాడారా? నిలదీశారు.మనకు అదనంగా ఇవ్వాల్సిన అవసరం లేదని, మనం చెల్లించిన నిధులు తిరిగిస్తే చాలని అన్నారు. కేంద్రానికి వచ్చే పన్నుల్లో దక్షిణాది రాష్ట్రాలే 40 శాతానికి పైగా చెల్లిస్తున్నాయని, మన రాష్ట్రానికి వచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేశారని, హైదరాబాద్‌కు వచ్చిన సెమీకండక్టర్ ప్రాజెక్టును మోదీ ఒత్తిడి చేసి ఏపీకి తరలించారని, కేంద్రం తన విచక్షణను ఉపయోగించి చేయాల్సిన పనులను తెలంగాణకు ఇవ్వలేదని ఆరోపించారు. కుంభమేళాకు వేల కోట్లు నిధులు ఇస్తారని, తెలంగాణలో జరిగే సమ్మక్క-సారక్క జాతరకు, గోదావరి పుష్కరాలకు నిధులు ఇవ్వరని, తెలంగాణకు కేంద్రం ఏదైనా ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చిందని కిషన్‌రెడ్డి చెప్పగలరా? ప్రశ్నించారు.ఉదయం పార్టీ ముఖ్య నేతలతో జూమ్‌లో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి పార్లమెంటు నియోజక వర్గాల వారీగా తాజా రాజకీయ పరిణామాలపై ఆరా తీశారు. రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షులు, ప్రభుత్వ సలహాదారులు మున్సిపల్ ఎన్నికలపై సంబంధించి జరిగిన జూమ్ సమావేశంలో పాల్గొన్నారు. ప్రతి ఓటరు పోలింగ్ స్టేషన్‌కు వచ్చి ఓటు వేసేటట్లు స్థానిక నాయకత్వం చొరవ చూపాలని సీఎం దిశానిర్దేశం చేశారు.దాదాపు రెండుగంటలు కొనసాగిన జూమ్ సమావేశంలో పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. వివిధ సంస్థలతో నిర్వహింప చేసిన సర్వేలతో పాటు డీసీసీ అధ్యక్షుల నివేదికలు, నిఘా వర్గాల సమాచారం ఆధారంగా పార్టీకి ప్రతికూలంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇవాళ, రేపు స్థానిక నాయకత్వం ఓటర్లకు అందుబాటులో ఉండాలని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# బీజేపీకి లైఫ్ లైన్ అసదుద్దీన్ ఒవైసీయే




**మొదటిపేజీ తరువాయి** – బీజేపీకి లైఫ్‌లైన్ అసదుద్దీన్ ఒవైసీయేనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి ఈరోజు తెరపడుతోంది. ఈ నేపథ్యంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, బీజేపీ నాయకులు అసదుద్దీన్ ఒవైసీ పేరును ఎన్నిసార్లు తలుచుకుంటారోనని ఎద్దేవా చేశారు. మజ్లిస్ పార్టీని చూపించి ఇంకా ఎంతకాలం ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. బీజేపీ తెల్లారితే అసదుద్దీన్‌నే తలుచుకుంటారని, ఆయనే వారికి దేవుడు అన్నారు.ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై తీవ్రంగా మండిపడ్డారు. మోదీని చూసి ఓటు వేయాలని బీజేపీ నాయకులు చెబుతున్నారని, గల్లీ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధమని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికలు వచ్చాయని ఇప్పుడు బీజేపీ నేతలు వచ్చి కేంద్రం నుంచి నిధులు తీసుకు వస్తామని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు రావాల్సిన నిధులు సహజంగానే వస్తాయని, వీరు తేవడమేమిటని అన్నారు. ప్రత్యేకంగా వారు ఏమైనా నిధులు తెస్తే చెప్పుకోవాలని అన్నారు.తెలంగాణ కేంద్రానికి రూపాయి చెల్లిస్తే 42 పైసలు వస్తున్నాయని, అదే బీహార్ రూపాయి చెల్లిస్తే ఆరు రూపాయలు వెళుతున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. దక్షిణాదిను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఉత్తరాది రాష్ట్రాలకు అధిక నిధులు ఇస్తున్నారని, ఈ వివక్షపై కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. భారీ ప్రాజెక్టులు అన్నీ ఉత్తరాదికే వెళు తున్నాయని ఆరోపించారు. కేంద్రం కొత్తగా ఇచ్చిన ప్రాజెక్టులు ఏవీ లేవన్నారు.పన్నెండేళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలో ఉన్నారని, 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ తెలంగాణను పాలించిందని, కానీ వారు చేసిందేమిటని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటేస్తే మోరీని తీయడానికి మోదీ వస్తారా? బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే కేసీఆర్ వస్తారా? అని ప్రశ్నించారు. తాము రెండేళ్లలోనే ఎన్నో పనులు చేశామని అన్నారు.ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదీనే వేతనాలు ఇస్తున్నామని, ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచి అమలు చేస్తున్నామని, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించామని, పదేళ్లు ఇవ్వని రేషన్ కార్డులను ఇచ్చామని, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని ముఖ్యమంత్రి అన్నారు. మరోమారు కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి వస్తుందని, కాబట్టి మున్సిపల్ ఎన్నికల్లో చేతి గుర్తుకే ఓటు వేయాలని కోరారు. తమకు ఓటు వేస్తే అభివృద్ధి పూచీ మాదే అన్నారు.

# లేబర్ కార్డుతో లేబర్‌కు భద్రతా భరోసా

దినసరి కూలీగా పనిచేస్తున్న వారి జీవితం ప్రతిరోజూ యుద్ధమే, కుటుంబ పోసిన కోసం అనుక్షణం పోరాడుతుంటారు, ప్రతి రోజు పని దొరికితేనే ఇంట్లో పొయ్యి వెలుగుతుంది, పనిలేక పోతే ఆలోచనలతోనే అర్ధాకలితోనే రోజును సాగదీయాలి. ఇంకా పని చేసే చోట అనుకోని ప్రమాదాలు జరిగితే బ్రతుకు సాగడానికి గగనం అవుతుంది, ఇంట్లో ఏదైనా శుభకార్యం చేయాలి అనుకున్నా, కష్టంలో సహాయం చేయడానికి మార్గాలను అన్వేషిస్తూ ఉండాలి. అలాంటి కూలీలకు భరోసానే లేబర్ కార్డు. లేబర్ కార్డ్ (కార్మిక కార్డు) అనేది నిర్మాణ మరియు అసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రభుత్వం జారీ చేసే గుర్తింపు కార్డు. లేబర్ కార్డు ఎన్నో ప్రయోజనాలు ఇది బీమా, ఆరోగ్య సంరక్షణ, పిల్లల విద్య, వివాహం మరియు ప్రసూతి ప్రయోజనాల వంటి సంక్షేమ పథకాలను పొందడానికి,, భవన నిర్మాణ కార్మికులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ కార్డు కోసం ఆన్‌లైన్‌లో (TBOCWWB పోర్టల్) లేదా సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రమాద బీమా



ద్వారా పని ప్రదేశంలో ప్రమాదం జరిగితే మరణానికి రూ. లక్షల్లో నష్టపరిహారం లేదా గాయాలైతే వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం లభిస్తుంది. కార్మికుల పిల్లల చదువుకు స్కూల్ స్థాయి నుంచి ఉన్నత విద్య స్థాయి వరకు వార్షిక స్కాలర్‌షిప్‌లు అందుతాయి. కార్మికుల కుమార్తెల వివాహం కోసం ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందుతుంది. మహిళా కార్మికులకు లేదా కార్మికుల భార్యలకు ప్రసూతి సమయంలో ఆర్థిక సాయం లభిస్తుంది. కార్మికులకు మరియు వారి కుటుంబ సభ్యులకు అనారోగ్యం, ఆసుపత్రి ఖర్చుల కోసం సాయం అందుతుంది. స్వంత ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం నుండి ప్రత్యేక సాయం పొందవచ్చు. లేబర్ కార్డు పొందాలనుకుంటే గత ఒక సంవత్సరంలో కనీసం 90 రోజులు నిర్మాణ కార్మికునిగా పనిచేసి ఉండాలి. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, వయస్సు ధృవీకరణ పత్రం, ఫోటోలు. లేబర్ కార్డు పొందినవారు ప్రతిసంవత్సరం లేబర్ కార్డును రెన్యూవల్ చేసుకుంటేనే ప్రయోజనాలు నిరంతరంగా అందుతాయి. కార్మికులందరూ లేబర్ కార్డు తీసుకొని తమ కుటుంబ భవిష్యత్తుకు భద్రత కల్పించుకోవాలి. ఇది హక్కు మాత్రమే కాదు.. రేపటి జీవితానికి భరోసా.

డాక్టర్. వై. సంజీవ కుమార్
ఫౌండర్ & ప్రెసిడెంట్
స్కై ఫౌండేషన్
9393613555





# తిరుమలలో సొంత డెయిరీపై ఆలోచించాలి!

**తిరుమల పవిత్రతను కాపాడేందుకు తీసుకునే చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెడితే బాగుంటుంది. ఎందుకంటే దాదపు ఏడాదిన్నరగా తిరుమల లడ్డూ కల్తీ చుట్టూనే రాజకీయాలు నడుస్తున్నాయి. ఈ విషయంలో సిట్ దర్యాప్తు సాగుతోంది. ప్రత్యేక విచారణలు చేపట్టారు. మరో ఏకసభ్య కమిటీ వేస్తున్నట్లు సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇక తిరుమల పవిత్రత దెబ్బతినకుండా, రాజకీయాలకు తావు లేకుండా కఠిన చర్యలకు అసవరమైన నిర్ణయాలు తీసుకోవడంలో దృష్టి పెడితే మంచిది.**

ఎడిటోరియల్

తిరుమలలో తీసుకునే నిర్ణయాలను ఇపరేడు ఎవ్వరూ ప్రశ్నించరు. భక్తులకు వసతి పెంచడం, సౌకర్యాలు పెంచడం, శీఘ్రగతిన దర్శనాలు కల్పించడంలో ప్రధాన నిర్ణయాలు జరగాలి. తిరుమలలో సామాన్యులకు సత్వర దర్శనం అన్నది కలగా మారింది. విఐపిల తాకిడి పెరుగుతోంది. స్వామిని దర్శించుకున్న వారే ఇంకా దర్శించుకుంటున్నారు. అలాగే తిరుమలలో ప్లాస్టిక నిషేధం జరగాల్సి ఉంది. లడ్డూలను తాటాకు బుట్టల్లో సరఫరా చేస్తామని గతంలో ప్రకటించినా అమల్లోకి రాలేదు. మంచినీటి సమస్యలు రాకుండా చూడాలి. తిరుమలలో సొంత డెయిరీ ఏర్పాటుపై ఆలోచన చేయడం లేదు. ఇకపోతే తెలంగాణ నేతల సిఫార్సులపై విక్ష ఇంకా కొనసాగుతోంది. ఈ విక్ష తొలగిపోవాలి. తెలంగాణ నేతలను చిన్నచూపు చూడడం ద్వారా ప్రభుత్వం ఈ ప్రాంతా ప్రజలను అవమానపరుస్తోంది. తిరుమల కొండల్లో పచ్చదనం పెంచాల్సి ఉంది. అడువుల్లో సామాజిక వనాలు పెరగాలి. ఇవన్నీ వదిలేసి ఇంకా కల్తీ నెయ్యి వ్యవహారంతో టిడిపి కూటమి ఒకవైపు, వైకాపా నేతలు మరో వైపు అన్నట్లుగా విమర్శలు, ప్రతివిమర్శలు చేయడం సరికాదు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో సాగుతున్న రాజకీయ ఘటనలు దిగజారుతున్న రాజకీయ విలువలకు పరాకాష్టగా మారాయి. తిరుపతి లడ్డూ కల్తీపై సుప్రీంకోర్టు జోక్యంతో సిబిఐ ఏర్పాటు చేసిన సిట్ నివేదిక బహిరంగ పరచకుండానే అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ స్వంత వ్యాఖ్యానాలతో రాజకీయంగా లబ్ది పొందే చర్యలకు దిగారు. లడ్డూ ప్రసాదంలో కొవ్వు అంటూ అధికార కూటమి చేసిన ప్రచారానికి ప్రాయశ్చితంగా యజ్ఞాలు, యాగాలు, పూజలకు వైసిపి నాయకులు తెరతీసారు. దీనికి పోటీగా లడ్డు కల్తీ చేసిన వైసిపి నేతలంటూ అనేక జిల్లాల్లో పేరు, ఊరు లేని బ్యానర్లు వెలిశాయి. పరస్పర విమర్శలతో మొదలై, హద్దులు దాటిన వ్యక్తిగత విమర్శలకు చేరి, దాడులకు, గృహ దహనాల వరకు ఆ వివాదం విస్తరించింది. తిరుపతి లడ్డు కోట్ల మంది ప్రజల విశ్వాసంతో ముడిపడిన సున్నితమైన అంశం. తమ విశ్వాసానికి తగ్గట్టుగా ప్రసాదం పవిత్రంగా వుండాలని కోరుకుంటారు. అలాంటి లడ్డూలో ఆవు కొవ్వు, ఇతర జంతువుల కొవ్వుల లాంటివి కలిశాయని ముఖ్యమంత్రి చెప్పడంతో తక్షణం నిజానిజాలు తేల్చి దోషులకు శిక్ష వేసివుంటే ఇంత రచ్చ జరిగి ఉండేది కాదు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందూ మతానికి అపచారం జరిగిందంటూ కనకదుర్గమ్మ గుడి మెట్లు కడిగారు. ఇలా కాకుండా నిజాలు నిగ్గుతేల్చి దోషులను కోర్టు ముందు నిలబెట్టి ఉంటే బాగుండేది. అన్నింటికి మించి తిరుమల శ్రీవారు కోట్లకు పడగలెత్తారు. ఆయనకు వందలాది గోవులు కూడా ఉన్నాయి. నిజానికి చిత్తశుద్ధి ఉంటే గోశాలలను విస్తరించి, సొంత డెయిరీ ఏర్పాటు చేసివుంటే పేచీ వచ్చేది కాదు. గోశాలలను పెంచి, డెయిరీ ఏర్పాటు చేస్తే నిరుద్యోగ సమస్యా కొంత తీరుతుంది. నెయ్యి కల్తీ సమస్య ఉత్పన్నం కాదు. కల్తీ తీవ్రమైన ఆరోపణ కాబట్టి సంబంధిత అధికార సంస్థల ద్వారా నేరాన్ని నిరూపించి నిందితులకు శిక్షపడేలా చేయడం ప్రభుత్వ బాధ్యత. అందుకోసం నియమించిన సిట్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలి. నివేదికలో ఏముందో ప్రకటించకుండానే మరో కమిటీ వేయడంలో అర్థం లేదు. నిజానికి కల్తీ నెయ్యి వ్యవహారం తిరుమల ప్రతిష్టను దెబ్బ తీసేందుకు జరిగిన కుట్ర అనడంలో సందేహం లేదు. హిందూ మతంపై దాడి అని అనడంలోనూ సందేహం లేదు. గతంలో జరిగిన రామతీర్థం, అంతర్వేది, దుర్గ గుడి విగ్రహాల విధ్వంసం, రథాలు కాలిపోవడం లాంటి విషయాలను ప్రస్తావించి ఇదంతా హిందూ మతాన్ని దెబ్బతీసి నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న కుట్ర అని పవన్ కళ్యాణ్ ఇప్పటికే ఆరోపించారు. అధికార, ప్రతిపక్ష పార్టీల చర్యలు అంతిమంగా తమ రాజకీయ పబ్బం గడుపుకునేలా తయారయ్యాయి. ఈ సమస్యలనే ఇక ఇంతటితో ముగించాలి. తిరుమల శ్రీవారికి అవసరమైన ఆవునెయ్యిని పొందేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. తిరుమలలో డెయిరీ ఏర్పాటు చేస్తే మరీమంచిది. శాశ్వతంగా సమస్యకు పరిష్కారం దక్కగలదు. వేలకోట్లు వృథా చేసే బదులు శ్రీవారికి అవసరమైన నెయ్యి, పాలు, వెన్న, మీగడలను పొందేందుకు ఇదే సరైన సమయం. డబ్బులకు కొదవ లేదు. గోవులకు కొదవ లేదు. చంద్రబాబు హెరిటేజ్ నడిపిన అనుభవంతో తిరులమ శ్రీవారి కోసం ఓ మంచి డెయిరీ ఏర్పాటు చేస్తే మంచిది. సుగంధ ద్రవ్యాలను కూడా కొండపై పండించే అవకాశలను పరిశీలించాలి. పూదోటలను విస్తరించాలి. ఆ దిశగా కూటమి నేతలు ఆలోచనలు చేయాలి. సమర్థులైన అధికారులు, బోర్డు ఛైర్మన్, సభ్యులు, ఉన్నపరేడే ఇది సాధ్యం అవుతుంది. రాజకీయ తాబేదార్లకు బోర్డును అప్పగించినంతకాలం ఇది ఇది సాధ్యం కాదు. ఇకపోతే తిరుమల కల్తీ వ్యవహారాన్ని కోర్టుల తుది తీర్పుకు వదిలేయాలి. అప్పటి వరకు రాజకీయ విమర్శలకు దిగకపోవడం మంచిది.

# ఆస్ట్రేలియా చూపిన ధైర్యం మనకెప్పుడు?

## భారత్ ఇకనైనా మేల్కొనాలి!

### బాల్యంపై సోషల్ మీడియా సర్జికల్ స్ట్రైక్! మేల్కోలేకపోతే రేపటి తరం మానసిక వికలాంగులే!

**నేటి ఆధునిక యుగంలో సాంకేతికత మానవ జీవన గమనాన్ని మార్చేసింది. కానీ, అదే సాంకేతికత నేడు మన భావి భారత పౌరులైన పిల్లల పాలిట యముడిగా మారుతోంది. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో జరిగిన గుండెలను పిండేసే సంఘటనే దీనికి నిదర్శనం. ఆన్‌లైన్ గేమ్‌లు, సోషల్ మీడియా సీరియల్స్‌కు బానిసలైన ముగ్గురు మైనర్ సోదరీమణులు, తల్లిదండ్రులతో ఏర్పడిన చిన్నపాటి ఘర్షణకే తమ నివాస భవనం తొమ్మిదో అంతస్తు నుండి దూకి ఆత్మహత్య చేసుకోవడం సభ్య సమాజాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఇది కేవలం ఒక విషాద వార్త మాత్రమే కాదు; సోషల్ మీడియా కంపెనీలు తమ బ్యాంక్ బ్యాలెన్స్‌లను పెంచుకోవడానికి అమాయక పిల్లల ప్రాణాలను ఏ విధంగా బలిపీఠం ఎక్కిస్తున్నాయో చెప్పడానికి ఒక భయానక హెచ్చరిక.**



**అల్గారిథమ్స్ కుట్ర.. వ్యసనంలో చిక్కుకున్న మెదడు**

సోషల్ మీడియా దిగ్గజాలు పిల్లల భద్రత కంటే వారిని నిరంతరం తమ ప్లాట్‌ఫారమ్‌లకు అతుక్కుపోయేలా చేసే 'అడిక్టివ్ అల్గారిథమ్స్' (Addictive Algorithms)కే ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఈ అల్గారిథమ్స్ పిల్లల్లో విపరీతమైన ఆందోళన (Anxiety), తమ శరీరాకృతిపై అసంతృప్తి, సామాజిక జీవితం పట్ల అసహ్యం మరియు ఆత్మహత్య ఆలోచనలను పెంపొందిస్తున్నాయి. కౌమారదశలో మెదడు నిర్మాణం మరియు విధుల్లో వేగంగా మార్పులు వచ్చే క్రమంలో, ఈ డిజిటల్ వ్యసనం మద్యం మరియు పొగాకు కంటే ప్రమాదకరమైన రీతిలో వారిని బానిసలుగా మార్చుకుంటోంది. పిల్లల ఆట, చదువు, నిద్ర వంటి కనీస అవసరాలను కూడా ఈ డిజిటల్ మహమ్మారి ఆక్రమిస్తోంది. దీనివల్ల పిల్లలు వాస్తవిక ప్రపంచానికి దూరమై, డిజిటల్ మాయాజాలంలో చిక్కుకుపోతున్నారు. మెదడులోని 'రివార్డ్ పాత్‌వేలను' ప్రేరేపించే ఈ అల్గారిథమ్స్ పిల్లలను మానసిక రోగులుగా మారుస్తున్నాయని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

**టెక్ కంపెనీల కపట బుద్ధి**

గతంలో పొగాకు కంపెనీలు తమ ఉత్పత్తుల వల్ల కలిగే నష్టాలను దాచిపెట్టి ఎలాగైతే కబడ్లు ఆడాయో, నేటి టెక్ కంపెనీలు కూడా అదే దారిలో నడుస్తున్నాయి. పిల్లలకు సోషల్ మీడియాను నిరాకరించడం వారి సమాచార హక్కును కాలరాయడమేనని, హానిపై ఆధారాలు బలహీనంగా ఉన్నాయని వాదించడం ఈ కంపెనీల కపటత్వానికి నిదర్శనం. బాధ్యతను పూర్తిగా తల్లిదండ్రులపైకి నెట్టేస్తూ లాభాల వేటలో పడ్డాయి.

> పిల్లలకు ఆన్‌లైన్ లోకం కంటే నిజ జీవితంలోని మానవీయ సంబంధాలే ముఖ్యమని, వారితో సమయం గడపడం ద్వారా తెలియజెప్పాలి. ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగి ఈ డిజిటల్ విష వలయం నుండి బాల్యాన్ని రక్షించకపోతే, రేపటి తరం మానసిక సమస్యల సుడిగుండంలో చిక్కుకోవడం ఖాయం.

అమెరికా కోర్టుల్లో బయటపడిన ఆధారాల ప్రకారం, తమ ప్లాట్‌ఫరమ్‌ల వల్ల బాలికలు లైంగిక హింసకు, మానవ అక్రమ రవాణాకు గురవుతున్నారని తెలిసి కూడా 'మెటా' వంటి సంస్థలు మౌనంగా ఉన్నాయి. వయస్సు నిర్ధారణ (Age Verification) విషయంలో ఈ సంస్థల నిర్లక్ష్యం ఎంతలా ఉందంటే, అమెరికాలో 8–12 ఏళ్ల వయస్సున్న పిల్లల్లో 40 శాతం మంది నిబంధనలకు విరుద్ధంగా ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ వాడుతున్నారు. అంటే 13 ఏళ్ల వయోపరిమితి అనేది కేవలం కాగితాలకే పరిమితమైందని స్పష్టమవుతోంది.

**ప్రపంచ దేశాల అడుగులు - భారత్ మేల్కొనాలి**

ఈ ముప్పును గుర్తించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం, 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. వయస్సు నిర్ధారణ బాధ్యతను పూర్తిగా కంపెనీలపైనే ఉంచింది. అమెరికా, యూకే, జపాన్ మరియు దక్షిణ కొరియా వంటి దేశాలు కూడా కఠిన చట్టాల దిశగా అడుగులు వేస్తున్నాయి, ఎందుకంటే గత దశాబ్ద కాలంలో ఈ దేశాల్లో యువత మానసిక ఆరోగ్యం దారుణంగా క్షీణించింది.

భారతదేశంలో పరిస్థితి మరింత విషమంగా ఉంది. స్మార్ట్‌ఫోన్ల వ్యాప్తి వేగంగా పెరుగుతోంది. ASER 2024 నివేదిక ప్రకారం, గ్రామీణ భారతంలో సైతం 16 ఏళ్ల లోపు పిల్లల్లో మూడింట ఒక వంతు మందికి సొంత స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. మన దేశ పాలకులు యువత గురించి, 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' (Youth Dividend) గురించి గొప్పగా మాట్లాడుతున్నారు. కానీ, ఆ యువ సంపదను టెక్ కంపెనీల లాభాల కోసం బలి ఇవ్వకుండా కాపాడుకోవాల్సిన బాధ్యతను మాత్రం విస్మరిస్తున్నారు.

**కఠిన చర్యలే శరణ్యం**

టెక్ కంపెనీల తిజోరీలు నింపడానికి మన పిల్లల ప్రాణాలను బలి ఇవ్వలేం. మన విధానకర్తలు వెంటనే నిద్ర మేల్కొని ఆస్ట్రేలియా తరహాలో కఠినమైన నిషేధ చట్టాలను అమలు చేయాలి. కేవలం చట్టాలే కాకుండా, సమాజంలో కూడా అవగాహన పెరగాలి. పిల్లలకు ఆన్‌లైన్ లోకం కంటే నిజ జీవితంలోని మానవీయ సంబంధాలే ముఖ్యమని, వారితో సమయం గడపడం ద్వారా తెలియజెప్పాలి. ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగి ఈ డిజిటల్ విషవలయం నుండి బాల్యాన్ని రక్షించకపోతే, రేపటి తరం మానసిక సమస్యల సుడిగుండంలో చిక్కుకోవడం ఖాయం. మన పిల్లల ప్రాణాలు టెక్ కంపెనీల లాభాల కంటే మిన్న అని చాటిచెప్పే సమయం ఆసన్నమైంది.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషణ
9848559863

# ప్రచార వాడి తగ్గింది... ఓటు వేడి మొదలైంది

## మున్సిపల్ సమరం.. చివరి అంకం ప్రారంభం

మున్సిపల్ ఎన్నికలు అనేవి కేవలం స్థానిక సంస్థల ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియ మాత్రమే కావు; అవి పట్టణ ప్రజాస్వామ్యానికి అద్దం పట్టే రాజకీయ–సామాజిక వ్యాయామం. వీటిలో జరిగే ప్రతి దశ ప్రజల దైనందిన జీవన ప్రమాణాలతో నేరుగా ముడిపడి ఉంటుంది. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక, స్థానిక ఆదాయ వనరుల వినియోగం——ఇవన్నీ మున్సిపల్ పాలన ద్వారా అమలవుతాయి. అందువల్ల ప్రచార పర్వం ముగిసిన తర్వాత మిగిలే "పోల్ మేనేజ్‌మెంట్" దశ ఎన్నికల ఫలితాన్ని మాత్రమే కాదు, ప్రజాస్వామ్య నమ్మకాన్ని కూడా ప్రభావితం చేసే కీలక ఘట్టంగా మారుతుంది. ఈ దశలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఎన్నికల యంత్రాంగం, ఓటర్లు——అందరూ తమ తమ బాధ్యతలను ఎలా నిర్వర్తిస్తారన్నది పట్టణ ప్రజాస్వామ్య నాణ్యతను నిర్ణయిస్తుంది. ప్రచార పర్వం ముగిసే వరకు రాజకీయ వాతావరణం ఉత్కంఠభరితంగా ఉంటుంది. అభ్యర్థులు తమ హామీలను, అభివృద్ధి దృక్పథాన్ని ప్రజల ముందుంచుతారు. అయితే ప్రచారం ముగిసిన క్షణం నుంచి ఎన్నికల పోటీ మరొక రూపం దాలుస్తుంది. ఇక్కడే పోల్ మేనేజ్‌మెంట్ అనే పదం ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ఇది కేవలం ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడం అనే అర్థానికే పరిమితం కాదు; ఓటరు జాబితాల ఖచ్చితత్వం, బూత్ స్థాయి సమన్వయం, ఎన్నికల నియమావళి పాటించడం, పోలింగ్ రోజున శాంతిభద్రతలు కాపాడటం, ఓటింగ్ శాతం పెంచడం వంటి విస్తృత అంశాల సమాహారం. ఈ దశలో జరిగే చిన్న పొరపాటు కూడా ఎన్నికల పారదర్శకతపై అనుమానాలను రేకెత్తించగలదు.

మున్సిపల్ ఎన్నికల్లో బూత్ స్థాయి నిర్వహణ ప్రత్యేక ప్రాధాన్యం కలిగి ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల సామాజిక–ఆర్థిక వైవిధ్యం ఎక్కువగా ఉంటుంది. అపార్ట్‌మెంట్ సంస్కృతి, వలస జనాభా, తాత్కాలిక నివాసితులు, ఉద్యోగ నిమిత్తం తరచూ మారే ప్రజలు——ఇవన్నీ ఓటరు జాబితాల నిర్వహణను క్లిష్టతరం చేస్తాయి. ప్రచార దశలో అభ్యర్థులు ప్రజలతో సంబంధాలు పెంచుకోవడంపై దృష్టి పెడితే, పోల్ మేనేజ్‌మెంట్ దశలో ఆ సంబంధాలను ఓటుగా మలచడం లక్ష్యమవుతుంది. అయితే ఇది చట్టబద్ధ మార్గాల్లోనే జరగాలి. డబ్బు, మద్యం, ప్రలోభాల ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తాయి. ఎన్నికల సంఘం అమలు చేసే నియంత్రణ చర్యలు ఈ నేపథ్యంలో కీలకమవుతాయి.

పోలింగ్ రోజున శాంతియుత వాతావరణం నెలకొల్పడం ఎన్నికల యంత్రాంగానికి పెద్ద సవాల్. పట్టణాల్లో రాజకీయ పోటీ తీవ్రంగా ఉండటం సహజం. స్థానిక ప్రయోజనాలు, కాంట్రాక్టులు, పట్టణ వనరుల నియంత్రణ వంటి అంశాలు ఎన్నికల పోటీని మరింత కఠినతరం చేస్తాయి. అందువల్ల సున్నిత ప్రాంతాల్లో అదనపు భద్రత, సీసీటీవీ పర్యవేక్షణ, మైక్రో ఆబ్జర్వర్లు వంటి చర్యలు అవసరమవుతాయి. పోల్ మేనేజ్‌మెంట్‌లో రాజకీయ పార్టీల పాత్ర కూడా ఇక్కడే పరీక్షకు వస్తుంది. తమ కార్యకర్తలు నియమావళిని పాటించేలా చూడటం, ఉద్రిక్తతలకు తావు ఇవ్వకపోవడం, ఓటర్లను స్వేచ్ఛగా ఓటు వేయనివ్వడం ప్రజాస్వామ్య నిబద్ధతకు సూచిక.




ఓటరు చైతన్యం ఈ దశలో అత్యంత ముఖ్యమైన అంశం. పట్టణాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉండటం చాలా కాలంగా ఆందోళనకర అంశంగా ఉంది. చదువుకున్న వర్గాలు, మధ్యతరగతి ప్రజలు ఎన్నికల రోజున సెలవుదినంగా భావించి ఓటింగ్‌కు దూరంగా ఉండటం ప్రజాస్వామ్యానికి నష్టం. ప్రచార పర్వం ముగిసిన తర్వాత పోల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించే అవగాహన కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఎన్నికల సంఘం, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాఖ్యలు కలిసి ఓటు హక్కు ప్రాముఖ్యతను గుర్తుచేయాలి. పట్టణ అభివృద్ధి నేరుగా మున్సిపల్ పాలనపై ఆధారపడుతుందని ప్రజలు గ్రహించినప్పుడు ఓటింగ్ శాతం సహజంగానే పెరుగుతుంది. సాంకేతికత వినియోగం కూడా పోల్ మేనేజ్‌మెంట్‌లో కీలకంగా మారింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఓటరు ధృవీకరణ వ్యవస్థలు, డిజిటల్ ఓటరు జాబితాలు ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయడమే కాకుండా పారదర్శకతను పెంచుతున్నాయి. అయితే సాంకేతికతపై అపోహలు వ్యాప్తి చెందకుండా స్పష్టమైన సమాచారాన్ని అందించడం అవసరం. ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం నిలబడాలంటే ప్రతి దశలో పారదర్శకత ఉండాలి. అభ్యర్థులు, పార్టీ ప్రతినిధులు, ఎన్నికల అధికారులు పరస్పర సహకారంతో పనిచేసినప్పుడు మాత్రమే ఈ లక్ష్యం సాధ్యమవుతుంది.

మున్సిపల్ ఎన్నికల పోల్ మేనేజ్‌మెంట్‌లో సామాజిక సమీకరణాలు కూడా ప్రభావం చూపుతాయి. పట్టణాల్లో వర్గాల వారీగా ఓటింగ్ ధోరణులు మారుతూ ఉంటాయి. అభివృద్ధి, స్థానిక సమస్యలు, పౌర సదుపాయాల లభ్యత వంటి అంశాలు ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. ప్రచారంలో ఇచ్చిన హామీలను పోలింగ్ రోజున గుర్తుచేసే ప్రయత్నం సహజమే. అయితే ఇది నియమావళి పరిమితుల్లో ఉండాలి. ఎన్నికల సంఘం విధించిన మౌన కాలాన్ని గౌరవించడం ప్రజాస్వామ్య నైతికతకు సూచిక.

పోల్ మేనేజ్‌మెంట్ దశలో మీడియా పాత్ర కూడా కీలకం. తప్పుడు వార్తలు, వదంతులు, సోషల్ మీడియా దుష్ప్రచారం ఎన్నికల వాతావరణాన్ని కలుషితం చేయగలవు. బాధ్యతాయుత జర్నలిజం, వాస్తవ నిర్ధారణ, సమతుల్య ప్రసారం ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంలా పనిచేస్తాయి. ముఖ్యంగా పట్టణ యువత సోషల్ మీడియాపై ఎక్కువగా ఆధారపడుతున్న నేపథ్యంలో నిజమైన సమాచారం అందించడం అత్యవసరం. మున్సిపల్ ఎన్నికల అసలు లక్ష్యం పట్టణ పరిపాలనను ప్రజలకు దగ్గర చేయడం. పోల్ మేనేజ్‌మెంట్‌ను కేవలం రాజకీయ వ్యూహంగా కాకుండా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా చూడాలి. ఓటరు స్వేచ్ఛ, పారదర్శక ఎన్నికలు, సమాన అవకాశాలు——ఇవే ఈ దశలో ప్రధాన ప్రమాణాలు. ఎన్నికల ఫలితం ఏదైనా కావచ్చు; కానీ ప్రజాస్వామ్య నమ్మకం నిలబడితేనే వ్యవస్థ బలపడుతుంది. ప్రచార పర్వం ముగిసిన తర్వాతి ఈ నిశ్శబ్ద దశలోనే ఎన్నికల అసలు పరీక్ష జరుగుతుంది. నియమాలు పాటించబడుతున్నాయా? ఓటరు స్వేచ్ఛకు భంగం కలుగుతోందా? ఎన్నికల యంత్రాంగం సమర్థంగా పనిచేస్తుందా? అనే ప్రశ్నలకు సమాధానాలు ఇక్కడే దొరుకుతాయి.

చివరికి మున్సిపల్ ఎన్నికలు పట్టణ భవిష్యత్తును నిర్ణయించే ప్రజా తీర్పు. పోల్ మేనేజ్‌మెంట్ ఆ తీర్పు స్వచ్ఛంగా వెలువడేలా చేసే వ్యవస్థాత్మక ప్రయత్నం. రాజకీయ పోటీ ఎంత తీవ్రమైనా ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధ పరిమితులు, నైతిక బాధ్యతలు అన్నింటికంటే పైచేయి సాధించాలి. పట్టణ ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి, బాధ్యతాయుత పాలన——ఇవన్నీ ఓటు పెట్టే క్షణంలోనే రూపుదిద్దుకుంటాయి. అందుకే ప్రచారం ముగిసిన తర్వాతి ప్రతి క్షణం ప్రజాస్వామ్య పరిపక్వతకు అద్దం పడుతుంది. సమన్వయం, పారదర్శకత, నిబద్ధతతో సాగిన పోల్ మేనేజ్‌మెంట్ మున్సిపల్ పాలనకు బలమైన పునాది వేస్తుంది. ఇదే పట్టణ ప్రజాస్వామ్య విజయానికి అసలు కొలమానం.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్-కాలమిస్ట్
9440595494

## పసుపు పాలు
# తాగుతున్నారా?
### అయితే ఈ ఒక్క పొరపాటు అస్సలు చేయకండి..

భారతీయ ఇళ్లలో రాత్రి పడుకునే ముందు పసుపు పాలు తాగడం అనేది ఒక ఆచారం. జలుబు చేసినా, ఒళ్లు నొప్పులుగా ఉన్నా, రోగనిరోధక శక్తి పెంచుకోవాలన్నా మనకు గుర్తొచ్చే మొదటి చిట్కా ఇదే.



అయితే మనలో చాలామంది పసుపు పాలు తయారు చేసేటప్పుడు ఒక కీలకమైన పొరపాటు చేస్తున్నారని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆ ఒక్క తప్పు వల్ల పసుపులోని గుణాలు శరీరానికి అందకుండా పోతున్నాయి. పసుపులో కర్కుమిన్ అనే అద్భుతమైన పదార్థం ఉంటుంది. ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉంటుంది. అయితే కర్కుమిన్‌కు ఒక బలహీనత ఉంది. ఇది మన రక్తంలో అంత సులభంగా కలిసిపోదు. మనం పసుపును కేవలం పాలతో కలిపి తాగితే అందులోని కర్కుమిన్ శరీరానికి పూర్తిగా అందదు. పసుపు పాలు తయారు చేసేటప్పుడు అందులో చిటికెడు మిరియాల పొడి తప్పనిసరిగా వేయాలి. మిరియాల్లో పైపెరిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది పసుపులోని కర్కుమిన్‌ను శరీరం గ్రహించే శక్తిని ఏకంగా 2,000% పెంచుతుంది. అంటే మీరు మిరియాలు వేయకుండా పసుపు పాలు తాగితే, మీరు ఆశించిన ఆరోగ్య ప్రయోజనాలు మీకు అందవు.

కర్కుమిన్ కొవ్వులో కరుగుతుంది. కాబట్టి పాలలో చిటికెడు నెయ్యి లేదా కొబ్బరి నూనె వేస్తే అది వేగంగా శరీరానికి అందుతుంది. తెల్ల చక్కెర ఆరోగ్యానికి అంత మంచిది కాదు. పసుపు పాలలో సహజమైన తీపి కోసం బెల్లం లేదా తేనె వాడటం మంచిది. ప్యాకెట్ పసుపు కంటే పసుపు కొమ్ములను దంచి వాడితే దాని ఫలితం అద్భుతంగా ఉంటుంది. రాత్రి పూట పసుపు పాలు తాగడం వల్ల ఒత్తిడి తగ్గి గాఢ నిద్ర పడుతుంది. కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులను తగ్గించడంలో ఇది కీలకంగా పనిచేస్తుంది. రక్తాన్ని శుద్ధి చేసి చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది. పసుపు పాలు జీర్ణక్రియను వేగవంతం చేస్తాయి. పసుపు పాలు ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ.. అతిగా తాగడం వల్ల వేడి చేసే అవకాశం ఉంటుంది. అలాగే గర్భిణీలు, కిడ్నీలో రాళ్లు ఉన్నవారు డాక్టర్ సలహా తీసుకోవడం ఉత్తమం.


# ప్రయాణాల్లోనూ తాజాగా మెరిసిపోండి..
### మీ కోసమే ఈ సింపుల్ స్కిన్ కేర్ టిప్స్



ప్రయాణం అంటే కేవలం కొత్త చోట్లను చూడడం, ఫోటోలు తీయడం మాత్రమే కాదు. అయితే, సాధారణంగా మన చర్మం ప్రయాణ సమయంలో అనేక సమస్యలకు గురవుతుంది. దుమ్ము-ధూళి, ఎండ, చల్లటి గాలి, వాతావరణ మార్పులు, చెమట.. వీటి ప్రభావం మన చర్మంపై ఉంటుంది. దీంతో మొటిమలు, దద్దుర్లు, పొడిబారడం, చర్మం నిర్జీవంగా మారడం లాంటి సమస్యలు ఎదుర్కొవాల్సి ఉంటుంద. కానీ, కొన్ని సింపుల్ చిట్కాలతో మీరు ఎక్కడికి వెళ్లినా, చర్మాన్ని మృదువుగా, హైడ్రేటెడ్‌గా, సౌందర్యవంతంగా ఉంచవచ్చు.

**1. ముఖాన్ని శుభ్రంగా ఉంచడం**

ప్రయాణంలో ముఖంపై ధూళి, ఇసుక వలన రాత్రికి గుడ్‌నైట్ రిట్యూయల్ మిస్ అవ్వడం సహజం. కానీ దీన్ని మినహాయిస్తే మొటిమలు, దద్దుర్ల సమస్యలు ఎదురవుతాయి. తేలికపాటి ఫేస్ వాష్ ఉపయోగించడం ఉత్తమం. లేదంటే నీరు లేకుండా ఉపయోగించగల క్లెన్సింగ్ వాటర్ కూడా చాలా సౌకర్యవంతం, ముఖ్యంగా రైలు, విమానం ప్రయాణంలో ఇది ఉపయోగించవచ్చు. రోజుకు కనీసం రెండు సార్లు ముఖాన్ని శుభ్రం చేసుకోవడం చర్మానికి తక్షణం మెరుగుదల అందిస్తుంది.



**2. మాయిశ్చరైజ్ చేయడం - చర్మాన్ని హైడ్రేట్ చేయండి**

ఎండ, విమానాల్లోని ఏసీ, పర్వతాల చల్లటి గాలి చర్మాన్ని త్వరగా పొడిగా, గరుకుగా చేస్తాయి. కాబట్టి.. తేలికపాటి కానీ గుణవంతమైన మాయిశ్చరైజర్ ప్రతి చోటా తీసుకోవడం అవసరం. ఎక్కువగా ప్రయాణించే ముందు ఉదయం, రాత్రి మాయిశ్చరైజర్ ఉపయోగించడం వల్ల చర్మం మృధువుగా ఉంటుంది.

**3. సన్‌స్క్రీన్ - ఎండ నుంచి రక్షణ**

చాలా మంది వ్యక్తులు “సూర్యరశ్మి కేవలం బీచ్‌కి మాత్రమే” అనుకుంటారు. నిజంగా, ఎక్కడ ఉన్నా సూర్యుడు చర్మానికి దెబ్బతీస్తాడు. బయటకు వెళ్లే కనీసం 15 నిమిషాల ముందు సన్‌స్క్రీన్ అప్లై చేయండి. అవసరమైతే, రోజుకు 3 సార్లు సన్‌స్క్రీన్ రీఅప్లై చేయండి. దీంతో మీ చర్మం పొడి బారగుండా, దెబ్బతినకుండా ఉంటుంది.

**4. ఫేస్ మిస్ట్ - తక్షణ తాజాదనం**

దూర ప్రయాణాలలో అలసట, ఎండ, పొడి గాలి వల్ల చర్మం ఒడిసిపోతుంది. ఫేస్ మిస్ట్ చర్మానికి తక్షణ సొగసైన హైడ్రేషన్ ఇస్తుంది. వేసవిలో, మీ బ్యాగులో ఎల్లప్పుడూ ఇది ఉంచడం మంచిది.

**5. లిప్ బామ్, ఫేస్ వైప్స్**

చాలామంది ప్రయాణంలో పెదవులు పగిలిపోవడం సమస్యగా ఎదుర్కుంటారు. హైడ్రేటింగ్ లిప్ బామ్ ప్రతి వాకేషన్‌లో తప్పనిసరి. మృదువైన ఫేస్ వైప్స్ కూడా ముఖం శుభ్రంగా ఉంచడానికి, వెంటనే ధూళిని తొలగించడానికి ఉపయోగపడతాయి. అందమైన గమస్థానాలకు ప్రయాణం ఆహ్లాదకరమే అయినప్పటికీ, చర్మం మీద ఎల్లప్పుడూ ప్రభావం చూపుతుంది. క్రమమైన కేర్ రూటీన్, తేలికపాటి ఉత్పత్తులు, హైడ్రేషన్ అలవాట్లు పాటిస్తే, మీరు ఎక్కడ ఉన్నా తాజాగా, మృదువుగా, ఆరోగ్యంగా ఉన్న చర్మం పొందవచ్చు.

# బుల్ బుల్లెట్ పరుగు..
### మదుపర్ల సంపద 12 లక్షల కోట్లు పైకి..

నినాదం మార్కెట్

ముంబయి: చాలా రోజుల తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్‌లో కొత్త ఉత్సాహం కనిపించింది. ఎన్నాళ్లగానో వేచి చూస్తున్న అమెరికాతో ట్రేడ్ డీల్‌పై స్పష్టత రావడంతో దలాల్ స్ట్రీట్‌లో బుల్ రంకెలేసింది. ఉదయం మార్కెట్ ప్రారంభమైనప్పటి నుంచి చివరి వరకు బుల్లెట్‌లా బుల్ రన్ కొనసాగింది. ఫలితంగా సెన్సెక్స్ 2 వేల పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 25,700 ఎగువకు చేరింది. అన్ని రంగాల స్టాక్స్ లాభపడ్డాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల





**మొత్తం విలువ రూ.12 లక్షల కోట్లు పెరిగి రూ.467.35 లక్షల కోట్లకు చేరింది.**

భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం రాత్రి ప్రకటించారు. ప్రతీకార సుంకాలనూ 18 శాతానికి తగ్గిస్తున్నామని వెల్లడించారు. అమెరికా దిగుమతులపై విధిస్తున్న సుంకాలను సున్నా స్థాయికి చేర్చడానికి, రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపేయడానికి భారత్ అంగీకరించిందని తెలిపారు. ట్రంప్ ప్రకటనతో ఇప్పటిదాకా భారత్ ఉత్పత్తులపై పడుతున్న 50 శాతం సుంకాలు 18 శాతానికి దిగి రానున్నాయి. ఈ ప్రకటన స్టాక్ మార్కెట్ సూచీలకు కొత్త బూస్ట్ ఇచ్చింది.

బుల్ పరుగు ఇలా: ట్రంప్ ప్రకటన నేపథ్యంలో సెన్సెక్స్ ఆరంభంలోనే దాదాపు 3600 పాయింట్ల లాభంతో 85,323.20 వద్ద (క్రితం ముగింపు 81,666.46) ప్రారంభమైంది. ఓ దశలో 4 వేలకు పాయింట్ల లాభంతో 85,871.73 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 2072.67 పాయింట్ల లాభంతో 83,739.13 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 26,341.20 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 639.15 పాయింట్ల లాభంతో 25,727.55 వద్ద స్థిరపడింది.

కోలుకున్న రూపాయి: దేశీయ కరెన్సీ రూపాయి కూడా కోలుకుంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ సోమవారం 91.51గా ఉండగా.. ట్రేడ్ డీల్ నేపథ్యంలో ఒక్కరోజులోనే 1.36 శాతం బలపడి 90.26కి చేరింది. రూపాయి విలువ ఈ స్థాయిలో బలపడడం ఇదే తొలిసారి.

ఆ రెండూ మినహా: సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, బీఈఎల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. అదానీ పోర్ట్స్ (9.12 శాతం), బజాజ్ ఫైనాన్స్ (6.68 శాతం), ఇండిగో (5.51 శాతం), పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ (283.25), సన్‌ఫార్మా (4.54) చొప్పున లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4921 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



# మళ్లీ పెరిగిన బంగారం.. వెండి ధరలు

**హైదరాబాద్:** తగ్గినట్లే తగ్గిన బంగారం, వెండి ధరలు మరోసారి పెరిగాయి. యూఎస్ ఫెడ్‌కు కొత్త ఛైర్మన్ నియామకం, సీఎంఈ మార్జిన్‌ను పెంచడం, గరిష్ఠాల వద్ద భారీ ప్రాఫిట్ బుకింగ్ కారణంగా ఈ రెండు లోహాల ధరలు భారీగా పతనమైన సంగతి తెలిసిందే. దీన్ని అవకాశంగా తీసుకుని మదుపర్లు దీర్ఘకాలిక వ్యూహంతో కొనుగోళ్లకు దిగడంతో వీటికి మళ్లీ డిమాండ్ ఏర్పడింది. దీంతో అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో బంగారం ఔన్సు 4,887 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి 85.98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దీంతో దేశీయంగానూ ఈ రెండు లోహాల ధరలు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 10 గ్రాముల మేలిమి పసిడి ధర 1.56 లక్షల వద్ద కొనసాగుతుండగా.. కిలో వెండి ధర రూ.2.74 లక్షలు పలుకుతోంది. సోమవారం ధరలతో పోలిస్తే బంగారం దాదాపు రూ.6 వేలు పెరగ్గా.. వెండి రూ.20 వేలకు పైగా పెరిగింది. కమొడిటీల ట్రేడింగ్ జరిగే ఎంసీఎక్స్‌లోనూ 10 గ్రాముల బంగారం ఏప్రిల్ కాంట్రాక్టు ధర రూ.1.51 లక్షల వద్ద ట్రేడవుతుండగా.. కిలో వెండి రూ.2.60 లక్షల వద్ద కొనసాగుతోంది.

## నెలకు రూ.49 వేలతో
# ఇంటికి టెస్లా వై

దిల్లీ: అపర కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన కార్ల తయారీ సంస్థ టెస్లా (Tesla) దేశీయంగా తన విక్రయాలు పెంచుకునేందుకు కొత్త వ్యూహంతో ముందుకొచ్చింది. ఎక్స్ఛేంజీ ఆఫర్‌తో పాటు, ఈఎంఐ సదుపాయాన్ని ప్రకటించింది. గతేడాది భారత్‌లో లాంచ్ చేసిన మోడల్ వైకి ఆశించిన స్థాయిలో డిమాండ్ లేకపోవడంతో ఈ ఆఫర్లకు తెరతీసింది.



పెట్రోల్, డీజిల్ కార్ల వినియోగదారులు ఎలక్ట్రిక్ కారుకు మారాలనుకుంటే ఎక్స్ఛేంజ్‌పై రూ.3 లక్షల వరకు ప్రోత్సాహకాలను టెస్లా ఆఫర్ చేస్తోంది. లేదంటే రూ.6 లక్షల డౌన్‌పేమెంట్‌తో నెలకు రూ.49 వేలు ఈఎంఐ చెల్లించడం ద్వారా ప్రీమియం ఎలక్ట్రిక్ కారును సొంతం చేసుకోవచ్చని టెస్లా పేర్కొంది. సాధారణ కార్లతో ఈవీని సొంతం చేసుకోవడం ద్వారా ఫ్యూయల్, నిర్వహణ ఖర్చుల రూపేణా నెలకు రూ.20వేల వరకు ఆదా చేసుకోవచ్చని తెలిపింది. అప్పుడు వాస్తవంగా చెల్లించేది రూ.29 వేలేనని తెలిపింది.

టెస్లా మోడల్ వై కారు దేశీయంగా రూ.60 లక్షల ధరకు విడుదలైన సంగతి తెలిసిందే. తొలినాళ్లలో ఈ కారు కొనుగోలుకు పెద్ద సంఖ్యలో ఆసక్తి కనబరిచారు. బుకింగ్‌ల వద్దకు వచ్చేసరికి ఆ సంఖ్య వందలకు చేరింది. అందులో రిజిస్ట్రేషన్ చేసుకునేవరకు వెళ్లింది మాత్రం కొందరే. ఫాడా డేటా ప్రకారం.. గతేడాది టెస్లా 225 కార్లను విక్రయించింది. దేశంలో మొత్తం ఈవీ కార్ల విక్రయాలతో పోలిస్తే ఈ సంఖ్య చాలా తక్కువ. 2024లో దేశంలో 99,875 ఈవీ కార్లు అమ్ముడుకాగా.. 2025లో 77 శాతం వృద్ధితో 1,76,817 యూనిట్లను వివిధ కంపెనీలు విక్రయించాయి. అధిక ధర వల్ల మోడల్ వై లగ్జరీ సెగ్మెంట్‌లోకి వెళ్లిపోయింది. ఆ ధరలో బీఎండబ్ల్యూ, బీవైడీ వంటి కార్లు మెరుగైన ఫీచర్లతో లభిస్తుండటం.. మోడల్ వై కస్టమర్లను ఆకట్టుకోవడంలో విఫలమైంది. ఈ నేపథ్యంలో ఆఫర్లను ప్రకటించడం గమనార్హం.

## ఉడికించిన గుడ్డు.. ఆమ్లెట్..
# ఏది మంచిది..?
### బరువు పెరగొద్దంటే మాత్రం..





గుడ్డు మంచిదే కానీ.. దీని విషయంలో ఓ సందేహం కూడా దాగుంది.. ఉడికించిన గుడ్డు లేదా ఆమ్లెట్ తినడం.. ఇందులో ఏది ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుంది..? అనే దానిపై ప్రజలు తరచుగా గందరగోళానికి గురవుతుంటారు. అయితే.. బరువు తగ్గడానికి, బరువు పెరగడానికి గుడ్లు ఎలా తినాలి..? డైటీషియన్లు ఏం చెబుతున్నారు.. ఉడికించిన గుడ్డు లేదా ఆమ్లెట్ మంచిదా..? అనే వివరాలను తెలుసుకుందాం..

**బరువు తగ్గడానికి ఏది మంచిది?**

మీరు బరువు తగ్గాలని చూస్తున్నట్లయితే.. ఉడికించిన గుడ్లు ఉత్తమ ఎంపికగా పరిగణించబడతాయి. ఉడికించిన గుడ్లలో నూనె లేదా కొవ్వు ఉండవు.. కాబట్టి వాటిలో కేలరీలు తక్కువగా ఉంటాయి. వాటిలో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుంది.. ఇది మిమ్మల్ని ఎక్కువసేపు కడుపు నిండి ఉండేలా చేస్తుంది.. ఇది తరచుగా ఆకలి బాధలను నివారిస్తుంది. ప్రతిరోజూ అల్పాహారంగా ఒకటి నుండి రెండు ఉడికించిన గుడ్లు తినడం వల్ల మీ జీవక్రియ పెరుగుతుంది. ఇది కొవ్వును కాల్చేస్తుంది. అందువల్ల, ఉడికించిన గుడ్లు తినడం ముఖ్యంగా ఆహారంలో ఉన్నవారికి ప్రయోజనకరంగా ఉంటుంది.

**బరువు పెరగడానికి ఏది సరైనది?**

మరోవైపు, మీరు బరువు పెరగాలని చూస్తున్నట్లయితే, ఆమ్లెట్ మంచి ఎంపిక కావచ్చు. నూనె, వెన్న, ఉల్లిపాయలు, టమోటాలు.. కొన్నిసార్లు జున్ను కూడా దీని తయారీలో ఉపయోగించవచ్చు. ఇది దాని క్యాలరీ కంటెంట్‌ను పెంచుతుంది.. ఇలా బరువు పెరగడానికి దోహదం చేస్తుంది. అందువల్ల, వ్యాయామం చేసే వ్యక్తులు, ఆమ్లెట్‌లు తినడం వల్ల వారికి ఎక్కువ శక్తి లభిస్తుంది.. ఇది కండరాలను నిర్మించడంలో సహాయపడుతుంది. ఆమ్లెట్‌లను సరైన మొత్తంలో తినడం వల్ల మీరు ఆరోగ్యకరమైన రీతిలో బరువు పెరగవచ్చు.

ఉరుకులు పరుగుల ప్రస్తుత కాలంలో చాలామంది పలు అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు.. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు ఫిట్‌నెస్, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి ఎక్కువగా తెలుసుకుంటున్నారు..




అంతేకాకుండా అవగాహనను పెంచుకుంటున్నారు. తత్ఫలితంగా, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అనుసరించాలని కోరుకుంటారు. ముఖ్యంగా ఫిట్‌నెస్ ఔత్సాహికులు, జిమ్‌కు వెళ్లేవారు.. తమ ప్రోటీన్ తీసుకోవడం గురించి ప్రత్యేకంగా ఆందోళన చెందుతారు.. ఇలాంటి పరిస్థితుల్లో ప్రోటీన్ ను భర్తీ చేయడానికి గుడ్లను వారి ఆహారంలో చేర్చుకుంటారు. గుడ్డులో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది..

**ఆరోగ్యానికి ఏది ఎక్కువ ప్రయోజనకరం?..**

ఉడికించిన గుడ్డు, ఆమ్లెట్.. రెండూ మీ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మీరు వాటిని సరైన పద్ధతిలో, సరైన పరిమాణంలో తినాలి. తక్కువ నూనెతో తయారుచేసిన ఆమ్లెట్ కూడా ఆరోగ్యంగా ఉంటుంది. ప్రతిరోజూ ఉడికించిన గుడ్లు తినడం వల్ల శరీరానికి అవసరమైన ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి.

అయితే.. ఏమైనా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటే.. గుడ్డు తినే ముందు ఆరోగ్య నిపుణులను సంప్రదించడం మంచిది.



నినాదం
నిఖార్సైన జర్నలిజం



## ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ ధ్యేయం..

ఎమ్మెల్యే గణబాబు



**గాజువాక, విలేకరి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గణబాబు అన్నారు. సోమవారం 40వ వార్డు పరిధి సింధియా న్యూకాలనీ సమీపంలో గల ఈఎస్ ఐ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబుకు ఆసుపత్రి సూపర్ డెంట్ ఫణీంద్ర ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే గణబాబు విలేకర్లతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎక్కువగా పరిశ్రమలు ఉండడంతో రోగులగు ఎలాంటి సేవలందుతున్నాయో, ఆసుపత్రి నిర్వహణ ఎలా ఉందో, రోగులకు సరిపడా వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారా తదితర అంశాలపై వైద్యులతో చర్చించామన్నారు. ఈ ఆసుపత్రిలో రోగ నిర్ధారణ అయిన తరువాత కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫరల్ చేస్తుండడం జరుగుతుందని ముఖ్యంగా ప్రస్తుతం క్యాన్సర్ మహమ్మారి అధికంగా విజృంభిస్తున్న తరుణంలో ఈ ఆసుపత్రిలో క్యాన్సర్ పేషెంట్ల సంఖ్య గణనీయంగా ఉందని దానికి తగ్గట్టుగానే ఎటువంటి పరిమితి లేకుండా వైద్య చికిత్సలు అందించడం హర్షించదగ్గ విషయన్నారు. అయితే ఇక్కడ మందుల కొరత, ల్యాబ్ పరికరాల కొరత ఉన్నట్లు గుర్తించామని వాటిని కూడా రోగులకు అందుబాటులో ఉంచాలని అలాగే తగినంత సిబ్బందిని కూడా నియమించేలా చర్యలు తీసుకోవాలని ప్రధాన వైద్యాధికారికి సూచించారు. అలాగే నెలకు 21 వేల రూపాయల వేతనం కంటే తక్కువ ఉంటేనే ఈఎస్ ఐ వర్తిస్తుందనే నిబంధన తన దృష్టికి వచ్చిందని ఈ విషయాన్ని తమ అధినాయకత్వం దృష్టికి తీసుకొని వెళ్ళి మినిమం నెలకు 30 వేల రూపాయిల వేతనం వరకూ ఈఎస్ ఐ వర్తించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్ డెంట్ ఫణీంద్రతో పాటు స్థానిక కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పలు వార్డుల తెదేపా అధ్యక్ష, కార్యదర్శులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## తీర్థ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు



**గోపాలపట్నం,విలేకరి**

విశాఖ పశ్చిమ నియోజకవర్గం పరిధి 92వ వార్డు పద్మనాభనగర్లో సోమవారం జరిగిన తీర్థ మహోత్సవంలో ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా పాల్గొని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు తెదేపా ఇన్ ఛార్జ్ దాడి రమేష్ నాయుడు, నాయకులు కంపర ఆనంద్ తదితరులతో పాటు స్థానిక కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మంచినీటి పైపులైనుకు మరమ్మత్తులు

**గాజువాక, విలేకరి**



జీవీఎంసీ 61, 62వ వార్డులకు సంబంధించిన జనతాకాలనీ నుండి అచ్చింనాయుడు లోవకు వెళ్ళే మంచినీటి ప్రధాన పైపులైనుకు పెద్ద రంధ్రం ఏర్పడడంతో ప్రక్కనే గల మురుగు కాలువ నీరు ఆ పైపులైను లోపలకు ప్రవేశిస్తుండంతో ఈ విషయాన్ని స్థానిక ప్రజలు ఆయా వార్డుల తెదేపా నాయకులు శ్రీధర్, చైతన్యలకు తెలియజేసారు. దీంతో వారు ఆ సమస్యను ప్రభుత్వ విప్ స్థానిక శాసనసభ్యులు గణబాబుకు తెలియజేయగా వెంటనే ఎమ్మెల్యే గణబాబు ఆ పైపులైనుకు మరమ్మత్తులు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ ఆదేశాల మేరకు సోమవారం మంచినీటి విభాగం సిబ్బంది పైపులైనుకు మరమ్మత్తులు చేపట్టారు. ఈ మరమ్మత్తు పనులను తెదేపా నాయకులు శ్రీధర్ స్వయంగా పర్యవేక్షించారు. మంచినీటి సమస్య పరిష్కారం అవడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే గణబాబుకు, స్థానిక తెదేపా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అపురూపం.. ఆహ్లాదం.. ఆధ్యాత్మికం..


## పి.భీమవరం రోడ్డులో శివాలయం వద్ద పుష్కరిణి

ఆకట్టుకుంటున్న పుష్కరిణి అందాలు ▸▸ మహాశివరాత్రికి ప్రారంభోత్సవం









**బుచ్చియ్యపేట, విలేకరి:**

**పూర్వం ఆలయాలతో పాటు ఆయా ప్రాంగణాల్లో పుష్కరిణి (కోనేరు)లు నిర్మించేవారు. ఆలయాలకు వచ్చే భక్తులందరూ పుష్కరణిలో స్నానాలు ఆచరించి దర్శనానికి వెళ్లేవారు. ఇప్పటికీ చాలాపురాతన ఆలయాల దగ్గర వాటిని చూస్తుంటాం.అయితే నిర్వాహణ లేక, ఎవరూ పట్టించుకోక అవన్నీ జీర్ణావస్థకు చేరుకున్నాయి.ప్రస్తుతం నిర్మిస్తున్న ఆలయాల దగ్గర ఎక్కడా కోనేరు నిర్మాణాలు జరగడం లేదు.బుచ్చియ్యపేట మండలం పి.భీమవరం రోడ్డులో భీమలింగేశ్వరస్వామి ఆలయం దగ్గర మాత్రం కొత్తగా పుష్కరణి(కోనేరు) నిర్మించి చూడచక్కగా అభివృద్ధి చేశారు.కోనేరు మధ్యలో శివపార్వతుల విగ్రహాలు, పూలమొక్కలు,విద్యుద్దీపాలు, చుట్టూ మాడవీధులు, ప్రకృతి అందాలు వెరశి భక్తులందరినీ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.**

### కొత్తగా వెలిసిన ఆలయం........

రెండేళ్ల కిందట వరకు ఈ ప్రాంతమంతా నిర్మాణుష్యంగా ఉండేది.చుట్టూ తోటలు, ముళ్ల పొదలు, బీడు భూములు తప్ప అక్కడ ఏమీ ఉండేవి కావు. పొద్దువాలితే చాలు ఈ మార్గంలో తిరగడానికి అందరూ భయపడేవారు.బంగారుమెట్టకు చెందిన కాళ్ల కోటీశ్వరరావు అనే వ్యక్తి అక్కడ వ్యవసాయం చేసుకుండేవాడు.రోడ్డుపక్కన చిన్న పాక ఏర్పాటు చేసుకుని అక్కడ శివునికి రోజూ పూజలు చేస్తుండేవారు.తన పొలంలో శివలింగం ఆకారంలో స్వయంభూగా లభించిన రాయిని తీసుకువచ్చి ఆరాధించేవారు. ప్రతీఏటా కార్తీకమాసంలో వనభోజనాలు ఏర్పాటుచేసేవారు.ఆ సమయంలో మాత్రమే అక్కడకి కొంతమంది భక్తులు వచ్చి పూజలు చేసి వనభోజనాలు చేసి వెళ్లేవారు.ఈ విధంగా చాలాకాలం పాటు నడిచింది.రెండేళ్లకిందట లింగభూపాలపురఅగ్రహారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచి తమరాన దాసు దాతలు సహకారంతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.కొద్ది రోజుల్లోనే చక్కగా ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేసి అత్యంత వైభవంగా శివలింగాన్ని ప్రతిష్ఠ చేయించారు.అప్పటి నుంచి ఆలయంలో ధూపదీప నైవేధ్యాలతో నిత్య పూజలు జరుగుతున్నాయి.చుట్టుపక్కల గ్రామాల నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేస్తున్నారు.

### కోనేరు(పుష్కరిణి) అభివృద్ధి...

క్రమేపీ భక్తుల రాక పెరగడంతో ఆలయ అభివృద్ధిపై దృష్టిసారించారు. లింగభూపాలపురఅగ్రహారం మాజీ సర్పంచి తమరాన దాసు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అభివృద్ధి పనులు చేయిస్తున్నారు.ఆలయం ఎదురుగా ముళ్లపొదలతో కూడిన ఖాళీ స్థలాన్ని శుభ్రం చేయించి పుష్కరిణి నిర్మించారు. మధ్యలో శివపార్వతుల విగ్రహాలను ఏర్పాటు చేసి పైన కేరళ ఆలయ నిర్మాణశైలి ఆకారంలో గోపురాన్ని నిర్మించారు.మరోవైపున పంచలోహాలతో తయారు చేసిన శివలింగాన్ని ఏర్పాటు చేసి నిత్య గంగాభిషేకం జరిగేవిధంగా సన్నాహాలు చేస్తున్నారు.భక్తులందరూ కోనేరులో దిగి స్నాన్నాలు ఆచరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.శివపార్వతులకు ప్రదక్షణలు చేసుకునేందుకు కోనేరు చుట్టూ నాలుగువైపులా మార్గాలను నిర్మించారు. అందమైన పూలమొక్కలను నాటించి పరసరాలన్నీ అహ్లాదకరంగా తయారు చేశారు. రాత్రిపూట వెలుగులు విరజిమ్మేవిధంగా చుట్టూ ఎస్ఈడీ దీపాలను ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి నాటికి పనులన్నీ పూర్తిచేసి ప్రారంభోత్సవం చెయ్యడానికి ఏర్పాటు చేస్తున్నామని మాజీ సర్పంచ్ దాసు తెలిపారు. అదే రోజున పది వేలమందికి అన్నప్రసాద వితరణ చెయ్యడానికి సిద్ధం చేస్తున్నామన్నారు. శివపార్వతుల విగ్రహాలకు పెయింటింగ్లు,ఇతర పనులన్నీ తుది దశకు చేరుకున్నాయన్నారు. ప్రారంభోత్సవానికి జిల్లా నలుమూలల నుండి ఎమ్మెల్యేలు,ప్రజాప్రతినిధులు, నాయకులను ఆహ్వానిస్తున్నామన్నారు.

## ఆధునిక వ్యాధులకూ అందుబాట్లో వైద్యం

### కిరణ్స్ సెడాట్ అండ్ అవ్యాన్ స్కిన్ హెయిర్ కేర్ లేజర్ క్లినిక్ పునః ప్రారంభం






**విశాఖపట్నం, విలేకరి :**

ఆధునిక వ్యాధులకు వైద్యం అందుబాట్లోకి వచ్చిందని ప్రముఖ వైద్యులు పేర్కొన్నారు. ప్రముఖ ఎండ్రోకైనాలజీ వైద్యులు డాక్టర్ కిరణ్ కుమార్ గొల్ల (ఎయిమ్స్, న్యూఢిల్లీ), డెర్మటాలజిస్టు డాక్టర్ శ్వేత మాధవి యెర్రోజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కిరణ్స్ సెడాట్ అండ్ అవ్యాన్ స్కిన్ హెయిర్ కేర్ లేజర్ క్లినిక్ సెంటర్ను ఆధునీకరించారు. రోగులకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో ఎంవీపీ కాలనీ సెక్టర్–2 నుంచి తమ క్లినిక్ను సెక్టర్–9లోని సమతా కాలేజ్ సమీపంలోకి ఆదివారం మార్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేజీహెచ్ డెర్మటాలజీ విభాగ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ పి. గురు ప్రసాద్ విచ్చేసి ఈ నూతన కేంద్రాన్ని ప్రారంభించారు. అతిథులుగా కేజీహెచ్ విశ్రాంత వైద్యులు ప్రొఫెసర్ మైథిలీ, ప్రొఫెసర్ దిలీప్ కుమార్ హాజరయ్యారు. వారంతా మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మధుమేహం, హార్మోన్ సమస్యలు, చర్మ వ్యాధులకు ఇక్కడ నాణ్యమైన వైద్య సేవలందుతాయన్నారు.

## డయల్ యువర్ సీఎండీకి విశేష స్పందన



**విశాఖపట్నం (ప్రతినిధి) :**

**విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ప్రారంభించిన డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 48 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో ప్రధానంగా విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటులో ఇబ్బందులు, ట్రాన్స్ఫార్మర్ల మార్పిడిలో జాప్యం, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల ఎస్టిమేషన్లు, విద్యుత్ లైన్ల మార్పు, విద్యుత్ బిల్లులు, విద్యుత్ లైన్లు స్తంభాల మార్పిడి, విద్యుత్ స్తంభాలపై వైర్లు వేలాడుతుండడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, తదితర సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యలు త్వరితగతిన పరిష్కారం అయ్యేంత వరకు కార్పొరేట్ కార్యాలయ అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912 కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు 9493681912 కు చాట్ చేయడం ద్వారా కూడా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు టి.వి.సూర్యప్రకాష్, టి.వనజ, ఎస్.హరిబాబు, సీజీఎం వి.విజయలలిత, జీఎం ఎం.ఝూన్సీ, తదితరులు పాల్గొన్నారు.**



## విపియస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభకు గుర్తింపు

**విజయవాడ, ఫిబ్రవరి 09**

మొఘల్ రాజపురం లోని వీరమాచనేని పద్దయ్య సిద్దార్థ పబ్లిక్ స్కూల్ (విపియస్) విద్యార్థులు నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ 2025--26లో విశేష ప్రతిభ కనబరిచి పాఠశాలకు కీర్తిని తెచ్చారని ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య తెలిపారు. ప్రైమరీ విభాగం నుంచి 11 మంది, సెకండరీ విభాగం నుంచి 14 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్ ఆఫ్ ఎక్సలెన్స్ సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ రోజ్‌మేరీ, హెడ్‌మిస్ట్రెస్ జయలక్ష్మి, కోఆర్డినేటర్ దీప విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందిస్తూ, తదుపరి దశల్లో మరింత ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## సమాచార శాఖలో ఉద్యోగాన్ని ఇష్టంగా చేసిన వ్యక్తి కె.వెంకటేశ్వరరావు

### ఏపీఎంపీఏ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్



**మచిలీపట్నం, ఫిబ్రవరి 09**

మచిలీపట్నం సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం లో డ్రైవర్ గా విధులు నిర్వర్తిస్తు ఇటీవల రిటైర్డ్ అయ్యిన వెంకటేశ్వర రావు ను ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ సోమవారం సమాచార శాఖ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ డ్రైవర్ గా విధులు నిర్వర్తిస్తున్న కొల్లూరు వెంకటేశ్వరరావు ఎంతో నిబద్ధత కలిగిన వ్యక్తి అన్నారు. ఆయనకు అప్పగించిన బాధ్యతలను పూర్తి విశ్వసనీయతతో, బాధ్యతాయుతంగా నిర్వహించారని, కష్ట సమయాల్లో కూడా ఉద్యోగ బాధ్యతలను ఇష్టపడి చేశారని ఆయన సేవలను కొనియాడారు. దాదాపు 31 ఏళ్ల పాటు అంకితభావంతో తన ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించటం గొప్ప విశేషమని, ఆయన నిబద్ధత, సేవా దృక్పథం ఇతరులకు స్ఫూర్తిదాయకం అన్నారు. వెంకటేశ్వరరావు శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని అభిలాషించారు. ఆయనతో ఉన్న స్నేహాన్ని గుర్తు చేసుకున్నారు.సీనియర్ జర్నలిస్టులు మరియు కృష్ణా జిల్లా మీడియా ఆక్రిడిషన్ కమిటీ సభ్యులు మన్నే సోమేశ్వరరావు,మత్తి శ్రీకాంత్, జి. శ్యామ్ బాబు, ఏపీఎంపీఏ నాయకులు రాజు , బత్తుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సజావుగా ఏపీపీఎస్సీ పరీక్షలు

- అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా సమగ్ర ఏర్పాట్లు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఫిబ్రవరి 09**

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ).. నాలుగు నోటిఫికేషన్లకు సంబంధించి నిర్వహిస్తున్న పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని, అభ్యర్థు లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ.. నగరంలోని సీవీఆర్ బాలికల నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేందుకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ అటవీ, ఎండోమెంట్ శాఖలకు సంబంధించి వివిధ ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తోందని, ఇవి ఈ నెల 13వ తేదీ వరకు జరుగుతాయన్నారు. విజయవాడ, పరిసర ప్రాంతాల్లోని 15 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయని.. సీటింగ్ అరేంజ్‌మెంట్, ఫర్నిచర్, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా ఇలా వివిధ అంశాల్లో ఎక్కడా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. లైజనింగ్, చీఫ్ సూపరింటెండెంట్లతో పాటు సమన్వయ శాఖల అధికారులు సమష్టి కృషితో పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు ఆదేశాలిచ్చామని, ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, పూర్తి భద్రత మధ్య పరీక్షలు రాసేలా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు.

## బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శిగా కానూరి శేషు మాధవి ఎంపిక

**గన్నవరం, ఫిబ్రవరి 09**



కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శిగా గన్నవరం ప్రాంతానికి చెందిన కానూరి శేషు మాధవి ని పార్టీ నియమించింది. పార్టీ పట్ల అంకిత భావం, క్రమశిక్షణతో సామాజిక సేవలు చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారంలో చురుకుగా పనిచేసిన ఆమెకు రాష్ట్ర పార్టీ నుంచి నియామక ఉత్తర్వులు అందాయి. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసిన శేషు మాధవి రాజకీయాలు, సామాజిక సేవల్లో నిత్యం ప్రజల్లోనే ఉండి సేవలందిస్తున్నారు. ఈ నియామకంపై పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కానూరి శేషు మాధవి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ , సంఘటన మంత్రి మధుకర్ , కిసాన్ మోర్చా అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి , మహిళా మోర్చా అధ్యక్షురాలు నిషిదా రాజ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, మహిళా సాధికారతే లక్ష్యంగా కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు.

# దశలవారీగా సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

- రాష్ట్ర కార్యవర్గంలో అన్ని జిల్లాలకు చోటు
- నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా
- వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన వేలాది మందికి ధన్యవాదాలు
- అపరిష్కృత సమస్యల అంశంలో వెనకడుగు వేయం
- ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర నూతన అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్

**విజయవాడ, ఫిబ్రవరి 09 (భ్రి)**



రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు చట్టపరంగా లభించాల్సిన హక్కులను దశల వారీగా, వేగవం తంగా పరిష్కరించుకునేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర నూతన అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి తరిలి వచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తునట్లు తెలిపారు.నూతన కార్యవర్గంలో రాష్ట్ర అధ్యక్షులుగా అలపర్తి విద్యాసాగర్ (ఎన్సిసి), ప్రధాన కార్యదర్శిగా డివి రమణ (వైద్య, ఆరోగ్యశాఖ) కార్యనిర్వాహక కార్యదర్శిగా కిలారు జగదీశ్వరరావు (నీటిపారుదల శాఖ), సహాధ్యక్షులుగా వి. దస్తగిరి రెడ్డి (వైద్య ఆరోగ్యశాఖ), ఉపాధ్యక్షులుగా ఎల్. బొంజయ్య (ఉద్యానవన శాఖ), ఆర్ఎస్. హరినాథ్ (పే అండ్ అకౌంట్స్ విభాగం), జానీ పాషా షేక్ ఎండి (వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శి), పి. కిరణ్ కుమార్ (సబ్ ట్రెజరీ విభాగం), ఎస్.కె. నాగూర్ షరీఫ్ (ప్రభుత్వ వైద్య కళాశాల, సూపరింటెండెంట్), వై ప్రసాద్, (వైద్య ఆరోగ్య శాఖ), ఎస్. రాజశేఖర్ (రెవిన్యూ శాఖ), ఆర్. రవిశంకర్ (వైద్య ఆరోగ్యశాఖ), ఎం. సత్యనారాయణ రాజు (రిజిస్ట్రేషన్ల శాఖ), బి. వెంకటేష్ బాబు (పన్నుల శాఖ), ఆర్. వేణుగోపాల్ (వాణిజ్య పన్నుల శాఖ), టి. ఏసుబాబు (పంచాయతీరాజ్ శాఖ), కార్యదర్శులుగా ఎల్. రజనీష్ బాబు (గణాంక శాఖ), ఎస్.బి.వి. రాంప్రసాద్ (వ్యవసాయ శాఖ), ఎ. రంజిత్ కుమార్ నాయుడు (ఇన్సూరెన్స్ శాఖ), పి. శివప్రసాద్ (పే అండ్ అకౌంట్స్ శాఖ), వి. సుబ్బారెడ్డి (ప్రజారోగ్యం మరియు (కుటుంబ సంక్షేమ శాఖ), కోశాధికారిగా ఎన్. భారతీ ప్రసాద్ (పే అండ్ అకౌంట్ శాఖ), మహిళా విభాగం కార్యదర్శిగా ఎం. సరస్వతి (చిన్న తరహా మరియు భారీ నీటిపారుదల శాఖ) ప్రచార కార్యదర్శిగా బి. జానకి ( ఆయుష్ విభాగం) లకు కార్యవర్గంలో చోటు లభించిందని నూతన కార్యవర్గం ఉద్యోగుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో నిబద్ధతతో ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని దిశా నిర్దేశం చేసుకుని ముందుకు వెళతామన్నారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు అయిన కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, సీపీఎస్ ఉద్యోగులకు న్యాయమైన పింఛను విధానం, హెల్త్ కార్డుల ద్వారా మెరుగైన వైద్య సేవలు, పీఆర్సీ నియామకం, ఐఆర్ మంజూరు వంటి వాటి పరిష్కారానికి అడుగులు ముందుకేస్తామని విద్యాసాగర్ తెలిపారు.

# కానూరులో ఐస్‌క్రీమ్ బ్రాండ్ డ్యూమాంట్ 50వ బ్రాంచ్ ప్రారంభం








**విజయవాడ, ఫిబ్రవరి 09** కానూరు సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీకి ఎదురుగాప్రముఖ ఐస్‌క్రీమ్ బ్రాండ్ డ్యూమాంట్ తమ 50వబ్రాంచ్ ను లాంఛనంగా ప్రారంభించారు. వై బి వెనిలాఅనే వినూత్న నినాదంతో మార్కెట్లో లభించే సాధారణఐస్‌క్రీమ్‌లకు భిన్నంగా రొటీన్ ఫ్లేవర్లను కాకుండాసరికొత్త కాంబినేషన్లను తాము పరిచయం చేస్తున్నామనినిర్వాహకులు వివరించారు. ఇందులో భాగంగాపైనాపిల్‌ను కారమెల్ సాస్‌లో సుమారు 24 గంటలపాటు నానబెట్టి తయారుచేసే ఐస్‌క్రీమ్ వంటి విభిన్నరుచులు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు.నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, కృత్రిమ ఎసెన్స్‌లకు దూరంగా ఉంటూ కేవలం అత్యంత నాణ్యమైన మరియు సహజసిద్ధమైన ఇంగ్రిడియం ట్స్‌తోనే ఐస్‌క్రీమ్‌లను తయారు చేయడం డ్యూమాంట్ ఐస్‌క్రీమ్స్ యొక్క ప్రధాన బలమని చెప్పారు. భారతదేశంలో సగటున ఒక వ్యక్తి 400 మి.లీ ఐస్‌క్రీమ్ మాత్రమే తింటుంటే, అమెరికా వంటి దేశాల్లో అది 20 లీటర్లుగా ఉందని, ఆ స్థాయి అంతర్జాతీయ ప్రమాణాల తో తాము పోటీ పడుతున్నామని వారు పేర్కొన్నారు. ఇప్పటికే అమెరికా లో 15 బ్రాంచ్ లు ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం తమసంస్థ విజయ డెయిరీ, జెప్టో, స్విగ్గీ వెన్యూ, మోడల్ డెయిరీ మరియు వశిష్ట శ్రీ లక్ష్మి వంటి ప్రముఖ సంస్థలతో భాగస్వామ్యం కలిగి ఉందని అన్నారు. అంతర్జాతీయంగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో కూడా మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తూ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదుగుతోందన్నారు. వ్యవస్థాపకులు, తమ తండ్రి నాగేశ్వరరావు మార్గదర్శకత్వంలో ప్రారంభమైన ఈ సంస్థను, అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. దక్షిణ భారతదేశం నుండి నేరుగా అమెరికా మార్కెట్‌లోకి ప్రవేశించాలనే భారీ లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేసి లక్ష్యాన్ని చేరుకున్నామని వివరించారు. కానూరు ప్రాంతంలోని ఐస్‌క్రీమ్ ప్రియులకు ఇప్పుడు ఈ అంతర్జాతీయ స్థాయి రుచులను స్థానికంగానే ఆస్వాదించే అవకాశం దొరికిందని తమ సంస్థను విజయవాడ ప్రజలు ఆదరించాలని కోరారు.

# రాజధాని పనులకు గ్రీన్ ఛానల్‌లో గ్రావెల్!

- సరఫరాకు ఎక్కడా అడ్డంకులు లేకుండా కృషి
- సింగిల్ విండో కింద ఎన్‌వోసీలు, లీజు దరఖాస్తుల పరిష్కారం
- సమస్యలు ఏవైనా ఉంటే తక్షణ పరిష్కారానికి కృషిచేస్తున్నాం
- ముఖ్యమంత్రి చంద్రబాబుకి వివరించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**విజయవాడ, ఫిబ్రవరి 09**

నవ్య రాజధాని అమరావతి పనులు శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో అత్యాధునిక, పర్యావరణహిత మౌలిక వసతుల పనులకు అవసరమైన గ్రావెల్‌ను గ్రీన్ ఛానల్ ద్వారా సరఫరాకు సమన్వయ శాఖల అధికారులతో కలిసి కృషిచేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి వివరించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల మూడో సదస్సు జరిగింది. ఈ సదస్సుకు కలెక్టర్ లక్ష్మీశ.. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబుతో కలిసి కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి వర్చువల్‌గా హాజరయ్యారు. సదస్సులో జరిగిన చర్చ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ ముఖ్యమంత్రికి గ్రావెల్, మెటీరియల్ సరఫరాకు ఎక్కడా ఎలాంటి అడ్డంకులు లేకుండా జిల్లాలో తీసుకుంటున్న చర్యలను వివరించారు. రహదారులు, ఇతర నిర్మాణ పనులకు అవసరమైన గ్రావెల్ వంటి వాటికి కొరత లేకుండా చూస్తున్నామని.. ఇటీవల జిల్లాస్థాయి ప్రత్యేక కమిటీ సమావేశం కూడా నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుత లీజులను సమీక్షించుకుంటూ కొత్తవాటి క్వారీ లీజుల దరఖాస్తులను వీలైనంత త్వరగా సింగిల్ విండో ద్వారా పరిష్కరించేందుకు చొరవ చూపుతున్నట్లు తెలిపారు. మైన్స్, అటవీ, పర్యావరణ శాఖ అధికారులతో కూడిన బృందాలు జాయింట్ ఇన్‌స్పెక్షన్ ప్రక్రియను చేపడుతున్నాయని వివరించారు. ప్రభుత్వ విధానాలు, చట్టాలు, పర్యావరణ నిబంధనలను పూర్తిగా పాటిస్తూ గ్రావెల్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూస్తామని, ఈ అంశాన్ని జిల్లా స్థాయిలో అత్యంత ముఖ్యమైన కార్యాచరణగా పరిగణించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.


# ఇండియన్ ఆయిల్, డచెస్ క్లబ్ ఫ్యామిలీ ఫన్ ర్యాలీ



**హైదరాబాద్, ఫిబ్రవరి 09** నగరంలోని సికింద్రాబాద్ క్లబ్‌లో 'ఇండియన్ ఆయిల్ – డచెస్ క్లబ్ ఫ్యామిలీ ఫన్ కార్ ర్యాలీ' అత్యంత ఉత్సాహభరితమైన వాతావరణంలో ప్రారంభమైంది. ఇండియన్ ఆయిల్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ హెడ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీయూష్ మిట్టల్ ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. సుమారు డెబ్బై కార్లతో ఉత్సాహంగా ఈ ర్యాలీ నగరం గుండా ప్రయాణిస్తూ అటు ఆహ్లాదాన్ని, ఇటు సాహసాన్ని మేళవించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, డచెస్ క్లబ్, సికింద్రాబాద్ క్లబ్ సంయుక్తంగా ఈ వేడుకను నిర్వహించాయి. ఈ ర్యాలీ సికింద్రాబాద్ క్లబ్‌లో ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని సెయిలింగ్ క్లబ్ వద్ద ముగిసింది. ఇది కేవలం వేగంతో సంబంధం ఉన్న రేసు మాత్రమే కాదు, ఒక మారథాన్ లాంటిది. నిర్ణీత వేగంతో ప్రయాణిస్తూ మధ్యలో ఉన్న పిట్-స్టాప్‌ల వద్ద మార్షల్స్ సూచనలను పాటించాల్సి ఉంటుంది. ఈ ర్యాలీలో భాగంగా 'ట్రెజర్ హంట్' (నిధి అన్వేషణ) కూడా నిర్వహించారు. పాయింట్ల ఆధారంగా విజేతలను నిర్ణయిస్తారు. ఈ కార్లు హైటెక్ సిటీ, ఐకియా, ఏఎస్సీఐ వద్ద ఉన్న ఇండియన్ ఆయిల్ కోకో (కంపెనీ ఓన్డ్ కంపెనీ ఆపరేటెడ్) అవుట్‌లెట్లను సందర్శించాయి. అక్కడ ట్రెజర్ హంట్‌కు సంబంధించిన క్లూలను సేకరించడంతో పాటు ప్రీమియం ఫ్యూయలింగ్ అనుభవాన్ని కూడా పొందారు. ఈ సందర్భంగా పీయూష్ మిట్టల్ మాట్లాడుతూ ఈ ఫ్యామిలీ ఫన్ కార్ ర్యాలీని నిర్వహించడంలో డచెస్ క్లబ్, సికింద్రాబాద్ క్లబ్‌తో ఇండియన్ ఆయిల్ కున్న భాగస్వామ్యాన్ని ఆయన అభినందించారు. కస్టమర్ల సంతృప్తిని దృష్టిలో ఉంచుకుని ఇండియన్ ఆయిల్ ప్రవేశపెట్టిన ఎక్సపీ95, ఎక్సపీ100, ఎక్స్‌ట్రాగ్రీన్ వంటి అత్యాధునిక ఇంధనాల గురించి వివరించారు. నగరంలో ఇలాంటి కార్ ర్యాలీలు చాలా తక్కువగా జరుగుతుంటాయన్నారు. ఈ పోటీలో గెలవాలంటే వేగం కంటే తెలివితేటలు ఎక్కువగా ఉపయోగించాలని తెలిపారు. ఇది టీమ్ వర్క్.. నగరాన్ని మరింత బాగా తెలుసుకోవడానికి ఒక గొప్ప అవకాశం అన్నారు. ఏఏ మోటా ర్‌స్పోర్ట్స్ సొల్యూషన్స్ బృందం దీనిని నిర్వహించింది. ఈ ర్యాలీ ఫార్మాట్‌కు ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్స్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది. సమయం, దూరం, వేగం పద్ధతిలో సాగింది. నగర వ్యాప్తంగా దాదాపు 50-60 కిలోమీటర్లు ప్రయా ణించాయి. అన్ని రకాల ఇంజన్ సామర్థ్యం ఉన్న కార్లు, డీజిల్ కార్లు, ఎస్యూవీలకు ఈ పోటీలో పాల్గొనే అవకా శం కల్పించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ కైలాస, సవేరా ఇండస్ట్రీస్ ఎండీ నీనా రెడ్డి, ఇండియన్ ఆయిల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఈబీ-5 వీసాపై 2026 కీలక సంవత్సరం

- వీసా బులెటిన్ పురోగతి, గ్రాండ్‌ఫాదరింగ్ గడువు నేపథ్యంలో భారతీయ పెట్టుబడిదారుల వేగవంతమైన నిర్ణయాలు




**విజయవాడ, ఫిబ్రవరి 09 (**

అమెరికా ఈబీ-5 ఇమ్మిగ్రెంట్ ఇన్వెస్టర్ ప్రోగ్రామ్‌పై పెరుగుతున్న ఆసక్తి నేపథ్యంలో, పెట్టుబడిదారులకు సమగ్ర అవగాహన కల్పించాలనే లక్ష్యంతో లా ఆఫీసెస్ ఆఫ్ నడదూర్ ఎస్. కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక సెమినార్‌ను ఫిబ్రవరి 13, 2026 (శుక్రవారం) విజయవాడలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రత్యక్ష సెమినార్‌లో ఈబీ-5 వీసా ప్రక్రియ, ప్రస్తుత నియంత్రణ వ్యవస్థ, అలాగే పెట్టుబడి ద్వారా అమెరికా శాశ్వత నివాసం (గ్రీన్ కార్డ్) పొందే వ్యూహాత్మక అవకాశాలపై స్పష్టమైన అవగాహన అందించనున్నారు. ఈ సెషన్‌ను 30 సంవత్సరాలకు పైగా అనుభవం కలిగిన అమెరికా ఇమ్మిగ్రేషన్ న్యాయవాది నడదూర్ ఎస్. కుమార్ నిర్వహిం చనున్నారు. ఈబీ-5 ప్రోగ్రామ్‌కు సంబంధించి ప్రస్తుత పెట్టుబడి పరిమితులు- లక్ష్య ఉపాధి ప్రాంతాలకు (టీఈఏ) 8 లక్షల డాలర్లు, సాధారణ ప్రాజెక్టులకు 10 లక్షల 50 వేల డాలర్లు, ఉద్యోగ సృష్టి నిబంధనలు, డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్లు మరియు రీజినల్ సెంటర్ ఇన్వెస్ట్‌మెంట్ల మధ్య తేడాలు, అలాగే భారతీయ అభ్యర్థులపై ప్రభావం చూపే తాజా నియంత్రణ మార్పులపై సెమినార్‌లో వివరించనున్నారు. అదనంగా, ప్రస్తుత వీసా బులెటిన్ పరిస్థితి, గ్రామీణ, అధిక నిరుద్యోగం మరియు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు సంబంధించిన సెట్-అసైడ్ కేటగిరీల ప్రయోజనాలు, అలాగే సెప్టెంబర్ 30, 2026లోపు దరఖాస్తు చేస్తే వర్తించే గ్రాండ్‌ఫాదరింగ్ గడువు ప్రాముఖ్యతపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. 2027 జనవరి నుంచి ద్రవ్యోల్బణ సవరణల కారణంగా పెట్టుబడి పరిమితులు పెరిగే అవకాశం ఉండటంతో, 2026ను అత్యంత కీలక సంవత్సరంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ సందర్భంగా నడదూర్ ఎస్. కుమార్ మాట్లాడుతూ, “ప్రస్తుత గ్లోబల్ పరిస్థితుల్లో కుటుంబాలు భద్రత, స్వేచ్ఛ, దీర్ఘకాల స్థిరత్వాన్ని కోరుకుంటున్నాయి. ఈబీ-5 వీసా పెట్టుబడిదారులతో పాటు వారి జీవిత భాగస్వాములు, పిల్లలకు కూడా అమెరికా శాశ్వత నివాసాన్ని అందించే విశ్వసనీయ మార్గం. వీసా బులెటిన్ పురోగతి, సెట్-అసైడ్ కేటగిరీలు, గ్రాండ్ ఫాదరింగ్ గడువు వంటి అంశాలు పెట్టుబడి దారులకు ప్రత్యేక ప్రయోజనాలు కల్పిస్తు న్నాయి. అందుకే 2026 అత్యంత కీలకం,” అని తెలిపారు. ఇటీవల స్టూడెంట్ వీసాల అనిశ్చితి, హెచ్-1బీ బ్యాక్లాగ్‌లు, సాధారణ ఉద్యోగ ఆధారిత గ్రీన్ కార్డ్ మార్గాల్లో అధిక ఆలస్యం, అలాగే కొత్తగా ప్రవేశపెట్టిన గోల్డ్ కార్డ్ ప్రోగ్రామ్ వంటి కారణాలతో భారతీయ పెట్టుబడిదారుల్లో ఈబీ-5 వీసాపై ఆసక్తి గణనీయంగా పెరిగిందని నిపుణులు పేర్కొన్నారు. అమెరికాలో శాశ్వత నివాస మార్గాలను అన్వేషిస్తున్న అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు, కుటుంబాలకు ఈ సెమినార్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఫైనాన్షియల్ అడ్వైజర్లు, వెల్త్ మేనేజర్లు, న్యాయ నిపుణులు కూడా హాజరుకావాలని సూచించారు. ఈ సెమినార్ ఫిబ్రవరి 13న సాయంత్రం 4.30 గంటలకు విజయవాడలోని వివాంతా హోటల్‌లో జరుగుతుంది. పాల్గొనడం ఉచితం అయినప్పటికీ, సీట్లు పరిమితంగా ఉండటంతో ముందస్తు నమోదు తప్పనిసరి. మరిన్ని వివరాలు, నమోదు కోసం www.nskumarlaw.com వెబ్‌సైట్‌ను సందర్శించాలని నిర్వాహకులు తెలిపారు.

# ఆర్థిక సూచికల్లో ప్రగతికి నిరంతర కృషి

- జీడీడీపీ, జీవీఏ, పీసీఐలో లక్ష్యాల సాధనకు అడుగులు
- 17 ప్రధాన రంగాల్లో అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- 555 కేపీఐల్లో జిల్లాను ముందంజలో నిలిపేందుకు ప్రణాళికలు
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఫిబ్రవరి 09**

జిల్లా స్థూల ఉత్పత్తి (జీడీడీపీ)తో పాటు స్థూల విలువ జోడింపు, తలసరి ఆదాయం వంటి ప్రధానమైన ఆర్థిక సూచికల్లో జిల్లాను ఎప్పుడూ ముందంజలో నిలిపేందుకు అధికార యంత్రాంగం కృషిచేస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

రాష్ట్ర సచివాలయంలో సోమవారం వ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల మూడో సదస్సు జరిగింది. ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ సమావేశంలో 2025-26 భారత ఆర్థిక సర్వేలోని ముఖ్యాంశాలతో పాటు రాష్ట్ర ఆర్థిక సూచికలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించడంతో పాటు జిల్లాల సూచికలనూ వివరించారు. జిల్లాలు తద్వారా రాష్ట్రం ప్రగతి పథంలో పయనించేందుకు క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై గౌరవ సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సుపరిపాలన.. మూడు అంశాల్లో పురోగతికి సూచనలు చేశారు. నైపుణ్యాభివృద్ధి, డేటా లేక్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఒక కుటుంబం- ఒక పారిశ్రామికవేత్త, శాంతిభద్రతలు తదితరాలపై సమావేశంలో చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ తొలి ముందస్తు అంచనాల ప్రకారం రూ. 1,05,173 కోట్ల జీడీడీపీతో ఎన్‌టీఆర్ జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందన్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తికి జిల్లా 5.97 శాతం వాటా అందిస్తోందని.. అదేవిధంగా రూ. 3,91,390 తలసరి ఆదాయంతో జిల్లా మూడో స్థానంలో ఉందన్నారు. ఇదే విధంగా వ్యవసాయ, అనుబంధ రంగాలతో పాటు పారిశ్రామిక, సేవారంగాల్లో అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

**555 కేపీఐలపై ప్రత్యేక దృష్టి..**

స్వర్ణాంధ్ర ఏ 2047లో భాగంగా జిల్లా, నియోజక వర్గానికి దార్శనిక ప్రణాళికలు ఉన్నాయని.. ఈ ప్రణాళికలను సమర్థవంతంగా అమలుచేస్తూ లక్ష్యాలను చేరుకునేందుకు అధికారులు కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఈ సందర్భంగా సూచించారు. అభివృద్ధికి మరింత అవకాశమున్న పశుసంవర్థక రంగం, తయారీ రంగం, ఫిషింగ్ అండ్ ఆక్వాకల్చర్, సర్వీసులు, ఉద్యాన తదితర 17 రంగాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని పేర్కొన్నారు. 555 కీలక ప్రగతి సూచికలు (కేపీఐ)పై నిరంతరం పర్యవేక్షించడం జరుగుతోందని, లక్ష్యాలకు అనుగుణంగా ఈ సూచికల్లో వృద్ధి నమోదుకు కృషిచేయాలని స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో జిల్లాను ముందంజలో నిలిపేందుకు రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా మంచి ఫలితాల సాధనలో కీలక భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విజయవాడ కూడా ఉన్నందున ఇక్కడ సర్వీస్ సెక్టార్ అభివృద్ధికి పుష్కల అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నామని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. డ్రగ్స్‌పై దండయాత్ర నినాదంతో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా నిరంతరం అప్రమత్తతతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో వినూత్నంగా తీసుకుంటున్న చర్యల వల్ల వివిధ రకాల నేరాలు గణనీయంగా తగ్గుముఖం పడుతున్నాయన్నారు. సమావేశంలో సీపీవో వై.శ్రీలత, పీజీఆర్ఎస్ సమన్వయ అధికారి జి.జ్యోతి, డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

# రైజ్‌తో గ్రామీణ మహిళలకు మార్గనిర్దేశం

- స్వయం ఉపాధికి స్పష్టమైన మార్గం చూపుతున్న రైజ్ కేంద్రం
- శిక్షణ నుంచి మార్కెటింగ్ వరకు సమగ్ర సహకారం
- సత్ఫలితాలిస్తున్న ఎన్టీఆర్ జిల్లాకలెక్టర్ డా. జి. లక్ష్మీశ నేతృత్వంలోనికార్యక్ర మాలు





**గుంటుపల్లి, ఫిబ్రవరి 09** ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లిలోని రూరల్ఇంక్యుబేషన్ స్కిల్లింగ్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ సెంటర్(రైజ్) గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకుమార్గదర్శిగా నిలుస్తోంది. స్వయం ఉపాధి దిశగాముందడుగు వేయాలనుకునే మహిళలకు సరైన మార్గనిర్దేశంతో పాటు శిక్షణ, మార్కెటింగ్ సహకారం అందిస్తూ వారి ఆలోచనలను విజయవంతమైన వ్యాపారాలుగా మార్చేందుకు రైజ్ కేంద్రం కీలక పాత్ర పోషిస్తోంది. పేపర్ క్రాఫ్ట్ విభాగంలో వినూత్న ఆలోచనలను అమలు చేస్తూ ఆర్థికంగా ఎదుగుతున్న ప్రాసాదంపాడు గ్రామానికి చెందిన ఎం.వరలక్ష్మి సోమవారం రైజ్ కేంద్రంలో 20 మంది ఔత్సాహిక స్వయం సహాయక సంఘ మహిళలకు శిక్షణ అందించారు. ఒకప్పుడు నెలకు రూ.5 వేల ఆదాయం మాత్రమే ఉండేదని, ప్రస్తుతం నెలకు సుమారు రూ.50 వేల టర్నోవర్ సాధిస్తున్నానని ఆమె వివరించారు. తాను స్వయం ఉపాధితో నిలదొక్కుకోవడమే కాకుండా మరో పది మందికి ఉపాధి కల్పించగల స్థాయికి ఎదిగానన్నారు. ఆసక్తి ఉన్న మహిళలకు శిక్షణ ఇచ్చి ఇంటి నుంచే ఉపాధి పొందే అవకాశాన్ని కల్పించడమే తన లక్ష్యమని వరలక్ష్మి పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అందిస్తున్న ప్రోత్సాహం, మార్గనిర్దేశం వల్లే తన వ్యాపారం విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. మహిళలు కష్టపడటంతో పాటు ఆసక్తి, నిబద్ధతతో ముందుకు వస్తే వ్యాపార రంగంలోనూ తప్పకుండా రాణించవచ్చని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏ.ఎన్.వి. నాంచారరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# నూగొండపల్లి గ్రామంలో “పల్లె నిద్ర” కార్యక్రమం

- ఎస్ఐ శుభ శేఖర్, పోలీసు సిబ్బంది ప్రజలతో మమేకం.. భద్రత పై అవగాహన




**ఆగిరిపల్లి, ఫిబ్రవరి 09 (**ఏలూరు జిల్లా ఆగిరిపలి మండలం నూగొండపల్లిగ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో “పల్లె నిద్ర”కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలోఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ మరియు స్థానిక పోలీస్‌సిబ్బంది గ్రామ ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై, భద్రతమరియు సామాజిక సమస్యలపై అవగాహనకల్పించారు. కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్, నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్ ఆదేశాల మేరకు, నూజివీడు రూరల్ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ మరియు స్థానిక పోలీస్ సిబ్బందిసంయుక్తంగా నిర్వహించారు. ఎస్ఐ శుభ శేఖర్ ముఖ్యంగా గంజాయి, మత్తు పదార్థాల వాడకం పై హెచ్చరికలు చేశారు. గంజాయి విక్రయించే వారిపై సమాచారం ఉంటే తక్షణమే పోలీసులకు లేదా డయల్ 112 ద్వారా తెలియజేయాలని సూచించారు. ఇంట్లో సీసీ కెమెరాలు అమర్చడం ద్వారా దొంగతనాలను అరికట్టడం, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 ద్వారా 10 నిమిషాల్లో పోలీసుల సహాయం అందించడం, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండటం, మరియు మత్తు పదార్థాల నివారణ కొరకు 1972 టోల్ ఫ్రీ నంబర్‌ను ఉపయోగించడం వంటి భద్రతా సూచనలు వివరించబడ్డాయి. ఈ సందర్భంగా ఎస్ఐ శుభ శేఖర్ మాట్లాడుతూ, పల్లె నిద్ర కార్యక్రమాల ద్వారా ప్రజలలో భద్రతపై విశ్వాసం పెంపొందించడం లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ఈ విధమైన కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. పెద్దలతోపాటు చిన్నారులు కూడా భద్రతా నియమాలు పాటించాలని, విహారయాత్రలు లేదా నది, చెరువు ప్రాంతాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజలకు విజ్ఞప్తి: అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినట్లయితే ఎస్ఐ శుభ శేఖర్ ఫోన్ నెంబర్ 9440796444 కు తెలియజేయండి. మీ వివరాలు గోప్యంగా ఉంచబడతాయి.



# సభాపర్వం నిరాశాజనకం

**‘మీ స్వరాన్ని పెంచకండి... చట్టసభల్లో మెరుగుపరుచుకోవాల్సింది మీ వాదనను మాత్రమే’ అన్నారు నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, దక్షిణాఫ్రికా హక్కుల యోధుడు డెస్మండ్ టుటు. దేశంలో చట్టసభల తీరుతెన్నులు చూస్తున్నవారికి ఎప్పుడూ ఖేదమే మిగులుతోంది. చట్టసభల పేరుచెబితే వాగ్యుద్ధాలూ, వాకౌట్లూ గుర్తుకొస్తున్నాయి. ఎప్పటిలాగే పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు కూడా ఆ ధోరణిలోనే సాగుతున్నాయి. ఈసారి పార్లమెంటు లోపలే కాదు, వెలుపల కూడా ఆధిక్యతా ప్రదర్శన కనబడుతోంది. కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు జరగబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కావొచ్చు, అధికార విపక్షాలు ప్రత్యర్థుల్లాకాక శత్రుపక్షాల్లా పోట్లాడుకుంటున్నాయి. చివరకు ఎక్కడివరకూ పోయిందంటే... కాంగ్రెస్ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీ పట్ల అవాంఛ నీయ చర్యకు పాల్పడే అవకాశం ఉందంటూ తనకు సమాచారం అందటంతో ఆయన్ను సభకు రావొద్దంటూ తానే సూచించానని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అదంతా అబద్ధమన్నది కాంగ్రెస్ వాదన. నిజానిజాల సంగతలా ఉంచి లోక్‌సభ స్పీకర్ ప్రధానిని సభకు రావద్దని సూచించటం ఊహాకందనిది. ఇలాంటి పరిణామాలు ప్రపంచం దృష్టిలో మన ప్రజాస్వామ్యాన్ని పలచబారుస్తాయి.**

కాంగ్రెస్ తీరుచూస్తే సభను సాగనివ్వకపోవటమే దాని ఏకైక వ్యూహంగా కనబడు తోంది. దీనిద్వారా ఆ పార్టీ ఎలాంటి సందేశం పంపదల్చుకున్నదోగానీ, కీలకమైన బిల్లులు ఎలాంటి చర్చా లేకుండా మూజువాణి ఓటుతో ఆమోదం పొందుతున్నాయి. పద్దులు గిలెటిన్ అవుతున్నాయి. పాలక పక్షం పని సులభమవుతోంది. సభలో మెజారిటీయే దేన్నయినా నిర్ణయిస్తుంది. విపక్షాలు దాన్ని అడ్డుకోలేవు. నీసం అర్థవంత మైన చర్చంటూ జరిగితే ఎలాంటి బిల్లులు వస్తున్నాయో, వాటి లోటుపాట్లేమిటో,అందువల్ల కలిగే పరిణామాలేమిటో సామాన్యులు అర్థం చేసుకునే వీలుంటుంది. తమ వ్యూహం సామాన్య పౌరులకు ఆ అవకాశాన్ని నిరాకరిస్తున్నదని కాంగ్రెస్ గ్రహించటం లేదు. యూపీఏ హయాంలో కూడా బీజేపీ ఇదే వ్యూహాన్ని అమలు చేసింది. దాన్నే తామూ ప్రయోగించి పైచేయి సాధించాలని చూడటం ద్వారా కాంగ్రెస్ ఆశిస్తున్న ప్రయోజనమేమిటో అర్థంకాదు. తోచింది చేసుకుంటూ పోవటం, జరిగే ఘటనలపై అప్పటికప్పుడు అనాలోచితంగా స్పందించటం తప్ప కాంగ్రెస్‌కు పకడ్బందీ వ్యూహం ఉన్నట్టు కనబడదు. బుధవారం పార్లమెంటు మకరద్వారం వద్ద జరిగిన ఘటనే ఇందుకు తార్కాణం. కేంద్ర మంత్రి రవనీత్‌సింగ్ బిట్టూతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జగడం నివారించదగింది. బిట్టూ అక్కడ ధర్నాకు కూర్చున్న కాంగ్రెస్ ఎంపీలనుద్దేశించి అవహేళనగా వ్యాఖ్యానించి ఉండొచ్చు. కానీ అవి యథాలాపంగా అన్న మాటలు కాదు. ఇరుపక్షాల మధ్యా యుద్ధం సాగుతున్న వేళ వ్యూహాత్మకంగా మాట్లాడినవి. రాహుల్ గాంధీ ఆయన్ను కాస్తా ద్రోహి అంటూ నిందించటం ద్వారా బీజేపీకి పదునైన ఆయుధం ఇచ్చారు. పార్టీ మారటం ద్రోహమైతే, అలాంటివారు కాంగ్రెస్‌లో లేరా? అసలు పార్టీని నమ్ముకుని ఉన్నవారి పట్ల అధినేతలుగా తాము చేసిన, చేస్తున్న ద్రోహం మాటేమిటి? అవసరార్థం పక్క పార్టీలతో కుమ్మక్కవుతూ మొత్తంగా పార్టీలో ఉన్నవారందరికీ చేస్తున్న ద్రోహమెంత? రాహుల్‌గాంధీ ఆలోచించారా? పరిస్థితులు మళ్లీ చక్కబడితే బిట్టూ లాంటివారు తిరిగి కాంగ్రెస్ లోకి రారనీ, రాహుల్ తీసుకోబోరనీ ఎవరైనా చెప్పగలరా? ఎందుకో ఈసారి పార్లమెంటులోనూ, వెలుపలా ‘పుస్తక ప్రదర్శన’ జరిగింది. చైనా నుంచి ముప్పు ముంచుకొస్తున్నవేళ బాధ్యతంతా రాజకీయ నాయకత్వం అప్పటి ఆర్మీ చీఫ్ జనరల్ నరవణేపై వదిలేసి, చేతులు దులుపుకొన్నదని రాహుల్ ఆరోపించారు. జనరల్ నరవణే పుస్తక సారాంశాన్ని సభలో చెబుతానన్న భయంతోనే తనను అడ్డుకున్నారని అన్నారు. దీనికి పోటీగా బీజేపీ సభ్యులు సభలో పుస్తకాలు ప్రదర్శించారు. ఈ దఫా పుస్తకాల ప్రస్తావన రావటం బాగున్నా, వాటిని ప్రదర్శించటంతో సరిపెట్టక ఇరుపక్షాలవారూ ఎవరికివారు చదువుకోవాలి. అప్పుడు మన చట్టసభల తీరు ఇంత అధ్వాన్నంగా అయితే ఉండదు. కనీసం సభల నిర్వహణకయ్యే వ్యయాన్నయినా దృష్టిలో ఉంచుకుని సమావేశాలను వృథా కానీయరాదని రెండు పక్షాలూ గ్రహించటం అవసరం. వాస్తవానికి సభల్లోనే కాదు, మొత్తంగా దేశ వ్యవహారాల నిర్వహణపైనే ఈ సందేహం చాలామందికి కలిగింది, నిరసనా వ్యక్తమైంది. ఇంకా చెప్పాలంటే దేశ వ్యవహారాలే గాక అంతర్జాతీయ సంబంధాల్లోనూ ఇష్టారాజ్యమైంది. హఠాత్తుగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత దేశంతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్.టి.ఎ) కుదిరిందని తన స్వంత వేదిక ‘ట్రూత్’ నుంచి ప్రకటించారు. వెంటనే ప్రధానమంత్రి 140 కోట్ల భారతీయుల తరపున తన ప్రియమైన గొప్ప స్నేహితుడు ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలిపి పరవశించిపోయారు. చర్చలు ఎక్కడ జరిగాయో, ఎవరు చేశారో, ట్రంప్‌కు ఇద్దరి తరపున ఏకపక్షంగా ప్రకటన చేసే అధికారం ఎవరిచ్చారో తెలియదు! ఈ చర్చల తర్వాత ఇండియా రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపేస్తుందని కూడా అమెరికా అధ్యక్షుడే ప్రకటిస్తారు. వెనిజులాలో తాము దుర్మార్గంగా చేజిక్కించుకున్న చమురునే ఇండియా తీసుకుంటుందని కూడా చెప్పేస్తారు. 2025 ఏప్రిల్ నుంచి ఇరు దేశాలు మాట్లాడుతున్నా కుదరని డీల్ ఇలా ఆఘమేఘాల మీద ఎలా కుదిరింది? మోడీ తనను సంతోషపెట్టడానికి చాలా చేశారు గానీ ఇంకా చేయాలని ట్రంప్ మాట్లాడ్డం, ఆయన తమ అధ్యక్షుడికి ఒక్క ఫోన్ చేస్తే అంతా అయిపోతుందని అమెరికా అధికారులు షరతు పెట్టడం భారతదేశ ఆత్మగౌరవానికే భంగకరంగా పరిణమించింది. ఇప్పుడేమో గేదెను చెరువులో పెట్టి బేరం చేసినట్టు ఏమీ బయటపెట్టకుండా ట్రంప్ ఒక పోస్టు పెట్టగానే మోడీ ధన్యోస్మి అనడం ఆ షరతుకు లోబడటమే కాదా? ఈ విధంగా లోబడిపోవడమే పెద్ద దౌత్యనీతిగా చిత్రిస్తూ మోడీ ట్రంప్‌ను దారికి తెచ్చేసినట్టు బడా మీడియా బాజా బజంత్రీలు అందుకోవడం మరీ వింత కదా? దేశ అత్యున్నత శాసన వ్యవస్థ పార్లమెంటు సమావేశాలు జరుగుతుండగా దానికి తెలియకుండా అమెరికా అధ్యక్షుడి ప్రకటన ద్వారా వాణిజ్య ఒప్పందం గురించి అదీ అసంపూర్ణంగా తెలుసుకోవడం కంటే దాన్ని కించపర్చడం ఏముంటుంది? ఆ తర్వాత కూడా మోడీ ముందు ఎన్‌డిఎ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మాట్లాడారు. సభలో వాణిజ్య శాఖామంత్రి పీయూష్ గోయల్ అరకొర ప్రకటన చేసి మమ అనిపించారు. బయిట మాత్రం ఆయనా రెచ్చిపోయి పొగిడేస్తున్నారు. దీనికన్నా ముందు ఇ.యు తో కుదర్చుకున్న ఒప్పందమే నష్టదాయకంగా వుంటే గొప్ప వరప్రసాదమన్నట్టు చిత్రించారు. అమెరికాతో ఒప్పందం సంగతి అంతకంటే ఘోరం. వ్యాపారస్తుడు ఏదైనా అమ్మాలనుకుంటే ముందు రేటు అమాంతం పెంచి తర్వాత పదో పరకో తగ్గించి పెద్ద రిబేట్ డిస్కౌంట్ ఆఫర్ అంటాడు.

## ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఇది తాగితే

# ఆ సమస్యలన్నీ మటాష్



రోజూ మన డైట్‌లో అల్లం భాగం చేసుకోవడం వల్ల ఎన్నో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అల్లం మీ టీతో పాటు ఆహారం రుచిని పెంచుతుంది. అయితే మీరు ఎప్పుడైనా అల్లం నీళ్లు తాగారా? ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఆరోగ్య ప్రయోజనాలను పొందడానికి అల్లం నీరు తాగడం సులభమైన మార్గం. ఆయుర్వేదంలో అల్లం ఔషధ గుణాలకు ప్రసిద్ధి. పురాతన వైద్యంలో అల్లం అనేక వ్యాధులను నయం చేయడానికి ఒక మూలికగా ఉపయోగించారన్న విషయం తెలిసిందే కదా..! అల్లంలో శరీరానికి అవసరమైన విటమిన్ సి, కాల్షియం, ఫాస్పరస్, ఐరన్, జింక్, కాపర్, మాంగనీస్, క్రోమియం వంటి పోషకాలు ఉన్నాయి. ముఖ్యంగా



ఉదయాన్నే ఖాళీ కడుపుతో అల్లం నీటిని తాగితే అల్లం వల్ల కలిగే ప్రయోజనాలన్నీ శరీరానికి అందుతాయి. అవెంటో ఇప్పుడు తెలసుకుందాం 1. బరువు తగ్గుతారు ఖాళీ కడుపుతో అల్లం నీటిని తాగడం వల్ల జీవక్రియ వేగవంతం అవుతుంది. ఇది కొవ్వును వేగంగా కరిగించడంలో సహాయపడుతుంది. మీ శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడానికి ఉపయోగపడుతుంది 2. షుగర్ బాధితులకు ప్రయోజనకరం: ఖాళీ కడుపుతో అల్లం నీరు తాగితే రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. అలాగే, రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా ఉంటుంది. ఇది మధుమేహం వల్ల వచ్చే సమస్యల నుండి బయటపడటానికి సహాయపడుతుంది. 3. చర్మానికి మేలు చేస్తుంది: అల్లం నీరు శరీరంలో పేరుకుపోయిన మురికి, టాక్సిన్స్ ను తొలగించడంలో సహాయపడుతుంది. అలాగే ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులకు కారణమయ్యే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. చర్మంపై దద్దుర్లు, మొటిమలు, ముడతలు వంటి వృద్ధాప్య సంకేతాలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది మీ రక్తాన్ని సహజంగా శుద్ధి చేయడంలో యూజ్ అవుతుంది 4. ఇన్ఫ్లమేటరీ సమస్యలు దూరం : అల్లం శరీరంలోని ఇన్ఫ్లమేటరీ సమస్యలను దూరం చేయడంలో సహాయపడుతుంది. అల్లం వాపును కలిగించే సూక్ష్మజీవులు, హానికరమైన బ్యాక్టీరియాతో పోరాడటానికి సహాయపడుతుంది. 5. పొట్టకు మేలు చేస్తుంది: ఖాళీ కడుపుతో అల్లం నీటిని తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. దీని కారణంగా, అజీర్ణం, మలబద్ధకం, ఉబ్బరం, వాంతులు, విరేచనాలు, వికారం వంటి సమస్యలను తొలగించడంలో ఇది చాలా ప్రభావవంతంగా ఉంటుంది. అదనంగా, అల్లం చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. దీని వల్ల గుండెపోటు, పక్షవాతం వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించి గుండె ఆరోగ్యంగా ఉంచుతుంది.

## ఇదేం చేస్తుందిలే అని చీప్‌గా చూడకండి..

### ఆ సమస్యలకు పవర్‌ఫుల్ వెపన్.. డైలీ జ్యూస్ తాగితే..



ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. అందుకే ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మంచి జీవనశైలిని అవలంభించాలని.. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అయితే.. ఆరోగ్యానికి మేలు చేసే దుంపల్లో బీట్‌రూట్ ఒకటి.. బీట్‌రూట్ తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. వాస్తవానికి బీట్ రూట్‌ను సలాడ్‌గా తీసుకుంటారు. కొందరు బీట్ రూట్ మామూలుగా తింటే.. మరికొందరు జ్యూస్ చేసుకుని తాగుతారు. బీట్‌రూట్‌లో ఐరన్, సోడియం, సెలీనియం, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరం అనేక వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుంది.. రోజూ బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల రక్తపోటు అదుపులో ఉండటమే కాకుండా కొవ్వు మొదలైన వాటిని తగ్గించడంలో సహాయపడుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అందుకే బీట్ రూట్ ను తప్పనిసరిగా తీసుకోవాలంటున్నారు. బీట్ రూట్ రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకోండి.. బ్లడ్ ప్రెజర్ కంట్రోల్: బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. ఇందులో నైట్రేట్ ఉండటం వల్ల శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తికి సహాయపడుతుంది. బరువు నియంత్రణ: బీట్‌రూట్ రసంలో కొవ్వు, కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది బరువు తగ్గడానికి సహాయ పడుతుంది. ఉదయాన్నే దీన్ని తాగడం వల్ల రోజంతా శరీరానికి శక్తి లభిస్తుంది. కాలేయానికి మేలు చేస్తుంది: బీట్‌రూట్‌లోని బీటైన్ అనే యాంటీ ఆక్సిడెంట్ కాలేయంలో కొవ్వు ఆమ్లాలు పేరుకుపోకుండా చేస్తుంది. ఇది కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది: బీట్‌రూట్‌లో పొటాషియం పుష్కలంగా లభిస్తుంది. ఇది శరీరంలోని కండరాలు, నాడీ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. గుండెకు మేలు చేస్తుంది: బీట్‌రూట్ రసం తాగడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. అలాగే శరీరంలో ప్లాస్మా నైట్రేట్ స్థాయిలను పెంచుతుంది. ఇది శరీరం స్టామినాను పెంచుతుంది. క్యాన్సర్ ప్రమాదం తగ్గుతుంది: బీట్‌రూట్ రసంలో యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇది క్యాన్సర్ ప్రమాదం నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడుతుంది.



## వామ్మో.. రక్తహీనతతో బాధపడుతున్నారా..? డేంజర్ జోన్ నుంచి బయటపడాలంటే ఇలా చేయండి



ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో అనారోగ్య సమస్యలను ఎదుర్కోవలసి వస్తోంది.. ముఖ్యంగా పేలవమైన జీవనశైలి, అనారోగ్యమైన ఆహారం.. పని ఒత్తిడి.. ఇవన్నీ రోగాల బారిన పడేలా చేస్తున్నాయి. శరీరానికి కావలసిన పోషకాలు, విటమిన్లు అందకపోతే.. ప్రమాదంలో పడినట్లే.. అందుకే.. తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలంటున్నారు వైద్య నిపుణులు.. అయితే, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి, మీ శరీరంలో తగినంత ఐరన్ ఉండటం చాలా ముఖ్యం. ఇనుము లోపం మీ ఆరోగ్యాన్ని తీవ్రంగా పాడు చేస్తుంది. శరీరంలో విటమిన్లు పుష్కలంగా ఉండటానికి కొన్ని ఆహారాలను తీసుకోవాలి.. ఐరన్ లోపాన్ని నివారించేందుకు ఎలాంటి ఆహారం తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకోండి.. ఐరన్ లోపాన్ని నివారించేందుకు ఇవి తినండి.. దానిమ్మ: శరీరంలో విటమిన్లు, ఖనిజాలు ఉండటం చాలా ముఖ్యం. వీటి లోపం వల్ల అనేక వ్యాధులను ఎదుర్కోవాల్సి వస్తుంది. శరీరంలో ఐరన్ లోపం వల్ల అనేక రకాల సమస్యలు వస్తాయి. శరీరంలో ఐరన్ తక్కువగా ఉన్నప్పుడు, చాలా బలహీనత ఉంటుంది. ఐరన్ లోపం ఉన్నవారు ఆహారంలో దానిమ్మను చేర్చుకుంటే చాలా మంచిది.. దీనివల్ల రక్తహీనత సమస్య నుంచి బయటపడొచ్చు.. గుడ్డు: ఐరన్ లోపం ఉన్నవారు ఉదయం అల్పాహారంగా కూడా గుడ్లు తీసుకోవాలి. గుడ్లలో మంచి మొత్తంలో ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్, ఐరన్ ఉంటాయి. దీని వల్ల శరీరంలో ఐరన్ లోపం ఏర్పడదు.. గుడ్లలో విటమిన్ డి కూడా లభిస్తుంది. ఐరన్ లోపం ఉన్నవారు తప్పనిసరిగా గుడ్లు తినాలి. రెగ్యులర్ గా మీ ఆహారంలో ఒక గుడ్డును చేర్చుకోండి.. బీట్‌రూట్: రోజూ బీట్‌రూట్ తీసుకోవడం వల్ల మీ శరీరంలోని రక్తహీనత తొలగిపోతుంది. ఇనుము లోపం నయమైతే, అనేక వ్యాధులు కూడా నయమవుతాయి. రోజూ బీట్‌రూట్ జ్యూస్ తాగితే శరీరంలో ఐరన్ లోపాన్ని నివారించవచ్చు.. బీట్‌రూట్ తినడం వల్ల హిమోగ్లోబిన్ పెరుగుతుంది. ఇది మీ కడుపులో మంచి బ్యాక్టీరియాను పెంచడంలో కూడా చాలా సహాయపడుతుంది. పాలకూర: పాలకూరలో కూడా ఐరన్ పుష్కలంగా ఉంటుంది. దీన్ని ప్రతిరోజూ మీ ఆహారంలో చేర్చుకోవడం చాలా మంచిది. పాలకూరలో కాల్షియం, సోడియం, ఖనిజ లవణాలు, క్లోరిన్, ఫాస్పరస్, అనేక ఇతర ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. ఇవి మీ శరీరాన్ని ఇనుము లోపం నుంచి దూరంగా ఉంచుతాయి. ఇంకా ఒత్తిడిని తగ్గించడం ద్వారా మీ శరీరాన్ని రిలాక్స్ చేయడంలో కూడా ఇవి సహాయపడతాయి. పండ్లు కూరగాయలు: తాజా పండ్లు, కూరగాయలు మీ శరీరానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. అనేక వ్యాధుల నుండి మిమ్మల్ని దూరంగా ఉంచడంలో సహాయపడతాయి. తాజా, పండ్లు కూరగాయల్లో ఐరన్ ఎక్కువ పరిమాణంలో ఉంటుంది. కావున వీటిని ప్రతిరోజూ తింటే ఈ సమస్య నుంచి బయటపడొచ్చు..

## గుడ్లలో కంటే ఎక్కువ ప్రోటీన్ కావాలా..? అయితే ఈ పప్పులను తినండి.. ఇక నో టెన్షన్..



శరీరాన్ని ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంచుకోవడానికి విటమిన్లు, మినరల్స్‌తో పాటు ప్రొటీన్లు కూడా చాలా అవసరం. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి ప్రోటీన్ సహాయపడుతుంది. అయితే, శరీర అభివృద్ధి నుంచి రోగనిరోధక శక్తిని పెంచడానికి ప్రోటీన్ తోపాటు విటమిన్లు చాలా సహాయపడతాయి. ప్రోటీన్ మూలాలలో ఒకటి గుడ్లు.. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ రోజుకు కనీసం 1 గుడ్డు తినాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే, తృణధాన్యాల్లో (పప్పులు) గుడ్ల కంటే ఎక్కువ ప్రొటీన్లు ఉంటాయి. అయితే, చాలామంది గుడ్లు తినరు లేదా మాంసాహారం తీసుకోరు.. అలాంటి వారికి ప్రొటిన్ లోపం ఉంటుంది.. అలాంటి వారు శరీరంలో ప్రోటీన్ స్థాయిలను నిర్వహించడానికి వారు పప్పులను తినవచ్చు. కొన్ని పప్పుల్లో గుడ్లు కంటే ఎక్కువ ప్రొటీన్లు ఉంటాయని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. పప్పులలో ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. దీనిని అన్నం లేదా రొట్టెలతో తినవచ్చు. పప్పు చాలా మందికి సులభంగా జీర్ణం కాదు. అలాంటప్పుడు పప్పు చారు తినడం వల్ల శరీరానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. పప్పు ఆరోగ్యానికి చాలా మంచిది. కందిపప్పు, మసూర్ పప్పు, పెసర పప్పులో గుడ్ల కంటే ఎక్కువ ప్రొటీన్లు ఉంటాయని చెబుతున్నారు. కాబట్టి తల్లులు, అమ్మమ్మలు ఉపవాసం ఉన్నప్పుడు, శనగపప్పు ఉడకబెట్టి తింటారు. తద్వారా శరీరంలో ప్రోటీన్ లోపం ఉండదు. ముఖ్యంగా పెసర పప్పు కూడా బరువు తగ్గడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా గుండె ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. కాబట్టి డైట్‌లో ఉన్నవారు కూడా పెసరపప్పు తింటే ప్రొటీన్ లెవెల్స్ అదుపులో ఉంటాయి జిమ్, యోగా లేదా ఇతర శారీరక శ్రమలలో పాల్గొనే వారికి పెసరపప్పు, కందిపప్పు, శనగల మొలకలు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. ఎందుకంటే ఇందులో అధిక ప్రొటీన్‌తో పాటు క్యాల్షియం, ఐరన్ తగినంత మొత్తంలో ఉంటాయి. ఇంకా వీటిని కూరగా లేదా.. ఉడకబెట్టుకుని కూడా తినవచ్చు.. అందుకే డైలీ ఒక కప్పు పప్పును తింటే శరీరానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

## రొమాన్స్ పండు.. ఉదయాన్నే పరగడుపున తింటే ఆ సమస్యలకు చెక్ పెట్టినట్లే.. ట్రై చేయండి..



ప్రస్తుత కాలంలో ఎన్నో సమస్యలు వెంటాడుతున్నాయి. కావున ఆరోగ్యంపై దృష్టిసారించడం మంచిది.. అందుకే ఆరోగ్యానికి మేలు చేసే పండ్లను తినాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అలాంటి పండ్లలో కర్బూజ ఒకటి.. దీనిలోని పోషకాలు శరీరాన్ని ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. కర్బూజ పండులో నీటిశాతం ఎక్కువ.. కావున దీన్ని తినడం ద్వారా హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. అయితే, ప్రతి రోజూ ఉదయాన్నే కర్బూజ తినడం వల్ల చాలా వ్యాధులకు చెక్ పెట్టవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.. ముఖ్యంగా వేసవి కాలంలో కర్బూజను తినడం వల్ల అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది. శరీరంలో నీటి కొరతను, పోషకాల కొరతను నివారించాలంటే దీనిని తప్పనిసరిగా తినాలి.. ముఖ్యంగా పరగడుపున (ఖాళీ కడుపుతో) తింటే చాలా మేలు జరుగుతుంది. కర్బూజ ప్రయోజనాలేంటో తెలుసుకోండి.. కర్బూజను తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకోండి.. గుండె సంబంధిత వ్యాధుల నుంచి ఉపశమనం: కర్బూజను రోజూ తీసుకుంటే గుండె సంబంధిత వ్యాధుల నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు. దీనిలో ఫోలిక్ యాసిడ్ ఉంటుంద. ఇది మీ రక్తాన్ని శుద్ధి చేయడంలో కూడా సహాయపడుతుంది. రక్త నాళాలలో రక్తం గడ్డకట్టడాన్ని నివారించడంలో ఇది మీకు చాలా సహాయపడుతుంది. దీన్ని ఉదయం ఖాళీ కడుపుతో తీసుకుంటే చాలా ప్రయోజనాలను పొందవచ్చు. కడుపు సమస్యలు దూరం: వేసవి కాలంలో ప్రజలకు కడుపు సంబంధిత సమస్యలు మొదలవుతాయి. అజీర్తి, మలబద్దకం, కడుపులో నొప్పి, జీర్ణ సమస్యలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతుంటారు. అయితే, ఈ సీజన్‌లో ఎక్కువ నూనె, మసాలాలు తీసుకోవడం చాలా ప్రమాదకరం. కావున, అలాంటివి తగ్గించి.. తేలికపాటి వస్తువులను అంటే సులభంగా జీర్ణమయ్యే వాటిని తీసుకోవడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కావున కర్బూజను తినడం చాలా మంచిది. కంటి సంబంధిత సమస్యలు: కర్బూజ తినడం వల్ల కంటి సంబంధిత సమస్యలు కూడా నయమవుతాయి. విటమిన్ ఎ బీటా కెరోటిన్ కర్బూజలో లభిస్తుంది. ఇది మీ కంటి చూపును మెరుగుపర్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇంకా కంటిశుక్లం ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా మీకు చాలా సహాయపడుతుంది. లైంగిక సమస్యల నుంచి ఉపశమనం: కర్బూజలోని విటమిన్ కె, ఇ కూడా పుష్కలంగా ఉంటాయి. దీని వలన ప్రత్యుత్పత్తి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. దీనిని తినడం వల్ల లైంగిక సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు: కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.. వాటి నుంచి బయటపడేందుకు నిత్యం పలు రకాల మందులు వాడుతుంటారు. అలాంటి వారు రోజూ పుచ్చకాయను తీసుకుంటే.. కిడ్నీల్లో రాళ్ల సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు..

## ఒక్కటి.. ఒకే ఒక్కటి.. పడుకునే ముందు అరటిపండు తింటే ఏమవుతుందో తెలుసా..? అమేజింగ్ అంతే..

అరటిపండులో ఎన్నో పోషకాలు దాగున్నాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే.. ఎప్పటికీ అందుబాటులో ఉండే అరటిపండును తినాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అరటిపండులో పొటాషియం, విటమిన్ సి, విటమిన్ బి6, ఫైబర్, మాంగనీస్ వంటి అనేక ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వాటిలో కేలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. అందుకే.. ఆరోగ్యానికి మేలు చేసే అరటిపండును తింటే.. శరీరానికి అనేక ప్రయోజనాలను కలుగుతాయని పేర్కొంటున్నారు.. అయితే, పడుకునే ముందు అరటిపండు తినడం వల్ల నిద్ర, జీర్ణక్రియతోపాటు మొత్తం ఆరోగ్యంపై మంచి ప్రభావం చూపుతుంది. నిద్రపోయే ముందు అరటిపండును తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకోండి.. మంచి నిద్రను ప్రోత్సహిస్తుంది: అరటిపండ్లలో ట్రిప్టోఫాన్ అనే అమినో యాసిడ్ ఉంటుంది. ఇది సెరోటోనిన్‌గా.. మెలటోనిన్‌గా మారుతుంది. ఇవి నిద్రను నియంత్రించడంలో సహాయపడే న్యూరోట్రాన్స్‌మిటర్‌లు. కండరాల సడలింపు: అరటిపండ్లలో మెగ్నీషియం, పొటాషియం కూడా ఉన్నాయి. ఇవి కండరాలను సడలించే లక్షణాలకు ప్రసిద్ధి చెందిన ఖనిజాలను కలిగి ఉంటాయి. పడుకునే ముందు వాటిని తీసుకోవడం వల్ల మీ కండరాలు విశ్రాంతి తీసుకోవడానికి, మరింత ప్రశాంతమైన నిద్రను ప్రోత్సహిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది: అరటిపండ్లు మితమైన గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటాయి. అంటే అవి నెమ్మదిగా శక్తిని విడుదల చేస్తాయి. పడుకునే ముందు ఒకటి తినడం వల్ల రాత్రంతా రక్తంలో చక్కెర స్థాయిలలో వచ్చే అవాంతరాలను నివారించవచ్చు. ఆకలి బాధను నివారిస్తుంది:అరటిపండ్లు ఫైబర్ కు మంచి మూలం.పడుకునే ముందు అరటిపండు తినడం వల్ల రాత్రి సమయంలో ఆకలి బాధలను నివారిస్తుంది. నిరంతరాయంగా నిద్రపోయేలా చేస్తుంది. పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.. అరటిపండ్లు విటమిన్లు సి, బి6, పొటాషియం, మాంగనీస్ వంటి అవసరమైన పోషకాలతో నిండి ఉన్నాయి.పడుకునే ముందు వాటిని తీసుకోవడం వల్ల మీ శరీరానికి ఈ పోషకాలు అందుతాయి. ఇది మొత్తం ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది.

నినాదం
నిఖార్సైన జర్నలిజం

# మూడోసారి ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తమరాన

ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా తమరాన త్రినాద్ 3వసారి ఎన్నికయ్యారు.ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో సభ్యులు త్రినాద్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.త్రినాద్ ప్రస్తుతం బుచ్చయ్య పేట మండలం పి.కందిపూడి యూపీ స్కూల్లో పని చేస్తున్నారు.ఇతను గతంలో బుచ్చయ్యపేట మండలశాఖ అధ్యక్షునిగా, జిల్లా సబ్ కమిటీ సభ్యునిగా నాలుగు పర్యాయాలు చొప్పున, ఒకసారి ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షునిగా పనిచేశారు. 2022,2024లలో రెండు పర్యాయాలు రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పనిచేశారు.ఈ సందర్భంగా సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎంతో నమ్మకంతో తనకు అప్పగించిన ఈ బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తామన్నారు.భవిష్యత్తులో ఉపాధ్యాయ సమస్యలపై పోరాడి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నాపై నమ్మకం ఉంచి నాకు ఈ బాధ్యతలు



అప్పజెప్పిన రాష్ట్ర నాయకులు పాండురంగ వరప్రసాద్ కి,రాష్ట్ర అధ్యక్షులు మంజులకి, ప్రధాన కార్యదర్శి కె.బసవ లింగారావుకి కృతజ్ఞతలు తెలియజేశారు.

# చెట్టుపల్లిలో వైభవంగా గౌరీ పరమేశ్వర నిమజ్జనోత్సవం



నర్సీపట్నం, :

నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామంలో అత్యంత వైభవంగా మూడు రోజులపాటు జరిగిన ఉత్సవాలలో చివరి రోజు సోమవారం గౌరీ పరమేశ్వరుల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. పసుపు కుంకుమలతో మేళ తాళాలతో గ్రామంలో ఉన్న మహిళలందరూ ప్రతి ఇంటి నుండి పిండి వంటలు తయారు చేసుకుని వచ్చి సారే సమర్పించారు. గ్రామంలో ఉన్న యువత ఆనందోత్సవాలతో నృత్యాలు చేస్తూ గౌరీ పరమేశ్వరులను పురవీధులలో గ్రామ పెద్దలు, కూటమి నాయకుల సమక్షంలో నర్సీపట్నం గ్రామీణ ఎస్సై రాజారావు పర్యవేక్షణలో భారీ బందోబస్తు నడుమ ఊరేగింపు జరిగింది. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హాల్ వద్ద భరతనాట్య కార్యక్రమం విశాఖపట్నం కళాకారుల ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసిన డీఎస్పీ పీ.శ్రీనివాసరావుకి, సిఐ రేవతమ్మలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ గౌరీ పరమేశ్వర ఉత్సవ కమిటీ తరపున కమ్యూనిటీ హాలు వద్ద ఏర్పాటు చేసినటువంటి కార్యక్రమంలో రూరల్ ఎస్సై రాజారావు దంపతులకు సన్మానం చేయడం జరిగిందని ఉత్సవాలకు సహకరించిన శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడుకి గ్రామంలో పనిచేస్తున్నటువంటి అన్ని శాఖల ఉద్యోగస్తులకు మహిళా సంఘాల వారికి, భవన నిర్మాణ సంఘం వారికి, ఆటో ట్రాక్టర్స్ యూనియన్ వ్యాపారస్తులకు దేశ విదేశాలలో వేరే రాష్ట్రాలలో పని చేస్తున్నటువంటి ఉద్యోగస్తులు అందరికీ గౌరీ పరమేశ్వర ఉత్సవ కమిటీ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన ఉపాధ్యక్షులు ఊడి చక్రవర్తి, గ్రామ సర్పంచ్ గజాల నాగరత్నం సూరిబాబు, వైస్ ఎంపీపీ రత్నం రమణ, మోపాడ సత్య ప్రసాద్, భవన నిర్మాణ కార్మిక సంఘ అధ్యక్షుడు పసుపులేటి అప్పలనాయుడు, కాకినాడ జనసేన నాయకులు అప్పికొండ గోవింద్, మోపాడ రాజేష్, మోపాడ సోమేష్, కలిమి సత్తిబాబు, ఎర్ర ఈశ్వరరావు, ఉగ్గిన రమణ, గజాల నానాజీ, వడ్డీ శ్రీను, కలిమి శ్రీను, వల్లూరి నాగేశ్వరరావు, కరణం రాంబాబు, మోపాడ శ్రీను, అప్పికొండ రాజు, మట్ట సతీష్, పచ్చికారి ఈశ్వరరావు, వసంత నాగేశ్వరరావు, నాగులపల్లి గోవింద్, ఊడి వెంకట గణేష్, ఎన్నం రామచంద్ర, మోపాడు చిరంజీవి, షేక్ జిలాని , రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎర్రంశెట్టి పాపారావు, ఎమ్మార్పీఎస్ నాయకులు, సిఐటియు నాయకులు, గ్రామ అభివృద్ధి కమిటీ నాయకులు, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ రథం ప్రారంభించిన అసెంబ్లీ స్పీకర్

ఇళ్లలో పోగైన చెత్తను కాల్వల్లో పారేయకుండా, తిరిగి అధికారులకు అప్పగిస్తే నిత్యావసర సరుకులు అందజేసే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నర్సీపట్నం రూరల్ మండలానికి కేటాయించిన స్వచ్ఛ రథాన్ని సోమవారం అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ప్లాస్టిక్, ఇనుము, ఇతర వ్యర్థాలను ప్రజలు ఇష్టారాజ్యంగా ఇంటి ముందున్న కాలువల్లో పారేయడం వల్ల అవి పూడుకుపోయి మురుగు నీరు రోడ్లపైకి వస్తోందన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగానే స్వచ్ఛ రథాలను ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రజలు తమ ఇళ్లలో సేకరించిన ప్లాస్టిక్, పేపర్లు, ఇనుము వంటి పొడి చెత్తను గోనె సంచుల్లో వేసి ఉంచాలని స్పీకర్ సూచించారు. స్వచ్ఛ రథం ఊర్లోకి వచ్చినప్పుడు, ఆ చెత్తను వ్యాన్‌లో ఉన్న కాటాలో తూకం వేస్తారని తెలిపారు. పేపర్, ఇనుము, ప్లాస్టిక్‌కు నిర్ణయించిన రేట్ల ప్రకారం లెక్కకట్టి, ఆ మొత్తానికి సరిపడా నిత్యావసర వస్తువులను అక్కడికక్కడే తీసుకోవచ్చని వివరించారు. ఈ వ్యాన్‌లో గోధుమ పిండి, కందిపప్పు, మినపప్పు, నూనె, షాంపూలు, సబ్బులు వంటి వస్తువులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలకు ఈ విధానం అలవాటు పడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఒకటి రెండు నెలల పాటు అవగాహన కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గ్రామాలకు స్వచ్ఛ రథం వచ్చే తేదీలను ముందుగానే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.




# వరికి జాష్ వ్యర్థ జలాలు..

నక్కపల్లి, విలేకరి:

నక్కపల్లి మండలం, వేంపాడు టోల్‌ప్లాజా సమీపంలో జాతీయరహదారిని ఆనుకుని ఉన్న జాష్ హొటల్‌నుంచి వ్యర్థ జలాలను కాలువలోకి విడిచిపెడుతున్నారు. జాతీయరహదారి పక్కన ఉన్న ఈ కాలువద్వారా చెరువునుంచి పంటపొలాలకు వెళ్లే మదుముకు ఈ వ్యర్థ జలాలు చేరుతున్నాయి.. అక్కడ నుంచి పెద్దచెరువు ఆయకట్టు భూములకు వెళుతుండడంతో వరిపంటలకు తీవ్ర నష్టం జరుగుతోందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. జాష్ హొటల్‌లో పెద్దయెత్తున శాఖాహార, మాంసాహార వంటలను చేస్తుంటారు. ఆహారం తయారీలో మిగులు వ్యర్థలతోపాటు వ్యర్థ జలాలను జాతీయరహదారిపక్కనే కాలువలోకి విడిచిపెడుతున్నారు. మదుమువద్ద ఉన్న వ్యర్థ జలాలు చెరువు నీటిలో కలిసి



పంట పొలాలకు చేరుతోంది.

సాగునీరులో వ్యర్థ జలాలు కలవడం వల్ల పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపిస్తోందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రతీ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వ్యర్థజలాలు రాకుండా కాలువకు అడ్డంగా గట్టు వేసుకుని వరిని కొంతవరకు వ్యర్థ జలాలనుంచి కాపాడుకుంటున్నామని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సక్రమంగా లేకపోవడంవల్ల దిగుబడి గణనీయంగా తగ్గిందన్నారు. వ్యర్థజలాల వల్ల పంట దిగుబడిపై పెనుప్రభావం చూపిస్తోందన్నారు. ఈవిషయమై అధికారులకు గత కొన్నేళ్లుగా ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ పట్టించుకోవడంలేదని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. జాతీయరహదారి పక్కనే కాలువలోకి వ్యర్థ జలాలను విడిచిపెట్టడంవల్ల జాతీయరహదారివెంబడి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది.

హొటల్‌లో వ్యర్థజలాలను ప్రాసెస్ చేసుకోవడానికి యాజమాన్యం ఏర్పాట్లు చేసుకోవలసిఉండగా పంటపొలాలకు విడిచిపెట్టడమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేస్తామని రైతులు వెల్లడించారు.

# చిత్ర లేఖన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



అనకాపల్లి జిల్లా చోడవరం చోడవరం చిత్ర కళా నిలయం ఆధ్వర్యం లో వ్యవస్థాపకులు బి సూర్యనారాయణ నేతృత్వం లో రిజిస్ట్రార్ గీతా మాధురి ముఖ్య అతిథిగా ఆర్కె ప్రసాద్ సమన్వయంతో అంబేద్కర్ భవన్ చైర్మన్ దేముడు మాస్టారు అధ్యక్షతన చోడవరం ప్రేమ సమాజం లో జాతీయ చిత్ర లేఖనపోటీల్లో బహుమతి ప్రధాన కార్యక్రమం..విశిష్ట అతిథులు సీనియర్ జర్నలిస్ట్ కోటేశ్వర రావు, రిటర్డ్‌ఆర్జెడి తిరుపతి రావు,ప్రేమ సమాజం రాజు, ఆర్ టి సి రాజ్ మోహన్..అతిథులుగా తెలుగు పండితులు కొండల రావు,సాకేత్ ఫౌండేషన్ ప్రకాష్, డిఫెన్స్ అకాడమీ గణేష్,గాయకులు విశ్వనాథ్,తల్లి తండ్రులు, చిత్ర లేఖన పోటీల్లో విజేతలైన విద్యార్థులు..పాల్గొన్నారు.. ముఖ్య అతిథి గీతా మాధురి ప్రసంగం ఆద్యంతం ఎంతో స్ఫూర్తి గా చైతన్యం కలిగించినది.వక్తల ప్రసంగం విద్యార్థుల్లో ఆసక్తినీ పెంపొందించింది..ఆర్టిస్ట్ సూర్య నారాయణ గారు జాతీయ స్థాయిలో గుర్తింపు గౌరవం పొందడం..వందలాది మంది యువ చిత్ర లేఖలుగా శిక్షణ ఇస్తూ నేటి తరానికి సమాజానికి మంచి కళను బ్రతికిస్తూ అందిస్తూ చేస్తున్న ప్రయత్నానికి అందరూ ప్రశంసించారు..సమావేశం సీనియర్ మరియు ప్రముఖ జర్నలిస్ట్ కోటేశ్వర రావు ద్వారా వెలువడిన గ్రేట్ వర్డ్స్ ఆఫ్ రినోనెడ్ ఇంటెలెక్చుల్స్ పుస్తక ఆవిష్కరణ ముఖ్య అతిథి గా గీతా మాధురి వారి చేతుల మీదుగా నిర్వహించడం జరిగింది.

# 10న చినప్పన్నపాలెంలో పైడిమాంబ పండుగ

బుచ్చయ్యపేట, :

మండలంలోని చిన అప్పన్నపాలెంలో గ్రామదేవత పైడిమాంబ అమ్మవారి పండుగను ఈనెల 10వ తేదీ మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ కోవెల నాగమణి తెలిపారు.పండుగ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.గ్రామం అంతా విద్యుత్ దీపాలంకరణ చేశామని, పండుగ రోజున నేలవేషములు, కోలాటాలు,శక్తి పీఠాల ప్రదర్శనలు, బాణాసంచా కాల్పులతో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.భక్తులకు ప్రసాద వితరణ, మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని సర్పంచ్ కోరారు.



నినాదం
నిఖార్సైన జర్నలిజం

# లోక్‌సభ స్పీకర్‌తో రాహుల్‌గాంధీ భేటీ

## 8మంది ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్



**ఢిల్లీ, ౯ (ప్రతినిధి) :**
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పలువురు విపక్ష నేతలతో కలిసి సోమవారం లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాతో సమావేశమయ్యారు. సభలో తాను లేవనెత్త దల్చిన అంశాల గురించి స్పీకర్‌కు రాహుల్ వివరించారు. 8 మంది ఎంపీల సస్పెన్షన్, విపక్ష మహిళా ఎంపీలపై చేసిన ఆరోపణలు, పార్లమెంటుతో ముడిపడిన పలు అంశాల గురించి మాట్లాడాలని తాను భావించానని రాహుల్ చెప్పినట్లు తెలిసింది.

రాహుల్ గాంధీ వెంట స్పీకర్ వద్దకు వెళ్లిన విపక్ష నేతల్లో టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ, డీఎంకే నేత టీఆర్ బాలు, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఉన్నారు. లోక్‌సభ సజావుగా సాగాలంటే 8 మంది ఎంపీలపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని స్పీకర్‌ను విపక్ష ఎంపీలు కోరినట్లు సమాచారం. అయితే కొన్ని నిమిషాల్లోనే ఈ సమావేశం ముగిసింది.

# ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్ పవార్‌కు అస్వస్థత

## పుణేలోని రూబీ ఆస్పత్రిలో చేరిన శరద్ పవార్- దగ్గు,

## శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న శరద్ పవార్

**ఢిల్లీ, (పతినిధి) :**
ఎన్సీపీ-ఎస్పీ అధినేత శరద్ పవార్ అస్వస్థతకు గురయ్యారు. గత కొన్ని రోజులుగా ఆయన గొంతునొప్పి, దగ్గుతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే కుటుంబ సభ్యులు ఆయన్ను పుణెలోని రూబీ ఆస్పత్రికి తరలించారు. శరద్ పవార్ కొన్ని రోజులుగా గొంతునొప్పితో బాధపడుతున్నారని ఆయన సన్నిహితుడు తెలిపారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ పర్వేజ్ నేతృతంలోని బృందం శరద్ పవార్‌కు చికిత్స అందిస్తోంది. మరిన్ని వివరాలను తర్వాత వెల్లడిస్తామని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.



"శరద్ పవార్‌కు ముందుగా దగ్గు కోసం పరీక్షలు నిర్వహిస్తారు. ఆ తర్వాత ఆయన్ను ఆసుపత్రిలో చేర్చుకోవాలా లేదా డిశ్చార్జ్ చేయాలా అనే దానిపై నిర్ణయం తీసుకుంటారు." అని రూబీ హాల్ క్లినిక్ చీఫ్ కార్డియాలజిస్ట్, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పర్వేజ్ గ్రాంట్ వెల్లడించారు. సోమవారం ఉదయం నుంచి దగ్గు కారణంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉందని పవార్ ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే ఎలాంటి రిస్క్ తీసుకోకూడదనే ఉద్దేశంతో ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపాయి. శరద్ పవార్?తో ఆయన కుమార్తె, బారామతి పార్లమెంట్ సభ్యురాలు సుప్రియా సూలే కూడా పుణెలోని రూబీ హాల్ ఆసుపత్రికి వెళ్లారు.

భారతీయ రాజకీయాల్లో అపర చాణక్యుడిగా పేరొందిన శరద్ పవార్ పూర్తి పేరు శరదచంద్ర గోవిందరావు పవార్. మహారాష్ట్ర పుణె జిల్లాలోని బారామతిలో 1940 డిసెంబర్ 12న మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. గోవిందరావు పవార్, శారదాబాయిల 11 మంది సంతానంలో శరద్ పవార్ ఒకరు. తల్లి శారదాబాయి పవార్ స్థానిక రాజకీయాల్లో చురుగ్గా ఉండడంతో చిన్నప్పటి నుంచే శరద్ పవార్‌లో రాజకీయ బీజాలు పడ్డాయి. తండ్రి గోవిందరావు పవార్ సహకార రంగంలో చురుగ్గా ఉండేవారు. తల్లి శారదాబాయి పవార్ 1930ల నుంచే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి సామాజిక సేవలో ఉండేవారు. పుణెలోని బ్రిహన్ మహారాష్ట్ర కాలేజ్ ఆఫ్ కామర్స్ నుంచి శరద్ పవార్ బీకాం పట్టా పొందారు. చదువులో పెద్దగా రాణించనప్పటికీ విద్యార్థి రాజకీయాలు, వక్తృత్వ పోటీల్లో చురుగ్గా పాల్గొనేవారు. 1956లో గోవా విముక్తి పోరాటం కోసం నిరసన ర్యాలీ నిర్వహించడం ద్వారా శరద్ పవార్ బహిరంగ రాజకీయాల్లోకి వచ్చారు. తొలుత కాంగ్రెస్?లో ఉన్న ఆయన, ఆ తర్వాత పార్టీతో విబేధించి 1999లో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని శరద్ పవార్ స్థాపించారు.

### మహారాష్ట్ర రాజకీయాల్లో ఒక శక్తివంతమైన రాజవంశంగా పవార్ కుటుంబం

పవార్ కుటుంబం మహారాష్ట్ర రాజకీయాల్లో ఒక శక్తివంతమైన రాజవంశంగా ఎదిగింది. కుమార్తె సుప్రియా సూలే ప్రస్తుతం బారామతి ఎంపీగా ఉన్నారు. అన్న కొడుకు, దివగంత నేత అజిత్ పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన మరణానంతరం అజిత్ భార్య సునేత్రా పవార్ ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా సేవలు అందిస్తున్నారు. దీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్న శరద్ పవార్‌పై కొన్ని వివాదాలు ఉన్నాయి. ముంబయి మాఫియాతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు., స్టాంప్ పేపర్ కుంభకోణం, భూ కేటాయింపుల్లో అక్రమాల వంటి ఆరోపణలు వచ్చాయి. అయితే ఇవేవీ శరద్ రాజకీయ ప్రాబల్యాన్ని తగ్గించలేకపోయాయి.

### నోటి క్యాన్సర్‌తో 20కి పైగా శస్త్రచికిత్సలు

1999-2000 మధ్యలో శరద్ పవార్‌కు నోటి క్యాన్సర్ సోకింది. అది చాలా క్లిష్టమైన దశలో ఉన్నప్పటికీ, ఆయన వెనకడుగు వేయలేదు. పవార్‌కు దాదాపు 20కి పైగా శస్త్రచికిత్సలు జరిగాయి. నోటి దవడలో భాగాలను తొలగించాల్సి వచ్చినా చికిత్స తీసుకుంటూనే రాజకీయాల్లో క్రియాశీలంగా గడిపారు. ఆయన సంకల్పబలం ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచింది. అజేయుడైన నాయకుడిగా, అపర చాణక్యుడిగా శరద్ పవార్ పేరు భారత రాజకీయ చరిత్రలో సుస్థిరంగా ఉంటుంది.

# సెషెల్స్‌కు భారత్ భారీ ఆర్థిక చేయూత

## రూ.1500 కోట్ల స్పెషల్ ప్యాకేజీ ప్రకటించిన మోదీ

**ఢిల్లీ, (ప్రతినిధి) :**
**హిందూ మహాసముద్ర ప్రాంతంలో వ్యూహాత్మకంగా కీలకమైన సెషెల్స్‌కు భారత్ భారీ ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. దీంతో రెండు దేశాల మధ్య సంబంధాలు బలపడుతున్నాయి. అయితే ప్రధాని నరేంద్ర మోదీ, సెషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ మధ్య దిల్లీలో తాజాగా జరిగిన ద్వైపాక్షిక చర్చల అనంతరం 175 మిలియన్ అమెరికన్ డాలర్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించారు. ఆ నిధులతో సెషెల్స్‌లో అభివృద్ధి, భద్రత, మౌలిక సదుపాయాల రంగాల్లో కీలక ప్రాజెక్టులు చేపట్టనున్నారు.**



### సెషెల్స్ భారత్‌కు కీలక సముద్ర పొరుగుదేశం

అయితే ఆరు రోజుల భారత పర్యటనలో భాగంగా హెర్మినీ మోదీతో సోమవారం మధ్యాహ్నం విస్తృతంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వాణిజ్యం, ఆర్థికాభివృద్ధి, సముద్ర భద్రత, సస్టైనబిలిటీ, వాతావరణ మార్పులకు అనుగుణ చర్యలు వంటి అంశాల్లో సహకారాన్ని పెంచుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. సెషెల్స్ భారత్‌కు కీలక సముద్ర పొరుగుదేశమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

### భౌగోళిక సంబంధమే కాదు!

"భారత్- సెషెల్స్ బంధం భౌగోళిక సంబంధమే కాదు, చరిత్ర, విశ్వాసం, భవిష్యత్ దృష్టితో కూడిన భాగస్వామ్యం. సెషెల్స్ అవసరాల ప్రకారం అభివృద్ధి సహకారం అందిస్తున్నాం" అని మోదీ తెలిపారు. ప్రకటించిన 175 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.15,87,43,37,500) ప్యాకేజీ ద్వారా సామాజిక గృహ నిర్మాణం, ఈ-మొబిలిటీ, వృత్తి శిక్షణ, ఆరోగ్య సేవలు, రక్షణ, సముద్ర భద్రత రంగాల్లో ప్రాజెక్టులు అమలు చేయనున్నట్లు ప్రధాని చెప్పారు.

### ఇరు దేశాల సంబంధాల్లో ప్రధాన స్తంభాలు

రక్షణ సహకారం, సముద్ర భద్రత ఇరు దేశాల సంబంధాల్లో ప్రధాన స్తంభాలని మోదీ స్పష్టం చేశారు. సెషెల్స్‌ను కొలంబో సెక్యూరిటీ కాన్‌క్లేవ్‌లో పూర్తి సభ్యదేశంగా స్వాగతించారు. దీని వల్ల హిందూ మహాసముద్రంలో శాంతి, స్థిరత్వం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. బ్లూ ఎకానమీ రంగంలో భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు నిర్ణయం తీసుకున్నారు. సముద్ర పరిశోధన, డేటా షేరింగ్, సామర్థ్యాభివృద్ధి రంగాల్లో భారత్ తన నైపుణ్యాన్ని పంచుకోనుంది. పునరుత్పాదక శక్తి, వాతావరణ అనుకూల పరిష్కారాల్లో కూడా సహకారం పెంచాలని నిర్ణయించారు.

### అ అంశాల్లో ఒప్పందాలు ఖరారు

డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో భారత్ సాధించిన విజయాలను సెషెల్స్‌తో పంచుకుంటామని ప్రధాని మోదీ చెప్పారు. చౌకగా నాణ్యమైన ఔషధాల సరఫరా, ఆరోగ్య మౌలిక సదుపాయాల అభివృద్ధి, మెడికల్ టూరిజం ప్రోత్సాహం వంటి రంగాల్లో కలిసి పనిచేయనున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాలు పలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఫార్మాకోపీయల్ సహకారం, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, డిజిటల్ పరిష్కారాల జ్ఞాన భాగస్వామ్యం, ఆహార సరఫరా ఒప్పందాలు తదితర అంశాల్లో ఒప్పందాలు జరిగాయి.

### గాంధీజీ సిద్ధాంతాలు భారత్-- సెషెల్స్ భాగస్వామ్యానికి మార్గదర్శకం

ప్రజల మధ్య సంబంధాలే ఇరు దేశాల బలమని మోదీ అన్నారు. సెషెల్స్‌లో నివసిస్తున్న భారతీయులు అక్కడి సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. తరతరాలుగా స్నేహబంధాన్ని వారు మరింత బలపరుస్తున్నారని తెలిపారు. పర్యటనలో భాగంగా అధ్యక్షుడు హెర్మినీ రాజ్‌ఘాట్‌లో మహాత్మా గాంధీకి నివాళు లు అర్పించారు. గాంధీజీ సిద్ధాంతాలు భారత్-- సెషెల్స్ భాగస్వామ్యానికి మార్గదర్శకంగా ఉన్నాయని విదేశాంగ శాఖ పేర్కొంది.

### దౌత్య సంబంధాలకు 50 సంవత్సరాలు

కాగా, 2025 అక్టోబరులో పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత హెర్మినీకి ఇదే తొలి భారత పర్యటన. అంతేకాకుండా ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలకు 50 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంలో ఆయన పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. తాజా ఆర్థిక ప్యాకేజీ, కొత్త ఒప్పందాలతో భారత్-- సెషెల్స్ దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడుతూ కొత్త దశలోకి అడుగుపెడుతున్నట్లు తెలుస్తోంది.

# డిజిటల్ మోసాల కేసులను ఎదుర్కోవడానికి SOPని రూపొందించండి

## కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

**ఢిల్లీ,‾ (ప్రతినిధి) :**
**దేశంలో డిజిటల్ మోసాల ద్వారా రూ.54వేల కోట్లకు పైగా సొమ్ము దోపిడీకి గురికావడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది ముమ్మాటికీ "పచ్చి దోపిడీ, డెకాయిటీ" అని వ్యాఖ్యానించింది. ఇలాంటి కేసులను ఎదుర్కోవడానికి ఆర్?బీఐ, బ్యాంకులు, టెలికాం శాఖలతో సంప్రదించి, ఒక పక్కా 'స్టాండర్డ్? ఆపరేటింగ్? ప్రొసీజర్' (ఎస్?ఓపీ) రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించింది.?**



### చిన్న రాష్ట్రాల బడ్జెట్ కంటే ఎక్కువే!

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్?మాల్య బాగ్చీ, జస్టిస్ ఎన్?వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం సుమోటోగా ఈ కేసు విచారణను చేపట్టింది. "బ్యాంకులు కేవలం లాభాపేక్షతో, వ్యాపార ధోరణిలో ఉండి, నేరగాళ్లు సులభంగా దోపిడీ సొమ్మును తరలించడానికి వేదికలుగా మారుతున్నాయి" అని జస్టిస్ బాగ్చీ అన్నారు. 2021 ఏప్రిల్ నుంచి 2025 నవంబర్ మధ్య మన దేశంలో ఏకంగా రూ.52వేల కోట్ల సైబర్ మోసాలు జరిగినట్లు హోంశాఖ నివేదిక పేర్కొన్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇది 'అనేక రాష్ట్రాల వార్షిక బడ్జెట్ కంటే ఇది చాలా ఎక్కువ మొత్తం' అని సీజేఐ సూర్యకాంత్ అన్నారు.?

కాగా, ఈ డిజిటల్? మోసాలు బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్ల లేదా నేరగాళ్లతో సహకరించడం వల్ల జరిగి ఉండవచ్చని ధర్మాసనం అనుమానం వ్యక్తం చేసింది. డిజిటల్ అరెస్టుల పట్ల ఆర్‌బీఐ, బ్యాంకులు సకాలంలో స్పందించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది.

### సుప్రీంకోర్టు ఆదేశాలు

ఆర్‌బీఐ, టెలికాం శాఖ రూపొందించిన నిబంధనలను పరిగణనలోకి తీసుకుని, ఈ నేరాలను సమర్థవంతంగా అరికట్టడానికి నాలుగు వారాల్లోగా ఒక ముసాయిదా ఒప్పందాన్ని సిద్ధం చేయాలని హోం మంత్రిత్వ శాఖను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. అలాగే దేశవ్యాప్తంగా నమోదైన డిజిటల్ అరెస్ట్ కేసులను గుర్తించాలని సీబీఐని ఆదేశించింది. అలాగే, ఈ కేసుల్లో విచారణ జరిపేందుకు సీబీఐకి అవసరమైన అనుమతులను వెంటనే మంజూరు చేయాలని దిల్లీ, గుజరాత్ ప్రభుత్వాలకు స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్ట్ బాధితులకు పరిహారం అందించే విషయంలో ఉదారంగా, ఆచరణాత్మక దృక్పథంతో వ్యవహరించాలని సుప్రీంకోర్టు సూచించింది. పరిహారం చెల్లింపుపై ఒక ఫ్రేమ్‌వర్క్ సిద్ధం చేయడానికి ఆర్‌బీఐ, టెలికాం శాఖ సంయుక్తంగా సమావేశం కావాలని ఆదేశించింది.

### బ్యాంకులపై ధర్మాసనం ఆగ్రహం

సైబర్ మోసాల నివారణలో బ్యాంకులు క్రియాశీలక పాత్ర పోషించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. "కోట్లాది రూపాయల టర్నోవర్ ఉన్న వ్యాపార సంస్థల ఖాతాల్లో భారీ లావాదేవీలు జరిగితే అనుమానం రాకపోవచ్చు. కానీ కేవలం రూ.15-20 వేల పెన్షన్? తీసుకునే వ్యక్తి ఖాతా నుంచి ఒక్కసారిగా రూ.50 లక్షలు లేదా కోటి రూపాయలు విత్?డ్రా అవుతుంటే, మీ ఏఐ టూల్స్? ఎందుకు అలర్ట్ చేయడం లేదు?" అని సీజేఐ సూర్యకాంత్ ప్రశ్నించారు.

### ఏఐ వాడండి!

ఈ కేసులో అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ అడ్వకేట్ ఎన్?.ఎస్?.నప్పినై తన వాదనలు వినిపిస్తూ, "అనుమానాస్పద లావాదేవీలను గుర్తించడానికి బ్యాంకులు కృత్రిమ మేధ (ఏఐ)ని ఉపయోగించాలి" అని సూచించారు. కేవలం ఆర్?బీఐ సర్క్యులర్లు జారీ చేస్తే సరిపోదని, నిబంధనలు పాటించని బ్యాంకులపై జరిమానాలు విధిస్తేనే ఫలితం ఉంటుందని ఆమె అన్నారు.

### డిజిటల్ అరెస్ట్ అంటే ఏమిటి?

డిజిటల్ అరెస్ట్ అనేది ప్రస్తుతం వేగంగా విస్తరిస్తున్న ఒక సైబర్ నేరం. ఇందులో నేరగాళ్లు తాము పోలీస్ ఆఫీసర్లమని, కోర్టు లేదా ప్రభుత్వ అధికారలమంటూ బాధితులను నమ్మిస్తారు. ఆడియో లేదా వీడియో కాల్స్ ద్వారా బాధితులను బెదిరించి, వారిని గృహ నిర్బంధంలో ఉన్నట్లు భ్రమ కలిగిస్తారు. తీవ్రమైన ఒత్తిడికి గురిచేసి వారి నుంచి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేస్తారు.



# వాళ్లిద్దరికీ మాత్రం సిస్టర్ గా నటించలేను



సీనియర్ నటి సురేఖావాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా వెండితెరకు పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. తన తొలి చిత్రం 'అమరావతికి ఆహ్వానం' ప్రమోషన్లలో భాగంగా ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. మంచి కథ వస్తే క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా చేయడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే ఇద్దరు హీరోలకు మాత్రం మాత్రం చెల్లిగా నటించనని పేర్కొంది. ః:పవన్ కల్యాణ్, ఎన్టీఆర్ వంటి స్టార్లకు చెల్లిగా నటించే అవకాశం వస్తే తప్పకుండా చేస్తాను. కానీ, విజయ్ దేవరకొండ, అఖిల్ అక్కినేనిలకు మాత్రం సిస్టర్ గా చేయను:: అని సుప్రీత స్పష్టం చేసింది. వాళ్లిద్దరూ అంటే తనకు చాలా ఇష్టమని, టెన్త్ క్లాస్ పాసయితే అఖిల్ తో డిన్నర్ కు తీసుకెళతానని అమ్మ మాటిచ్చిందని సుప్రీత వెల్లడించింది. కానీ ఇంతవరకు అది నెరవేరలేదని విచారం వ్యక్తం చేసింది. హీరోయిన్‌గా మాత్రమే కాకుండా విభిన్న పాత్రలు పోషించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆమె తెలిపింది. సుప్రీత నటిస్తున్న 'అమరావతికి ఆహ్వానం' అనే హారర్ చిత్రం ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు రానుంది.ఇదే ఇంటర్వ్యూలో తన జీవితంలో ఎదుర్కొన్న ఓ భయంకరమైన అనుభవాన్ని కూడా సుప్రీత పంచుకుంది. బరువు పెరిగావంటూ చుట్టూ ఉన్నవారు అనడంతో తీవ్రమైన ఒత్తిడికి గురయ్యానని, దాంతో బరువు తగ్గాలని తప్పుడు డైటింగ్ పద్ధతులు పాటించానని సుప్రీత భావోద్వేగంతో చెప్పింది. ::ఒత్తిడి పెరిగినప్పుడల్లా ఇంకా ఎక్కువ తినేదాన్ని. దాంతో లావయ్యాను. వెంటనే బరువు తగ్గాలని నిర్ణయించుకుని, రోజుకు ఒక పూట మాత్రమే తినడం మొదలుపెట్టా. సుమారు 12 నుంచి 15 గంటలు ఏమీ తినకుండా ఉండేదాన్ని. బిర్యానీలు తినడంతో ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది:: అని ఆమె వివరించారు.ఆరోగ్య సమస్యలు తీవ్రం కావడంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చిందని, అక్కడ 15 రోజులపాటునరకం చూశాననికన్నీటిపర్యంతమయ్యారు. మంచి నీళ్లు తాగినా వాంతులయ్యేవి. దాదాపు 20 రోజులు అన్నం తినలేదు. రోజుకు 15 సార్లు వాంతులు చేసుకున్నా. ఒక దశలో నేను బతకనేమో అనుకున్నా. ఈ బాధ భరించడం కన్నా చనిపోవడం మంచిదనిపించింది. కానీ దేవుడి దయతో కోలుకునిఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాను:: అని సుప్రీత తెలిపింది. తన అనుభవం అందరికీ ఒక గుణపాఠం కావాలని, ఆరోగ్యం విషయంలో అజాగ్రత్త వద్దని ఆమె సూచించారు.

## రామ్ చరణ్ 'పెద్ది' సెకండ్ సింగిల్‌పై భారీ అంచనాలు..

# ఫిబ్రవరి 14న రిలీజ్‌కు సన్నాహాలు!




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' పై ప్రేక్షకుల్లో రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్ "చికిరి చికిరి" మ్యూజిక్ లవర్స్‌ను విపరీతంగా ఆకట్టుకుని ఆడియో ప్లాట్‌ఫామ్స్‌లో సెన్సేషన్ క్రియేట్ చేయగా, ఇప్పుడు అందరి దృష్టి సినిమా నుంచి రాబోతున్న సెకండ్ సింగిల్ పై పడింది.ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటం సినిమాకు మరింత ప్రత్యేక ఆకర్షణగా మారింది. తాజా సమాచారం ప్రకారం, రెండో పాట ఒక పవర్‌ఫుల్ ఇంట్రడక్షన్ సాంగ్ గా ఉండనుందని తెలుస్తోంది. రామ్ చరణ్ పాత్రను గ్రాండ్‌గా ఎలివేట్ చేసే ఈ పాటకు ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అదిరిపోయే స్టెప్పులు డిజైన్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సాంగ్‌లో చరణ్ మాస్ ఎనర్జీ, స్టైల్ అభిమానులను అలరిస్తుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా స్వయంగా సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఈ పాట గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ సాంగ్ ఖచ్చితంగా ఒక బ్లాస్ట్ లా ఉంటుంది" అంటూ అభిమానుల్లో మరింత ఉత్సాహం నింపారు. వాస్తవానికి ఈ పాటను డిసెంబర్ చివర్లో విడుదల చేయాలనుకున్నప్పటికీ, పలు కారణాల వల్ల వాయిదా పడింది. ప్రస్తుతం ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. అధికారిక ప్రకటన ఈ వారంలో వెలువడే అవకాశముందని సినీ వర్గాలు సూచిస్తున్నాయి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. అదేవిధంగా కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, సీనియర్ నటుడు జగపతి బాబు, బాలీవుడ్ నటుడు దివ్యేందు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంతో కూడిన స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం భావోద్వేగాలు, యాక్షన్, సంగీతం మేళవింపుతో ఉండబోతోందని తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 30, 2026న ఈ సినిమాను గ్రాండ్‌గా విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సాంగ్‌తోనే సినిమాపై భారీ హైప్ ఏర్పడగా, రాబోయే సెకండ్ సింగిల్ ఆ అంచనాలను మరింత పెంచేలా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మెగా అభిమానులు ఇప్పుడు ఆఫీషియల్ అనౌన్స్‌మెంట్ కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

# రుద్ర పుస్తకాన్ని ఆవిష్కరించిన చిరంజీవి..

## కృతజ్ఞతలు తెలిపిన కొండా సురేఖ




టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి రుద్ర అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత పటేల్ ఈ పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకావిష్కరణ విషయాన్ని మంత్రి కొండా సురేఖ తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఈ సందర్భంగాచిరంజీవి మాట్లాడుతూ, ఆధ్యాత్మిక విలువలు, సాంస్కృతిక వారసత్వాన్ని యువతకు చేరువ చేసేలా ఈ పుస్తకాన్ని రూపొందించడం సంతోషంగా ఉందన్నారు. నేటి తరానికి ఇటువంటి విలువైన పుస్తకాలు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. రచయిత్రి సుస్మిత పటేల్ ప్రయత్నాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పుస్తకావిష్కరణకు అంగీకరించిన మెగాస్టార్ చిరంజీవికి మంత్రి కొండా సురేఖ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నేటి యువతకు ఆదర్శంగా నిలిచేలా, శివ పురాణంపై అవగాహన కలిగించాలనే ఉన్నత లక్ష్యంతో ఈ పుస్తకాన్ని రచించిన కొండా సుస్మితకు హృదయపూర్వక శుభాకాంక్షలు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని గొప్ప రచనలు చేయాలని ఆకాంక్షిస్తున్నాంcc అని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు. యువతను లక్ష్యంగా చేసుకుని, శివపురాణంలోని విశేషాలను వారికి సులభంగా తెలియజేయాలనే సంకల్పంతో ఈ పుస్తకాన్ని రచించినట్లు తెలుస్తోంది.


# 'స్పిరిట్' నుంచి మరో స్టార్ ఔట్..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్పిరిట్' ఇప్పటికే సినీ ప్రేక్షకుల్లో విపరీతమైన అంచనాలను సృష్టించింది. కల్ట్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న సందీప్ రెడ్డి వంగా ఈ సినిమాను రూపొందిస్తుండగా, 'యానిమల్' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన త్రిప్తి డిమ్రీ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇటీవలే ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమవ్వగా, 2027లో విడుదలయ్యే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే విడుదలైన వాయిస్ టీజర్, ప్రభాస్ ఫస్ట్ లుక్‌కు భారీ స్పందన రావడంతో ఈ ప్రాజెక్ట్‌పై హైప్ మరింత పెరిగింది. టీజర్ విడుదలైనప్పటి నుంచి 'స్పిరిట్' సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న అప్డేట్ కూడా సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అవుతోంది. ఈ క్రమంలో తాజాగా మరో క్రేజీ న్యూస్ చర్చనీయాంశంగా మారింది. ఈ చిత్రంలో ప్రముఖ సీనియర్ నటుడు ప్రకాష్ రాజ్ కీలక పాత్రలో నటిస్తున్నారని ముందుగా వార్తలు వచ్చాయి. అంతేకాదు వాయిస్ టీజర్‌లో కూడా ఆయన వాయిస్ వినిపించడంతో సినిమాలో ఆయన పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు భావించారు. అయితే ఇప్పుడు అనూహ్యంగా 'స్పిరిట్' ప్రాజెక్ట్ నుంచి ప్రకాష్ రాజ్ తప్పుకున్నారనే వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. ఈ విషయం పై అధికారిక ప్రకటన ఏదీ రాకపోయినా, సోషల్ మీడియా మరియు జాతీయ స్థాయి ఎంటర్‌టైన్‌మెంట్ వేదికల్లో ఈ వార్త విస్తృతంగా ప్రచారం పొందుతోంది. ఆయన ఎందుకు తప్పుకున్నారనే విషయంపై స్పష్టత లేకపోవడంతో ఆసక్తి మరింత పెరిగింది. గతంలో ఈ సినిమా నుంచి హీరోయిన్ దీపికా పదుకొనే తప్పుకున్నారనే వార్తలు కూడా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ప్రకాష్ రాజ్ గురించిన ప్రచారం బయటకు రావడంతో మళ్లీ అదే తరహా చర్చ మొదలైంది. అయితే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు ఈ వార్తల నిజానిజాలు తెలియవు. భారీ అంచనాలతో రూపొందుతున్న 'స్పిరిట్' సినిమాలో నటీనటుల మార్పులు జరుగుతాయా లేదా అన్నది తెలుసుకోవాలంటే అభిమానులు ఇంకొంత కాలం వేచి చూడాల్సిందే.

## క్రేజీ సీక్వెల్ 'ఆవేశం 2' వచ్చేస్తుంది..

# పుష్ప యాక్టర్ ఫహద్ ఫాసిల్ ఏం చెప్పాడంటే..?



తెలుగు ప్రేక్షకుల్లో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న మాలీవుడ్ స్టార్ హీరోల్లో టాప్‌లో ఉంటాడు ఫహద్ ఫాసిల్. ఈ క్రేజీ యాక్టర్ నటించిన మాలీవుడ్ యాక్షన్ కామెడీ డ్రామా ఆవేశం.రోమాంచం ఫేం జీతూ మాధవన్ డైరెక్ట్ చేశాడు. సుమారు రూ.30 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది. ఈ చిత్రంలో ఫహద్ ఫాసిల్ పోషించిన రంగ పాత్రకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.కాగా ఈ క్రేజీ చిత్రానికి సీక్వెల్ రాబోతుందన్న వార్త ఇప్పుడు మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తోంది. తాజాగా ఓ ఈవెంట్‌లో సీక్వెల్‌పై క్లారిటీ ఇచ్చాడు ఫహద్ ఫాసిల్. ఆవేశం 2 ఉంటుందని అధికారికంగా ప్రకటించాడు. సీక్వెల్ 2027 లేదా 2028లో మొదలు కానుందని కూడా క్లారిటీ ఇచ్చాడు. డైరెక్టర్ జీతూ మాధవన్ సూర్యతో చేస్తున్న తన తొలి తమిళ చిత్రంతో బిజీగా ఉన్నాడు. ఈ మూవీతోపాటు ఫహద్ ఫాసిల్ కమిట్ మెంట్స్ పూర్తయిన తర్వాత ఆవేశం 2 సెట్స్‌పైకి వెళ్లనుందట. మొత్తానికి పుష్ప యాక్టర్ అభిమానులు, మూవీ లవర్స్‌కు ఇది గుడ్ న్యూస్ అనే చెప్పాలి.ఓ వైపు ఫహద్ ఫాసిల్ అండ్ టీం కామిక్ టైమింగ్.. మరో యాక్షన్ ఎలిమెంట్స్‌తో సాగే ఆవేశం చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న ఆవేశం 2 అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. ఆవేశం చిత్రాన్ని ఫహద్ ఫాసిల్–నజ్రియా నజీమ్, అన్వర్ రషీద్ సంయుక్తంగా నిర్మించారు.

నినాదం
నిఖార్సైన జర్నలిజం

# 31 ఫోర్లు, 6 సిక్సర్లతో రికార్డ్ ఇన్నింగ్స్..

## కట్ చేస్తే.. ఒక్క పరుగు తేడాతో చెత్త రికార్డ్..

**రంజీ ట్రోఫీ 3వ క్వార్టర్ ఫైనల్ లో ఓ విచిత్రమైన రికార్డ్ నమోదైంది. బెంగాల్ ప్లేయర్ ఒక్క పరుగు తేడాతో ట్రిపుల్ సెంచరీ కోల్పోయాడు. దీంతో ఇప్పటి వరకు రంజీ ట్రోఫీలో ఎవ్వరూ ఇలా 299 దగ్గర ఔట్ కాలే. పాపం తొలిసారి ఇలా ఓ ప్లేయర్ ట్రిపుల్ సెంచరీ కోల్పోయి, చెత్త రికార్డ్ ను తనపేర లిఖించుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ జట్టుతో జరిగిన ఈ మ్యాచ్ లో బెంగాల్ టాప్ ఆర్డర్ ప్లేయర్ సుదీప్ కుమార్ ఘరామి 299 పరుగుల వద్ద ఇలా విషాదకరంగా పెవిలియన్ చేరాడు.**

### అవాంఛిత రికార్డ్..

సుదీప్ కుమార్ ఘరామి 200 పరగుల వద్ద ఔట్ కావడంతో తన పేరుతో ఓ అవాంఛనీయ రికార్డ్ నమోదు చేసుకున్నాడు. రంజీ ట్రోఫీలో ఇలా ఔట్ అవ్వడం తొలిసారి. ఇంతకు ముందు శంతను సుగ్వేకర్ 299 పరుగుల వద్ద నాటౌట్ గా నిలిచాడు. 1988-89లో మహారాష్ట్ర బ్యాటర్ మధ్యప్రదేశ్ టీంపై 299 పరుగులు చేశాడు. ఈసారి సుదీప్ కుమార్ అదే స్కోర్ వద్ద ఔట్ అయి రికార్డ్ సృష్టించాడు.

రెండో రోజు క్రీజులోకి వచ్చిన సుదీప్ 96 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. రోజు ముగిసే సమయానికి 157 బంతుల్లో సెంచరీ చేశాడు. ఇక మూడో రోజు మొత్తంగా 270 బంతుల్లో 150 పరుగులు సాధించాడు. అలాగే, 415 బంతుల్లో డబుల్ సెంచరీ పూర్తి చేశాడు. ఈ క్రమంలో అతను 31 ఫోర్లు, 6 సిక్సర్లు బాదాడు.



ఈ రంజీ ట్రోఫీ సీజన్ లో బెంగాల్ తరపున సుదీప్ కుమార్ ఘరామి అద్భుతంగా ఆకట్టుకున్నాడు. ఇప్పటి వరకు 12 ఇన్నింగ్స్ లలో 54.25 సగటుతో 651 పరుగులు చేశాడు. ఈ సీజన్ లో ర2 సెంచరీలు, 3 హాఫ్ సెంచరీలు చేశాడు. అయితే, ఈ సీజన్ లో తొలి ట్రిపుల్ సెంచరీ చేసిన ప్లేయర్ గా రికార్డ్ కొద్దిలో మిస్సయ్యాడు.

# ఈడెన్ గార్డెన్స్‌లో పరుగుల సునామీ..

## టీ20 వరల్డ్ కప్‌లో చరిత్ర సృష్టించిన స్కాట్లాండ్

**టీ20 ప్రపంచకప్ 2026లో సరికొత్త చరిత్ర ఆవిష్కృతమైంది. పసికూనలుగా భావించే అసోసియేట్ జట్లు కూడా భారీ స్కోర్లు సాధించగలవని స్కాట్లాండ్ నిరూపించింది. సోమవారం (ఫిబ్రవరి 9) కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఇటలీతో జరిగిన గ్రూప్-సి మ్యాచ్‌లో స్కాట్లాండ్ పరుగుల వరద పారించింది.**





టీ20 ప్రపంచకప్ 2026లో సరికొత్త చరిత్ర ఆవిష్కృతమైంది. పసికూనలుగా భావించే అసోసియేట్ జట్లు కూడా భారీ స్కోర్లు సాధించగలవని స్కాట్లాండ్ నిరూపించింది. సోమవారం (ఫిబ్రవరి 9) కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఇటలీతో జరిగిన గ్రూప్-సి మ్యాచ్‌లో స్కాట్లాండ్ పరుగుల వరద పారించింది. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 207 పరుగుల భారీ స్కోరు సాధించి, టీ20 వరల్డ్ కప్ చరిత్రలో 200ం మార్కును దాటిన తొలి అసోసియేట్ జట్టుగా సరికొత్త రికార్డును లిఖించింది.

బంగ్లాదేశ్ స్థానంలో చివరి నిమిషంలో టోర్నీలోకి ఎంట్రీ ఇచ్చిన స్కాట్లాండ్, తన బ్యాటింగ్‌తో అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇటలీతో జరిగిన మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్‌కు ఓపెనర్లు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. ఓపెనర్ జార్జ్ మున్సే 54 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్సర్లతో 84 పరుగులు చేసి ఇటలీ బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. మరో ఓపెనర్ మైఖేల్ జోన్స్ (37)తో కలిసి తొలి వికెట్‌కు ఏకంగా 126 పరుగులు జోడించాడు. టీ20 వరల్డ్ కప్ చరిత్రలో ఒక అసోసియేట్ జట్టుకు ఇదే అత్యుత్తమ ఓపెనింగ్ భాగస్వామ్యం.

మున్సే అవుట్ అయిన తర్వాత కూడా స్కాట్లాండ్ జోరు తగ్గలేదు. బ్రెండన్ మెక్‌ముల్లెన్ కేవలం 18 బంతుల్లో 41 పరుగులు (నాటౌట్) చేసి ఇన్నింగ్స్ వేగాన్ని పెంచాడు. ఇక చివర్లో మైఖేల్ లీస్క్ ఆడిన కేమియో ఇన్నింగ్స్ హైలైట్ అని చెప్పాలి. కేవలం 5 బంతుల్లోనే 22 పరుగులు రాబట్టి స్కాట్లాండ్ స్కోరును 200 దాటించాడు. ఆఖరి ఓవర్లో వరుసగా 6, 6, 4 బాది జట్టుకు 207/4 భారీ స్కోరును అందించాడు. దీంతో టీ20 ప్రపంచకప్‌లో 200 పరుగుల మైలురాయిని చేరుకున్న తొలి టెస్టు హోదా లేని జట్టుగా స్కాట్లాండ్ రికార్డు సృష్టించింది.

గతంలో అసోసియేట్ జట్లలో అమెరికా.. కెనడాపై 197 పరుగులు చేసిన రికార్డు ఉండగా, ఇప్పుడు స్కాట్లాండ్ దానిని అధిగమించింది. అలాగే కెనడా (194), నెదర్లాండ్స్ (193) పేరిట ఉన్న రికార్డులు కూడా కనుమరుగయ్యాయి. ఇటలీ కెప్టెన్ వేన్ మాడ్సెన్ ఫీల్డింగ్ చేస్తూ గాయపడటం ఆ జట్టుకు పెద్ద దెబ్బగా మారింది. వెస్టిండీస్ చేతిలో తొలి మ్యాచ్‌లో ఓడిపోయిన స్కాట్లాండ్, ఈ విజయంతో మళ్ళీ ఫామ్‌లోకి వచ్చి సూపర్-8 ఆశలను సజీవంగా ఉంచుకుంది.

# నమీబియాతో మ్యాచ్ నుంచి ఇద్దరు ఔట్..

## ప్రయోగాలకే ఒకే చెప్పిన గంభీర్.. ఎవరంటే..?

**గౌతమ్ గంభీర్ ప్లేయింగ్ 11 కోసం బలమైన నిర్ణయాలు తీసుకుంటున్నాడు. ఫామ్, ఫిట్‌నెస్‌ను నిర్ధారించడంతోపాటు బెంచ్ ప్లేయర్లను కూడా మ్యాచ్‌కు సిద్ధంగా ఉంచేందుకు షాకింగ్ నిర్ణయాలు తదుపరి మ్యాచ్‌కు తప్పిపోయిన లేదా తప్పిపోయే ఆటగాళ్లకు, సందేశం అంతే బలంగా ఉంది: అవకాశాలు వస్తాయి, కానీ ప్రపంచ కప్ ముందుకు సాగుతున్న కొద్దీ భారతదేశపు ఉత్తమ ౹Xలో ఎవరు ఉంటారో స్థిరత్వం మరియు ప్రదర్శన నిర్ణయిస్తాయి.**





టీమిండియా తొలి మ్యాచ్ లో అమెరికాతో తలపడి విజయం సాధించింది. ఇక రెండో మ్యాచ్ లో నమీబియాతో తలపడేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో తొలి మ్యాచ్ లో చోటు దక్కని ఇద్దరి ప్లేయర్లు రెండో మ్యాచ్ లో ఆడే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. కోచ్ గంభీర్ కూడా ఈ ఇద్దరిని ఆడించాలని ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. ప్రాక్టీస్ లో ఈ ఇద్దరు టీమిండియా యాజమాన్యాన్ని ఆకట్టుకున్నారని, అందుకే నమీబియాతో ఆడించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ ఇద్దరు ఎవరో ఇప్పుడు చూద్దాం..

ప్రస్తుతం లీగ్ దశ మ్యాచ్ లు జరగుతున్నాయి. అన్ని జట్లు కూడా తమ స్క్వాడ్ లను బలోపేతం చేసేందుకు బెంచ్ ఆటగాల్లకు కూడా అవకాశాలు ఇవ్వాలని చూస్తోంది. ఈ క్రమంలో టీమిండియా కూడా తమ బెంచ్ బలాన్ని టెస్ట్ చేయాలని చూస్తోంది. అందుకే సూపర్ 8 కు ముందు బెంచ్ ఆటగాళ్లను బరిలోకి దించనుంది. ఫిబ్రవరి 12న ఢిల్లీలో నమీబియాతో జరిగే తదుపరి మ్యాచ్ కు ముందు ప్లేయింగ్ 11లో మార్పు జరగనుంది. తొలి మ్యాచ్ మిస్సయిన ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా జట్టులోకి రావడం ఖాయమైంది. మహ్మద్ సిరాజ్ స్థానంలో బుమ్రా రావొచ్చని భావిస్తున్నారు. కానీ తొలి మ్యాచ్ లో సిరాజ్ అద్భుతంగా ఆకట్టుకున్నాడు. మరి నమీబియాతో సిరాజ్ ను తప్పించే ప్రయత్నం చేస్తారా లేదా అని చూడాలి. అలాగే, రింకూ సింగ్ స్థానంలో సంజూ శాంసన్ కు అవకాశం ఇవ్వవచ్చని తెలుస్తోంది. అమెరికాతో జరిగిన మ్యాచ్ లో రింకూ విఫలమైన సంగతి తెలిసిందే. దీంతో లీగ్ దశలోనే కాంబినేషన్ ప్రయత్నాలు చేసేందుకు గంభీర్ సంచలన నిర్ణయాలు తీసుకునే ఛాన్స్ ఉంది.

### తొలి మ్యాచ్ లో రింకూ, సిరాజ్ ల ప్రదర్శన..

బుమ్రా స్థానంలో ప్లేయింగ్ 11లోకి వచ్చిన సిరాజ్.. కీలక దశలో అమెరికా 2 వికెట్లు పడగొట్టి, భారత జట్టును ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. తన 4 ఓవర్లలో 29 పరుగులు ఇచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. మరోవైపు రింకూ సింగ్ కేవలం 14 బంతుల్లో 6 పరుగులు మాత్రమే చేశాడు.

### భారత జట్టు తదుపరి మ్యాచ్ లు..

భారత జట్టు తదుపరి మ్యాచ్ లను పరిశీలిస్తే.. ఫిబ్రవరి 12 న నమీబియాతో, ఫిబ్రవరి 15 న పాకిస్తాన్ జట్టుతో, ఇక చివరి మ్యాచ్ ఫిబ్రవరి 18న నెదర్లాండ్స్ తో తలపడనుంది. ముఖ్యంగా నమీబియాతో మ్యాచ్ లో ప్రయోగాలకే పట్టం కట్టేందుకు గంభీర్ సిద్ధమైనట్లు తెలుస్తుంది. ఆ తర్వాత పాకిస్తాన జట్టుతో మ్యాచ్ జరుగుతుందా లేదా తెలియదు. ఒకవేళ జరిగితే, దాయాదిపై బలమైన జట్టుతో బరిలోకి దిగాలని గంభీర్ చూస్తున్నాడు.

# నమీబియాతో మ్యాచ్ నుంచి ఇద్దరు ఔట్..

## ప్రయోగాలకే ఒకే చెప్పిన గంభీర్.. ఎవరంటే..?



**గౌతమ్ గంభీర్ ప్లేయింగ్ 11 కోసం బలమైన నిర్ణయాలు తీసుకుంటున్నాడు. ఫామ్, ఫిట్‌నెస్‌ను నిర్ధారించడంతోపాటు బెంచ్ ప్లేయర్లను కూడా మ్యాచ్‌కు సిద్ధంగా ఉంచేందుకు షాకింగ్ నిర్ణయాలు తదుపరి మ్యాచ్‌కు తప్పిపోయిన లేదా తప్పిపోయే ఆటగాళ్లకు, సందేశం అంతే బలంగా ఉంది: అవకాశాలు వస్తాయి, కానీ ప్రపంచ కప్ ముందుకు సాగుతున్న కొద్దీ భారతదేశపు ఉత్తమ XIలో ఎవరు ఉంటారో స్థిరత్వం మరియు ప్రదర్శన నిర్ణయిస్తాయి.**

టీమిండియా తొలి మ్యాచ్ లో అమెరికాతో తలపడి విజయం సాధించింది. ఇక రెండో మ్యాచ్ లో నమీబియాతో తలపడేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో తొలి మ్యాచ్ లో చోటు దక్కని ఇద్దరి ప్లేయర్లు రెండో మ్యాచ్ లో ఆడే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. కోచ్ గంభీర్ కూడా ఈ ఇద్దరిని ఆడించాలని ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. ప్రాక్టీస్ లో ఈ ఇద్దరు టీమిండియా యాజమాన్యాన్ని ఆకట్టుకున్నారని, అందుకే నమీబియాతో ఆడించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ ఇద్దరు ఎవరో ఇప్పుడు చూద్దాం..

ప్రస్తుతం లీగ్ దశ మ్యాచ్ లు జరగుతున్నాయి. అన్ని జట్లు కూడా తమ స్క్వాడ్ లను బలోపేతం చేసేందుకు బెంచ్ ఆటగాల్లకు కూడా అవకాశాలు ఇవ్వాలని చూస్తోంది. ఈ క్రమంలో టీమిండియా కూడా తమ బెంచ్ బలాన్ని టెస్ట్ చేయాలని చూస్తోంది. అందుకే సూపర్ 8 కు ముందు బెంచ్ ఆటగాళ్లను బరిలోకి దించనుంది. ఫిబ్రవరి 12న ఢిల్లీలో నమీబియాతో జరిగే తదుపరి మ్యాచ్ కు ముందు ప్లేయింగ్ 11లో మార్పు జరగనుంది. తొలి మ్యాచ్ మిస్సయిన ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా జట్టులోకి రావడం ఖాయమైంది. మహ్మద్ సిరాజ్ స్థానంలో బుమ్రా రావొచ్చని భావిస్తున్నారు. కానీ తొలి మ్యాచ్ లో సిరాజ్ అద్భుతంగా ఆకట్టుకున్నాడు. మరి నమీబియాతో సిరాజ్ ను తప్పించే ప్రయత్నం చేస్తారా లేదా అని చూడాలి. అలాగే, రింకూ సింగ్ స్థానంలో సంజూ శాంసన్ కు అవకాశం ఇవ్వవచ్చని తెలుస్తోంది. అమెరికాతో జరిగిన మ్యాచ్ లో రింకూ విఫలమైన సంగతి తెలిసిందే. దీంతో లీగ్ దశలోనే కాంబినేషన్ ప్రయత్నాలు చేసేందుకు గంభీర్ సంచలన నిర్ణయాలు తీసుకునే ఛాన్స్ ఉంది.

### తొలి మ్యాచ్ లో రింకూ, సిరాజ్ ల ప్రదర్శన..

బుమ్రా స్థానంలో ప్లేయింగ్ 11లోకి వచ్చిన సిరాజ్.. కీలక దశలో అమెరికా 2 వికెట్లు పడగొట్టి, భారత జట్టును ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. తన 4 ఓవర్లలో 29 పరుగులు ఇచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. మరోవైపు రింకూ సింగ్ కేవలం 14 బంతుల్లో 6 పరుగులు మాత్రమే చేశాడు.

### భారత జట్టు తదుపరి మ్యాచ్‌లు..

భారత జట్టు తదుపరి మ్యాచ్ లను పరిశీలిస్తే.. ఫిబ్రవరి 12 న నమీబియాతో, ఫిబ్రవరి 15 న పాకిస్తాన్ జట్టుతో, ఇక చివరి మ్యాచ్ ఫిబ్రవరి 18న నెదర్లాండ్స్ తో తలపడనుంది. ముఖ్యంగా నమీబియాతో మ్యాచ్ లో ప్రయోగాలకే పట్టం కట్టేందుకు గంభీర్ సిద్ధమైనట్లు తెలుస్తుంది. ఆ తర్వాత పాకిస్తాన జట్టుతో మ్యాచ్ జరుగుతుందా లేదా తెలియదు. ఒకవేళ జరిగితే, దాయాదిపై బలమైన జట్టుతో బరిలోకి దిగాలని గంభీర్ చూస్తున్నాడు.

# ఐసీసీ వర్సెస్ పాక్ వివాదంలోకి బంగ్లాదేశ్ ఎంట్రీ..

## ఇండో-పాక్ మ్యాచ్‌పై కొత్త ట్విస్ట్

**టీ20 ప్రపంచకప్ 2026 వేదికగా సాగుతున్న హైడ్రామాలో ఇప్పుడు ఊహించని మలుపు చోటుచేసుకుంది. భారత్ వర్సెస్ పాకిస్థాన్ మ్యాచ్ వివాదం ఇప్పుడు కేవలం రెండు దేశాల మధ్యే కాకుండా, బంగ్లాదేశ్ ప్రమేయంతో సరికొత్త మలుపు తిరిగింది.**





టీ20 ప్రపంచకప్ 2026 వేదికగా సాగుతున్న హైడ్రామాలో ఇప్పుడు ఊహించని మలుపు చోటుచేసుకుంది. భారత్ వర్సెస్ పాకిస్థాన్ మ్యాచ్ వివాదం ఇప్పుడు కేవలం రెండు దేశాల మధ్యే కాకుండా, బంగ్లాదేశ్ ప్రమేయంతో సరికొత్త మలుపు తిరిగింది. ఫిబ్రవరి 15న కొలంబోలో జరగాల్సిన దాయాదుల పోరుపై సందిగ్ధత కొనసాగుతున్న తరుణంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఈ వివాదంలో తలదూర్చడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఈ వివాదానికి బీజం బంగ్లాదేశ్ వేసింది. భారత్‌లో భద్రతా కారణాల దృష్ట్యా తమ గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లను ఇండియాలో ఆడబోమని బంగ్లాదేశ్ మధ్యంతర ప్రభుత్వం తేల్చిచెప్పింది. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని ఐసీసీని కోరింది. అయితే భద్రతాపరమైన ముప్పు ఏమీ లేదని స్వతంత్ర సంస్థల రిపోర్టులు రావడంతో ఐసీసీ ఈ అభ్యర్థనను తిరస్కరించింది. నిర్ణీత గడువులోగా బంగ్లాదేశ్ జట్టు రాకపోవడంతో, ఐసీసీ కఠిన నిర్ణయం తీసుకుంది. బంగ్లాదేశ్‌ను టోర్నీ నుంచి తప్పించి, వారి స్థానంలో స్కాట్లాండ్‌ను గ్రూప్-సి లోకి చేర్చింది. బంగ్లాదేశ్‌ను టోర్నీ నుంచి తొలగించడం అన్యాయం అని, రాజకీయ ప్రేరేపితం అని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆరోపించింది. బంగ్లాదేశ్‌కు మద్దతుగా ఫిబ్రవరి 15న భారత్‌తో జరగాల్సిన హై-ప్రొఫైల్ మ్యాచ్‌ను బహిష్కరిస్తామని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. భద్రత లేదని భావించే చోట ఆడేలా ఏ బోర్డును ఒత్తిడి చేయకూడదని పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ వాదిస్తున్నారు. ఈ డెడ్‌లాక్‌ను తొలగించడానికి బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు అమీనుల్ ఇస్లాం బుల్బుల్ ఇప్పుడు లాహోర్ చేరుకున్నారు. ఆయన పీసీబీ అధికారులతో భేటీ అయ్యి, ఐసీసీ ముందు ఉమ్మడి గళాన్ని వినిపించాలని భావిస్తున్నారు. మరోవైపు భారత్‌తో మ్యాచ్ ఆడాలంటే తాము కొన్ని కండిషన్లు పెడుతున్నామని పాక్ అధికారులు చెబుతున్నారు. ఐసీసీ తన రెవెన్యూ వాటాను పెంచాలని, భారత్‌తో మళ్ళీ ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడేలా హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఒక మ్యాచ్ కోసం ఇలా ఫోర్స్ మెజ్యూర్ క్లాజ్ (నియంత్రించలేని పరిస్థితులు) వాడటం సాధ్యం కాదని ఐసీసీ ఇప్పటికే పాక్‌ను హెచ్చరించింది. ఒకవేళ మ్యాచ్ ఆడకపోతే పాయింట్లు కోల్పోవడమే కాకుండా, భారీ జరిమానాలు, హోస్టింగ్ హక్కుల రద్దు వంటి కఠిన చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చింది. ప్రస్తుతం లాహోర్‌లో ఐసీసీ ప్రతినిధులు, పీసీబీ, బీసీబీ అధికారుల మధ్య త్రైపాక్షిక చర్చలు జరుగుతున్నాయి. ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా కూడా రంగంలోకి దిగారు. మ్యాచ్ జరగకపోతే ఐసీసీకి సుమారు రూ.300 కోట్ల వరకు నష్టం వాటిల్లుతుంది. అయితే లోపాయికారీ చర్చలు సత్ఫలితాలను ఇస్తాయని, భారత్-పాక్ మధ్య మెగా పోరు కచ్చితంగా జరుగుతుందని ఐసీసీ డైరెక్టర్ ఒకరు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని షెహబాజ్ షరీఫ్ తుది నిర్ణయం తీసుకునే వరకు ఈ ఉత్కంఠ కొనసాగుతూనే ఉంటుంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrialp Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787